ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అమరావతి
గుంటూరు
సోమవారం 28 ఆగస్టు 2017 | 20 | 1, 2 ★

జై జై గణేశా..



అమరావతిలో నిమజ్జనానికి క్రేన్ ద్వారా పడవలోకి తరలిస్తున్న గణనాథుని విగ్రహం

10,11

ఇక బియ్యం తూకం పక్కా..!

- ఎంఎల్ఎస్ పాయింట్లలో ఈ-పోస్ యంత్రాలు
- తూకం వేసి డీలర్లకు రేషన్‌సరుకుల సరఫరా

9

కాపు రిజర్వేషన్లకు వ్యతిరేకం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

మెయిన్‌లో

ఇదేంది.. అన్న

బాలింతలు, గర్భిణులకు 'అన్న అమృతం' అందించి మాతా శిశు మరణాలు నివారించాలి. అయితే నాణ్యత లేని సరుకులతో భోజనం తినలేక అమ్మలు.. కాబోయే తల్లులు తల్లడిల్లుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవు. అయినా వీటిల్లోనే అన్న అమృత హస్తం పథకం నిర్వహించాల్సి రావడంతో అటు నిర్వాహకులు.. ఇటు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ అందించే భోజనంలో నాణ్యత లేక పోవడం.. దుడ్డు బియ్యం కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని గర్భిణులు, బాలింతలు ఆరోపిస్తున్నారు. ఈ పథకంలో అందించే సరుకుల కోసం నిత్యం అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం ఓ పరీక్షగా మారిందని వాపోతున్నారు.



మాచర్లలోని కొత్తపల్లి ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నేలపైనే కూర్చొని భోజనం చేస్తున్న గర్భిణులు, బాలింతలు

10,11

- దుడ్డు బియ్యంతో భోజనం
- ఆసక్తి చూపని గర్భిణులు, బాలింతలు
- అన్న అమృతహస్తంలో తగ్గుతున్న నాణ్యత
- అరకొర సౌకర్యాలతో అంగన్‌వాడీ కేంద్రాల్లో అవస్థలు



దేశాభివృద్ధిలో ఏయూ పాత్ర కీలకం

- ఆంధ్ర విశ్వవిద్యాలయ అభివృద్ధికి అ'పూర్వ' సహకారం అందిద్దాం
- ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు
- ఏఎన్‌యూలో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం అమరావతి చాప్టర్ సమావేశం

8

పీజీ ఈ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

8

దుర్గగుడి అభివృద్ధి పనులకు..

వాస్తు బ్రేక్..!

- ఆలయానికి దేవస్థానం మాజీ ఆగమ పండితుడు రాక
- ట్రస్ట్‌బోర్డు సభ్యులకు పలు సూచనలు చేసిన వెంకటేశ్వర సోమయాజులు
- 30న జరగాల్సిన ట్రస్ట్‌బోర్డు సమావేశం వాయిదా

7



సమాజం కోసం జీవించండి

- స్వతంత్ర భారతంలో ఇప్పటికీ ఆర్థిక, సాంఘిక అసమానతలు
- ప్రభుత్వంతో ప్రజలు కూడా కలిసి పనిచేస్తేనే అభ్యున్నతి
- ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

15

కంటి చికిత్సలో ఆధునిక పద్ధతులే



సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. నేత్రాలకు ఏ చిన్న ఇబ్బంది వచ్చినా జీవితం చీకటిమయమే. అటువంటి కన్నుకు సంబంధించి ఆధునిక పద్ధతుల్లో పూర్తిస్థాయిలో కార్పొరేట్ స్థాయి చికిత్సలు అందిస్తున్నామని జీజీహెచ్ నేత్ర వైద్య విభాగాధిపతి డాక్టర్ ఫర్ణీకుమార్ తెలిపారు. కంటివైద్య విభాగంలో లభించే వైద్య సేవలను వివరించారాయన.

జీజీహెచ్‌లో పరికరాలు

పూర్తిస్థాయిలో చికిత్సలు

మన హాస్పటల్ స్పెషాలిటీ



డాక్టర్ ఫర్ణీకుమార్

ఆఫ్తాల్మాలజీ విభాగం అంటే నేత్ర చికిత్సా విభాగం. ఆప్తమా అంటే గ్రీకుభాషలో కన్ను. కంటికి చికిత్సలు అందించే విభాగామే ఇది. జీజీహెచ్‌లో ప్రతిరోజూ 28వ నెంబర్ ఓపీలో పరీక్షలు నిర్వహిస్తారు. 90 బెడ్‌లు ఉన్న ఈ విభాగంలో నాలుగు యూనిట్‌లుగా వైద్యులు చికిత్స నిర్వహిస్తారు. నలుగురు ప్రొఫెసర్లు, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 8 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 22 మంది పీజీ విద్యార్థులతో ఈ విభాగం చికిత్సలను అందిస్తుంది.

ప్రధానంగా వచ్చే సమస్యలు

నేత్ర చికిత్సావిభాగానికి వచ్చే రోగుల్లో 70 శాతం పైగా శుక్లం సమస్యలతో వస్తారు. కంటి పారదర్శక కటకం తెల్లబడిపోవడం... వయసు రీత్యా ఈ సమస్య వస్తుంది. 40 సంవత్సరాలు పైబడిన వారిలో క్ర మేపీ ఈ సమస్య పెరుగుతూ చూపు మందగిస్తుంటుంది. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమం కింద కేంద్రప్రభుత్వం 1976 నుంచి వీటి చికిత్సలను ఉచితంగా అందిస్తోంది. దీనిలోభాగంగానే గతంలో క్యాంప్‌లు నిర్వహించి కంటికి ఆపరేషన్ చేసి బయట అ ద్దాలు అమర్చేవారు. అనంతరం లోపలే అద్దాలు అమర్చే ప్రక్రియ వచ్చిన తరువా త ఆపరేషన్ థియేటర్లలో మాత్రమే సర్జరీలు నిర్వహిస్తున్నారు. లోపలవేసే అద్దాలను కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది. ఈ సర్జరీలు జీజీహెచ్‌లో పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి.

32వ నేత్రదాన పక్షోత్సవాలు

ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు 32వ నేత్రదాన పక్షోత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నేత్రదానంపై అవగాహన కల్పిస్తారు. అందుకు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేకంగా విభాగాన్ని ఏర్పాటుచే శారు. దీని ద్వారా కంటిచూపు ప్రాధాన్యం, మరణానంతరం వేరొకరికి కార్నియా దానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తారు.

నీటి కాసులకు అధునాతన చికిత్సలు

ఒకప్పుడు నీటి కాసులు వ్యాధికి గురైన వారు కంటి చూపును కోల్పోవడం తప్ప పరిష్కారం లేదు. దశాబ్ద కాలం కింద దీనికి చికిత్స అందు బాటులోకి వచ్చినప్పటికీ ఎంతో వ్యయం తో కూడుకున్నది. కంటి నుంచి మెదడుకు సందేశాన్ని పంపేందుకు 1.2 మిలియన్‌ల నరాలు వెళుతుంటాయి. ఈ నరాలు ఒత్తిడికి గురై ఒ క్కొక్క నరం చనిపోవడమే నీటి కాసుల వ్యాధి. ఈ వ్యాధిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మం చిది. ఒక్కసారి చనిపోయిన నరాన్ని తిరిగి తెప్పించలేం. చికిత్స ప్రారంభమైనప్పటి నుంచి నరాలు చనిపోవడాన్ని ఆపగలం. దీంతో చూపు అక్కడితో ఆగుతుంది. దీనికి ఒకప్పుడు జీజీహెచ్‌లో చికిత్స లేదు. కాని ఇప్పుడు అధునాతన సాంకేతిక పరికరాలను తెప్పించి పూర్తిస్థాయిలో చికిత్సను అందిస్తున్నారు. అయితే వీ లైనంత త్వరగా గుర్తించడం మంచి ది. ఈ సమస్యకు గురయ్యేవారు క్రమే పి పక్క చూపును కోల్పోతుంటా రు. వ్యాధి ముదిరే కొద్ది కంటిచూపు తుపాకి గొట్టంలో నుంచి చూసినట్టు ఉంటుంది. ఈ సమస్యను గుర్తిస్తే జీజీహెచ్‌లో అన్ని సదుపాయాలు ఉన్నాయి.

షుగర్ వ్యాధి ఉన్నవారికి మెరుగైన చికిత్సలు


సాధారణంగా చూపు మందగించిన వారిలో షుగర్ లేని వారికి ఒక పద్ధతి... పదేళ్లకుపైన షుగర్ వ్యాధితో బాధపడిన వారికి చూపు మందగించడంలో కారణాలు వేరుగా ఉంటాయి. కంటి పొరలు దెబ్బతినడం వల్ల వీరికి చికిత్స ఒకప్పుడు వ్యయప్రయాసలతో కూడుకునేది. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరు నెల ల క్రితం నుంచి దీనికి చికిత్సను అందిస్తూ ఇక్కడ వైద్యులకు తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతి గురు, శనివారాల్లో ఈ వైద్యులు అందుబాటులో ఉంటారు. ఈ వ్యాధులు ఉన్న వారిలో కంటిలో రక్తస్రావం జరుగుతుంది. అందువల్ల లేజర్ చికిత్స అవసరం. ఈ చికిత్సను ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సహకారంతో జీజీహెచ్‌లో ఉచితంగా అందిస్తున్నారు. షుగర్ వ్యాధితో దశాబ్దానికిపైగా బాధపడుతున్న వారు ప్రతి ఏటా పరీక్షలు నిర్వహించుకొని మందులు వాడటం ద్వారా చూపును కోల్పోయే ప్రమాదం లేదు. వీరికి నిర్వహించే అన్ని పరీక్షలు జీజీహెచ్‌లో ప్రతిరోజు ఉచితంగా నిర్వహిస్తున్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఫర్ణీకుమార్



కంటి వైద్య విభాగం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

కార్నియా సేకరణ

గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడాది కాలం నుంచి కార్నియా సేకరణను ప్రారంభించారు. అంటే మరణించిన వారి నుంచి సేకరిస్తారు. మరణించిన ఆ రు గంటలలోపు దేహం నుంచి తొలగించాల్సిన అవసరం ఉంటుంది. కార్నియాలను సేకరించి కార్నియా లోపంతో బాధపడుతున్న వారికి అమర్చడం వల్ల చూపును అందించిన వారమవుతాం. అయితే జీజీహెచ్‌లో కార్నియా అమర్చే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేదు. త్వరలోనే ఇది వస్తుందని నమ్మకంతో ఉన్నారు. జిల్లాలో ఎవరైనా మృతి చెందినప్పుడు కుటుంబ సభ్యులు, బంధువులు కార్నియాను ఇవ్వదలచుకుంటే సెల్ నం: 96423 51513, 96186 05879 లకు సమాచారం ఇస్తే కార్నియా సేకరిస్తారు. 80 సంవత్సరాల లోపు వారి నుంచే కార్నియాలు సేకరిస్తారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో నెలకు 12మంది నుంచి కార్నియా సేకరణ జరుగుతోంది. కార్నియాను సేకరించి ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు పంపుతున్నారు. అక్కడ కార్నియా మార్పిడి జరుగుతుంది. హెచ్‌ఐవీ, కామెర్లు, వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోవడం వల్ల మరణించిన వారి నుంచి కార్నియాలు సేకరించరు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మరణించిన వారి నుంచి వీటిని సేకరించేందుకు వారి బంధువులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

చిన్నారుల్లో విటమిన్ లోపం

చిన్నారుల్లో ఏ విటమిన్ లోపం కారణంగా కంటి సమస్యలు తలెత్తుతుంటాయి. సాధారణంగా ప్రభుత్వం తరపు నుంచి పాఠశాలల వద్ద ఉచితంగా ఈ పరీక్షలలో విటమిన్ లోపం గుర్తిస్తే ఇంజక్షన్‌ల ద్వారా విటమిన్‌ను అందిస్తారు. పాఠశాలల్లో గుర్తించకపోతే జీజీహెచ్‌లో దీనికి సంబంధించిన పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. పిల్లలను పదేళ్ల వరకు వీలైనంత వరకు టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచడం వల్ల కంటి నరాలపై ఒత్తిడిని తగ్గించవచ్చు. ఒత్తిడి పెరిగితే చిన్న వయసులోనే దృష్టిలోపాలు వచ్చే అవకాశం ఉంది. ఈ లోపం గలవారు వెనుక వరుసలో కూర్చున్నప్పుడు బ్లాక్‌బోర్డును చూడలేకపోవడం, అక్షరాలను గుర్తించలేకపోవడం వంటి వాటిని గమనిస్తే ఉపాధ్యాయులు లేదా తల్లి దండ్రులు వెంటనే అప్రమత్తం కావాలి. కంటి అద్దాలను అమర్చడం ద్వారా ఈ సమస్య పెరగకుండా చూడవచ్చు. కొందరిలో 18 ఏళ్ల వయసు వచ్చే సరికి ఈ సమస్య దానంతట అదే తొలగిపోతుంది. సమస్య తీవ్రమైతే లాసిక్ చికిత్స ద్వారా కంటిలోనే అద్దాలను అమర్చి చూపు కోల్పోకుండా చేయవచ్చు. ఈ విధానం జీజీహెచ్‌లో ఉంది. ప్రతి ఒక్కరూ, ముఖ్యంగా వాహన చోదకులు కంటికి రక్షణగా అద్దాలు ధరించాలి. కారణం దుమ్ము ధూళి పడినప్పుడు కంటి పొరలు దెబ్బతిని క్రమంగా చూపు కోల్పోయే ప్రమాదం ఉంది.

-గుంటూరు (సంగడిగుంట)

నల్లగుడ్డుపై కురుపులు

దీని తరువాత నల్లగుడ్డుపై కురుపులు, కంటి రెప్పపై కురుపులతో ఎక్కువమంది చికిత్సకు వస్తున్నారు. ఎండలో పనిచేయడం, ఎక్కువ వేడి కంటికి తగిలినప్పుడు ఇటువంటి సమస్యలు వెలుగులోకి వస్తుంటాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ, ఫ్యాక్టరీల్లో పనిచేసే వారు దీనిబారిన పడుతున్నారు. ఇవికాకుండా కండ్లకలకలు, కంటి కురుపులు, నీటి కాసులు, షుగర్ వ్యాధి వల్ల వచ్చే రెటినోపతి, కంటి పొరలు వలన కూడా చూపు మందగిస్తున్న వారి సంఖ్య అధికంగా ఉంటోంది.

దృష్టి కోణం మారింది

కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ కృషిచేసి కొద్ది నెలల్లోనే దేశంలో సగానికి సగం అంధత్వ రోగులను తగ్గించింది. ఇప్పటివరకు రోగులకు 6/60గా ఉంటే దృష్టిదోషం ఉన్నట్లుగా భావించేవారు. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఒక కలం పోటుతో దీనిని 3/60గా తగ్గించింది. దీంతో సగానికి పైగా రోగుల సంఖ్య తగ్గింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనలకు అనుగుణంగానే ఈ చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ (ఎన్‌పీసీబీ)గా ఉన్న పథకం పేరును 'నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ అండ్ విజువల్ ఇంపెయిర్‌మెంట్ (ఎన్‌పీసీబీ-వీఐ)గా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ తాజాగా సవరించింది.

నేత్రమే ఓ ప్రయోగశాల

మనిషి ఆరోగ్యం కంటిలోనే తెలుస్తుంది. కంటిని పరీక్షించడం ద్వారా బీపీ, షుగర్, కంట్లో రక్తస్రావం, లుకేమియా కేన్సర్, బ్రెయిన్ ట్యూమర్‌లను గుర్తించవచ్చు. గుర్తించినప్పుడు వెంటనే సంబంధిత వైద్యుల వద్దకు పంపిస్తుంటారు. మనిషిలో రక్తహీనత కంటిలోనూ తెలుస్తుంది. దీని కోసం ఫండస్ పరీక్షలను నిర్వహిస్తూ ఉంటారు.

ఆధునిక పరికరాలు..

కంటి వైద్యవిభాగంలో కంటి నరాలపై ఒత్తిడిని గుర్తించేందుకు అవసరమైన ఫండస్ కెమెరా, ఆర్గాన్ లేజర్ పరికరాలను కూడా సమకూర్చారు. దీంతో ఆధునిక చికిత్సలను అందిస్తున్నారు.

కుటుంబ కలహాలతో భార్యకు ఉరేశాడు



మరియమ్మ మృతదేహం

చేబ్రోలు: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యను హత్యచేసిన వ్యక్తి ఉదంతమిది. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్దల నరసింహారావు, మరియమ్మ వలస కూలీలు. వేజండ్ల గ్రామంలో రైతుల పంట పొలాలకు ఎలుకల మందు పెట్టు కుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం పీకల్దాకా తాగి వచ్చిన నరసింహారావు పొలంలోనే లుంగీని భార్య మెడకు బిగించి ఉరితీశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. నరసింహారావు పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైకు ఢీకొని చూడి ఆవు మృత్యువాత



తెనాలి క్రైం: బైకు ఢీకొని ఆవు మృతి చెందిన సంఘటన ఆదివారం తెల్లవారు జామున స్థానిక ప్రకాశం రోడ్డులో చోటు చేసుకుంది. టూ టౌన్ ఎస్ఐ క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. నాజరుపేటకు చెందిన గోవు రోడ్డుపై వెళుతుండగా ఐతానగర్ వాసి అతి వేగంగా బైకుతో ఢీకొట్టాడు. నిండు చూడితో ఉన్న గోవు అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. పట్టణానికి చెందిన ఒకరి ఫిర్యాదుతో ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జాతిపిత గాంధీజీ విగ్రహం ధ్వంసం



చేయివిరిగిన విగ్రహం

పొట్లూరు(శావల్యాపురం): మండలంలోని పొట్లూరు జడ్పీ పాఠశాలలోని జాతిపిత గాంధీజీ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టిన ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. విగ్రహం ఎడమచేయి, ముక్కును దుండగులు విరగ్గొట్టారు. విగ్రహం దగ్గర పగిలిపోయిన మద్యం సీసాలు, ఖాళీ గ్లాసులు ఉండడంతో మందుబాబులు పగులగొట్టి ఉంటారని అనుమానిస్తున్నారు. ఘటనా స్థలాన్ని రూరల్ సీఐ టీవీ. శ్రీనివాసరావు, శావల్యాపురం ఎస్ఐ సుబ్బారావులు సందర్శించారు. నిందితులను పట్టుకుంటామని వారు చెప్పారు.

నిమజ్జన ఊరేగింపులో ఉద్రిక్తత

● ఎస్ఐపై చేయి చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తులు



రోడ్డుపై బైఠాయించిన రెంటాల వినాయక కమిటీ సభ్యులు



జడ్పీటీసీ భాస్కరరెడ్డిని స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

రెంటచింతల: వినాయక విగ్రహ నిమజ్జన ఊరేగింపులో ఆదివారం రాత్రి ఉద్రిక్తత చోటు చేసుకుంది. రెంటాల గ్రామానికి చెందిన వ్యక్తులు వినాయక విగ్రహంతో బాణసంచా కాల్చుతూ ఆర్కెస్ట్రా, డీజే సౌండ్స్‌తో రెంటచింతల చేరుకున్నారు. ఎస్ఐ కోటేశ్వరరావు తన బృందంతో అక్కడకు చేరుకొని అనుమతి ఉందా లేదా అని ప్రశ్నించారు. గుర్తు తెలియని యువకుడు ఎస్ఐ చొక్కా పట్టి లాగి చేయి చేసుకున్నాడు. దీంతో గందరగోళం నెలకొంది. పలువురు రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. ఎస్ఐ విషయాన్ని ఉన్నతాధికారులకు ఫోన్లో తెలిపారు. గురజాల సీఐ అళహరి శ్రీనివాస్ రంగ ప్రవేశం చేసి విగ్రహ కమిటీ సభ్యులను చెదరగొట్టారు. బస్టాండ్, టీస్టాల్స్ వద్ద ఉన్న వారిపై లాఠీ ఝుళిపించారు. ఇదే సమయంలో గొడవ ఎందుకు అని వారించిన జడ్పీటీసీ నవులూరి భాస్కరరెడ్డితోపాటు మరో వ్యక్తిని చొక్కా పట్టుకొని బలవంతంగా పోలీస్ వాహనంలోకి ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నప్పటికీ అదుపులో ఉంది. ప్రత్యేక బలగాలను రప్పిస్తున్నట్లు సీఐ తెలిపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఉద్రిక్తతలు చోటుచేసుకోవడం మండలంలో ఇదే ప్రథమం.

విష జ్వరాలతో విలవిల

● బొల్లాపల్లి మండలం వెల్లటూరు చెంచు కాలనీ దుస్థితి
● ఇంటికో జ్వరపీడితుడు
● గ్రామంలో పీహెచ్‌సీ ఉన్నా ఫలితం శూన్యం
● ఈపూరు మండలంలోనూ విజృంభించిన జ్వరాలు





మంచం పట్టిన మల్లా శ్రీను, కూతురు వీరలమ్మ. రూ.15 వేలు ఖర్చు చేసినా జ్వరం తగ్గని రమణ

బొల్లాపల్లి: రెక్కాడితేడాని డొక్కాడని పరిస్థితి వీరిది. నిత్యం ఏదో పని చేసుకుని జీవనం సాగించే చెంచులు జ్వరాలతో మంచం పడ్డారు. మండలంలోని వెల్లటూరు చెంచు కాలనీలో విష జ్వరాలు విజృంభించాయి. కుటుంబాలకు కుటుంబాలే మంచం పట్టాయి. కాలనీలోని ప్రతి ఇంట్లోనూ జ్వరపీడితుడు కనిపిస్తున్నాడు. ఇక్కడ ప్రభుత్వ వైద్యం పడకేసింది. పక్కనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉన్నప్పటికీ ఫలితం శూన్యం. జ్వర పీడితులకు ప్రైవేటు వైద్యమే దిక్కయింది.

వెల్లటూరు చెంచు కాలనీలో సుమారు 70 చెంచు కుటుంబాలు ఉన్నాయి. పదిరోజుల నుంచి కొందరికి విషజ్వరాలు వ్యాపించాయి. సకాలంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించకపోవడంతో జ్వరపీడితుల సంఖ్య ప్రస్తుతం 100కు చేరింది. వీరిలో ఎక్కువమంది జ్వరంతోపాటు ఒళ్ళు, కీళ్ళ నొప్పులతో బాధపడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది ఎవరూ లేకపోవడంతో జ్వరపీడితులు ప్రైవేటు ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. ఆవుల ఓబులు కుటుంబంలో 20 మంది ఉంటే వారిలో 15 మంది వారం నుంచి జ్వరంతో మంచం పట్టారు. ఆవుల రమణమ్మ వారం నుంచి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకు రూ.15 వేలు ఖర్చుపెట్టింది. ఇప్పటికీ జ్వరం తగ్గక బాధపడుతూనే ఉంది. ఆవుల సుబ్బయ్య, శివానంద్ శీను, శివకృష్ణ, కావేరి, నాంచారమ్మ, తిరుపమ్మ, కోటమ్మ, అంజమ్మ, చిన్నముత్యాలమ్మ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతోపాటు పారిశుధ్య పనులు చేపట్టాలని చెంచుకాలనీ వాసులు కోరుతున్నారు.

ఈపూరు మండలంలో మంచంపట్టిన పల్లెలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

ఈపూరు: మండలంలో గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. దీంతో వర్షం నీరు రోడ్లపైన, గృహాల మధ్యలో నిల్వ ఉండడంతో ఆ నీటిలో దోమలు వృద్ధి చెంది ప్రజలపై విజృంభిస్తున్నాయి. ప్రతి గ్రామంలో జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈపూరు ప్రభుత్వాసుపత్రిలో రోజుకు సుమారు 150 ఓపీ వస్తుందంటేనే పరిస్థితి గ్రహించవచ్చు. అలాగే ఆర్ఎంపీల వద్దకు వచ్చే రోగుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. ఈపూరు గ్రామానికి చెందిన మహిళ డెంగీ జ్వరంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

పట్టించుకోని వైద్య, ఆరోగ్య శాఖాధికారులు

ప్రభుత్వాసుపత్రులలో పని చేసే వైద్య, ఆరోగ్య అధికారులు జీతాలకే పరిమితమవుతున్నారు. గ్రామస్థాయిలో పర్యవేక్షణ కొరవడింది. గ్రామాలలో తిరిగి రోగాల బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన హెల్త్ ఎడ్యుకేటర్ ఆచూకీ లేదు. ప్రభుత్వాసుపత్రులలో రాత్రి వైద్యులు ఉండరు. ఆదివారం నర్సులు మాత్రమే వుంటారు. దీంతో నిరుపేదలకు వైద్యం అందని ద్రాక్షగానే మారింది. ఇప్పటికైన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని మండల ప్రజలు కోరుచున్నారు.

చేబ్రోలులో మోడల్ పోలీస్ స్టేషన్‌కు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర, పోలీసు ఉన్నతాధికారులు

గుంటూరు/ చేబ్రోలు: మండల కేంద్రం చేబ్రోలులో మోడల్ పోలీస్ స్టేషన్‌కు ఆదివారం శంకుస్థాపన జరిగింది. ప్రస్తుతం చేబ్రోలు పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయం ఉన్న ఆవరణలోనే అత్యాధునిక హంగులతో ఆదర్శ పోలీస్ స్టేషన్ నిర్మించనున్నారు. డీజీపీ నండూరి సాంబశివరావు ఉత్తర్వుల మేరకు మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయి. పోలీస్ శాఖకు చెందిన రెండు ఎకరాల స్థలంలో ఇప్పటికే పోలీస్ స్టేషన్ సర్కిల్ కార్యాలయం ఉన్నాయి. అందులో ఉన్న సువిశాల స్థలంలో ఆదర్శ పోలీస్ స్టేషన్‌ను రెండు అంతస్థుల్లో నిర్మిస్తున్నారు. రెండు వేల చదరపు అడుగుల్లో నిర్మించనున్న ఈ భవనానికి రూ. కోటి 30 లక్షలు కేటాయించారు. ఆరు నెలల వ్యవధిలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గుంటూరులో నిర్మించిన పోలీస్ స్టేషన్ల మాదిరిగా కాకుండా శ్లాబు వేసి మొదటి అంతస్తు నిర్మిస్తున్నారు. ఆదివారం జరిగిన శంకుస్థాపన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, డీఐజీ కేవీవీ గోపాలరావు, అర్బన్ ఎస్పీ విజయరావు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గాను ఆదర్శ స్టేషన్ నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ డీఈ రవికుమార్, అదనపు ఎస్పీలు వైటీ నాయుడు, తిరుపాల్, నార్త్ డీఎస్పీ శ్రీనివాసరావు, చేబ్రోలు సీఐ రవికుమార్‌తో పాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ధ్వని కాలుష్యం నివారించండి

● చవితి వేడుకల్లో అనుమతించిన సౌండ్ బాక్సులనే వాడాలి
● నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు: రూరల్ ఎస్పీ అప్పలనాయుడు



రూరల్ ఎస్పీ అప్పలనాయుడు

గుంటూరు: వినాయక చవితి వేడుకల్లో ధ్వని కాలుష్య నివారణకు నిర్వాహకులు సహకరించాలని రూరల్ ఎస్పీ అప్పలనాయుడు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చవితి వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. చవితి వేడుకలు, నిమజ్జన సమయంలో సౌండ్ బాక్స్‌లను పోలీసుల అనుమతి తీసుకొని నిబంధనల ప్రకారమే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా గుండె జబ్బుతో బాధపడుతున్న వారి పట్ల, వృద్ధులు, చిన్న పిల్లలు, చదువుకునే విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించి వారికి ఇబ్బంది కలగని విధంగా సౌండ్ బాక్స్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జనం తేదీ, సమయం ముందుగా పోలీసులకు తెలిపి ఆ సమయంలో మాత్రమే నిమజ్జనం నిర్వహించుకోవాలని చెప్పారు. రూట్‌ను ముందుగానే అధికారులకు తెలియజేసి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఊరేగింపు సమయంలో అసభ్యంగా ప్రవర్తించినా, మద్యం సేవించి గొడవ చేసినా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవిన్యూ, పోలీస్ సంబంధిత శాఖలు నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే నిమజ్జనం చేయాలన్నారు. అటువంటి ప్రదేశాల్లో ప్రమాదాలు జరగకుండా పలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

రేపు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా..

తాడేపల్లి టౌన్: సీపీఎం కృష్ణనగర్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రకాష్ నగర్‌లో కార్మికుల స్థితిగతులపై సర్వే చేస్తున్న బృందానికి కాలనీవాసులు మున్సిపల్ కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీటిని చూపించారు. సమస్య తీవ్రతకు స్పందించిన సీపీఎం నేతలు మంగళవారం తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రజా ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజలు ఈ ధర్నాలో విరివిగా పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. సర్వేలో సీపీఎం నాయకులు వేముల దుర్గారావు, బూరగ శ్రీనివాస్, దర్శి నరసింహ, మల్లికార్జున్, పవన్ తదితరులు పాల్గొన్నారు.


చిత్ర సమాచారం..



కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలలో పోటీలో ఉన్న టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా ఆ పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి గంజి చిరంజీవి చేనేత వాడల్లో ప్రచారం నిర్వహించారు. ఆయనతోపాటు మంగళగిరి టీడీపీ నేతలు జవ్వాది కిరణ్‌చంద్, ఆరుద్ర సత్యం తదితరులు ఈ ప్రచారంలో పాల్గొన్నారు. **- మంగళగిరి టౌన్**



పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైనుకు తెనాలి రోడ్డు జంక్షన్‌లో లీకేజీ ఏర్పడడంతో మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన జరిపిస్తున్నారు. మునిసిపల్ కమిషనరు ఎన్‌వీ నాగేశ్వరరావు, డీఈ పంచుమర్తి ఏడుకొండలు పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తప్పవని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకుని సహకరించాలని అధికారులు కోరారు. **- మంగళగిరి**



పట్టణంలోని భార్గవపేట ఎస్ఎస్ టాలెంట్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడిని ఆదివారం రాత్రి రంగు రంగుల బెలూన్లతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. **- మంగళగిరి టౌన్**



తాడేపల్లి పట్టణం సీతానగరం శివాలయం వీధిలో ఏర్పాటు చేసిన వినాయక పందిరి వద్ద ఆదివారం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని చినజీయరు స్వామి ఆశ్రమ మేనేజరు వెంకటాచార్యులు ప్రారంభించారు. విగ్రహ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. **- తాడేపల్లి టౌన్**

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మంగళగిరి: పురపాలక సంఘ సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు మునిసిపల్ ఛైర్మన్ గంజి చిరంజీవి అధ్యక్షతన జరుగుతుందని కమిషనరు ఎన్‌వీ నాగేశ్వరరావు తెలిపారు. ఎజెండాలో పొందుపరిచిన 45 అంశాలపై చర్చ జరుగుతుందని, సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

పెనుమాక పంచాయతీ భవనానికి కొత్త సొబగులు..!

- దాతల సాయంతో పంచాయతీ కార్యాలయ భవనం ఆధునీకీకరణ
- రూ.15 లక్షల అంచనా వ్యయంతో రెండంతస్థుల నిర్మాణం



శ్లాబు తొలగించిన పెనుమాక పంచాయతీ భవనం

తాడేపల్లి: శిథిలావస్థకు చేరిన మండలంలోని పెనుమాక గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం కొత్త సొబగులు అద్దుకోనుంది. దాతల సహాయ సహకారాలతో ఆధునికీకరణకు పంచాయతీ పాలకవర్గం శ్రీకారం చుట్టింది. కార్యాలయ భవనాన్ని ఆధునికీకరించాలని పంచాయతీలో తీర్మానం చేసింది. ప్రభుత్వ గ్రాంట్లు, పర్మిషన్లు వగైరాల కోసం వేచి చూడకుండా విరాళాలతో పంచాయతీ భవనాన్ని ఆధునికీకరించాలని పూనుకున్నారు. ఆదర్శ గ్రామం పెనుమాకలో 14 వార్డులు, సుమారు పది వేల జనాభా, ఒక జూనియర్ కళాశాల, జడ్పీ హైస్కూల్, ప్రభుత్వ బాలుర బీసీ హాస్టల్, పలు బ్యాంకులు, సీఆర్‌డీఏ కార్యాలయాలు, ఆలయాలు ఉన్నాయి. గ్రామంలో 1985లో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఇంజినీర్లు పరిశీలించి గోడలు బాగానే ఉన్నాయని, అవి అలానే ఉంచి పైన రెండు శ్లాబులు వేయవచ్చని సూచించడంతో ప్రస్తుతం ఉన్న పంచాయతీ కార్యాలయం భవనం శ్లాబును తొలగించారు. భవనంపై రెండు శ్లాబులు వేసి సిబ్బంది, సర్పంచ్ కార్యాలయాలు, మీటింగ్ హాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ నిర్మాణాలకు సుమారు రూ.13లక్షల నుంచి రూ15 లక్షలు అవసరమవుతాయని అంచనాలు వేశారు. విరాళాలు సేకరించి దాతల పేర్లు శిలాఫలకంపై కూడా వేయాలని నిర్ణయించారు. దాతల నుంచి వసూలైన నగదు చాలకపోతే నిర్మాణానికయ్యే ఖర్చు తానే భరిస్తానని గ్రామ సర్పంచ్ కళ్లం పానకాలరెడ్డి ముందుకురావడంతో పెనుమాక పంచాయతీకి కార్యాలయ భవనం సమకూరేందుకు మార్గం సుగమమైంది.

పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తా..



పెనుమాక గ్రామ పంచాయతీని దాతల సహకారంతో ఆధునికీకరించాలని తీర్మానించాం. విరాళాలు సరిపోకపోతే అవసరమైన నిధులు విరాళంగా ఇచ్చి నిర్మాణం పూర్తి చేస్తాం. అందరి సహకారంతో పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తాం. పంచాయతీలో నిధుల కొరత ఉంది. ఉన్న నిధులను ఇప్పటికే పలు ప్రాంతాల్లో డ్రెయిన్లు, రోడ్లు వేసేందుకు అంచనాలు వేయించాం. **- కళ్లం పానకాలరెడ్డి, సర్పంచ్**

కృష్ణానదిలో గణేష్ నిమజ్జనాలు





నిమజ్జనానికి తరలివచ్చిన గణనాథుడు, కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు తోడ్కొని వెళ్తున్న భక్తులు

తాడేపల్లి టౌన్: పట్టణ పరిధిలోని సీతానగరం వద్ద కృష్ణానదిలో ఆదివారం పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహ నిమజ్జనాలు జరిగాయి. స్థానికులే కాకుండా సమీప ప్రాంతాల నుంచి యువకులు వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తీసుకువచ్చారు. అనేక మంది మహిళలు, యువకులు, విగ్రహ కమిటీ వారు పెద్ద సంఖ్యలో నదీ తీరానికి చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. వాహనాలపై తీసుకువచ్చిన గణనాథులను ఘాట్ల మీదుగా తీసుకువచ్చి నదిలో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు, మున్సిపల్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విగ్రహాలతోపాటు వచ్చే యువకులను పరిమిత సంఖ్యలో నదిలోకి అనుమతిస్తూ గజ ఈతగాళ్ల సహాయంతో నిమజ్జన కార్యక్రమం చేపడుతున్నారు. రాత్రి సమయంలో దూర ప్రాంతాల నుంచి విగ్రహాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు.

బీజేపీ ఓబీసీ మోర్చా మండల కమిటీ ఎన్నిక



ఓబీసీ మోర్చా నియామకపత్రాలు అందజేస్తున్న గాదె సాంబశివరావు

తాడేపల్లి: బీజేపీ ఓబీసీ మోర్చా తాడేపల్లి మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు గాదె సాంబశివరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు కార్యకర్తలు, నేతలు విచ్చేశారు. బీజేపీ మోర్చా ఓబీసీ మండల కమిటీ అధ్యక్షుడిగా బచ్చు శివశంకరరావు, కార్యదర్శిగా ఎం.గోపాలకృష్ణ ఎన్నికయ్యారు. వారికి సాంబశివరావు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ మోదీ చేపట్టిన సంస్కరణలు అమూల్యమైనవని, ప్రపంచ దేశాలు హర్షిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పెనుమాకకు చెందిన బళ్లా మురళీ, అమీర్, రమేష్ తదితరులు బీజేపీలో చేరారు. వీరికి నేతలు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మేకల జాన్‌బాబు, కార్యదర్శి పోలుశెట్టి నరసింహారావు, కోశాధికారి గోరంట్ల సాంబశివరావు, సీనియర్ నేతలు ఎంవీఎల్ఎన్ రాజు, కోటిపల్లి వీరాంజనేయులు, సత్యనారాయణ, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రేపు యార్లగడ్డ సుబ్బారావు వర్ధంతి సభ

మంగళగిరి: దివంగత సీపీఐ నేత యార్లగడ్డ సుబ్బారావు 19వ వర్ధంతి సభ ఈ నెల 29వ తేదీ ఉదయం మండలంలోని చినకాకాని సీపీఐ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నట్టు ఏపీ రైతు సంఘం మంగళగిరి ఏరియా కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యార్లగడ్డ వర్ధంతి సందర్భంగా ఉదయం 9 గంటలకు చినకాకాని ఎన్నారై ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్ కార్యదర్శి డాక్టర్ మంతెన నరసరాజు ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తారని, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, మంగళగిరి నేతలు పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో చినకాకాని సర్పంచ్ నాగేశ్వరరావు, మంచా వెంకటగిరి, జూటు శంకరరావు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

ఊర్వశి	ఆనందో బ్రహ్మ
గోపాలకృష్ణ	ఫిదా
వెంకటేశ్వర	నేనే రాజు.. నేనే మంత్రి
విజయ	జయజానకీ నాయక

హలో.. ఆంధ్రజ్యోతి

మీ ప్రాంతంలో సామాజికపరమైన (వ్యక్తిగతమైనవికాదు) సమస్యలు ఉన్నాయా? ఫోన్ చేసి ఆంధ్రజ్యోతికి తెలపండి. ఆ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారి దృష్టికి తీసుకువెళ్తాం.

సమయం : ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య

ఫోన్ నెంబర్ : 9985411231

రైతులకు మేలు కలగాలి

బలరాం జయంతి సభలో జలగం కుమార స్వామి



మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి

విజయవాడ : వ్యవసాయ అనుబంధ పంటలు విస్తరించి రైతులకు మేలు కలగాలని రాష్ట్ర కిసాన్ సంఘ్ అధ్యక్షుడు జలగం కుమార స్వామి అన్నారు. బలరాం (నాగలి) జయంతి సందర్భంగా బారతీయ కిసాన్ సంఘ్, గో ఆధారిత వ్యవసాయ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పటమట ఫన్‌టైమ్స్ క్లబ్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బలరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆర్గానిక్ మందులు వాడకం నివారించి పాత పద్ధతులను అవలంబించి వ్యవసాయ ఉత్పత్తులను పండించాలన్నారు. వ్యవసాయ ఉత్తత్తులకు పేరొందిన ఏపీలో రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులను పండించే రైతులకు గిట్టుబాటు ధర నిర్ణయించుకునే అవకాశాన్ని కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, కార్యదర్శి శ్రీకృష్ణ, గోఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం రాష్ట్ర కోశాధికారి ఆశా కిరణ్, నారాయణ ప్రసాద్, ఫన్‌టైమ్స్ కార్యదర్శి వేమూరి సాంబశివరావు, ఉమామహేశ్వరరాజు, గాంధీ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మనసుకు, భాషకు అవినాభావ సంబంధం : పాల్



మాట్లాడుతున్న సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పాల్

పటమట : మనసుకు భాషకు అవినాభావ సంబంధం ఉంటుందని ఆంధ్రప్రదేశ్ సైకాలజిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి యు.పాల్ అన్నారు. త్రివేణి మహిళా డిగ్రీ కళాశాలలో ఆదివారం సైకాలజిస్టులు, ఉపాధ్యాయులకు నాచురల్ ప్రొనౌన్‌షేషన్ లాంగ్వేజ్ (ఎన్‌ఎల్‌పీ, సహజ భాష)పై ఒకరోజు శిక్షణ జరిగింది. పాల్ మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు, మహిళలు, యువత ఏ రంగంలో పనిచేస్తున్నా ఆ రంగంలో ఉన్నత లక్ష్యాలను సాధించడానికి ఎన్‌ఎల్పీ అద్భుతమైన ప్రక్రియయన్నారు. రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు వి. రమేష్, ప్రత్యూష సుబ్బారావు ఎం.ఎం. ముఖర్జీ, ఎమ్. రాణి, సోమయాజులు పాల్గొన్నారు.

నేత్రదానానికి యువత ముందడుగు



నేత్ర దాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న డాక్టర్ సమరం

విజయవాడ: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా పటమట తొమ్మిదో డివిజన్‌కు చెందిన యువజన చైతన్య వేదిక నాయకులు మరణానంతరం తమ నేత్రాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. వీరు యువజన వేదిక అధ్యక్షుడు బెజవాడ నజీర్ ఆధ్వర్యంలో 10 మందికి పైగా ఆదివారం బెంజ్‌సర్కిల్‌లోని స్వేచ్ఛా గోరా ఐ బ్యాంకుకు వెళ్ళి నేత్రాలు ఇవ్వడానికి అంగీకరిస్తూ పత్రాలను అందజేశారు. నజీర్ మాట్లాడుతూ నేత్రదానం ద్వారా మరొకరికి జీవితం ఇచ్చినట్టేనన్నారు. అనంతరం వీరికి డాక్టర్ సమరం నేత్రదాన సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో యువజన చైతన్య వేదిక నాయకులు మీసాల నాగభూషణం, మీసాల జనార్దన్, యు. సత్యనారాయణ, బంగారు రాజీవ్ గాంధీ, జి. మాణిక్యాలరావు, మల్లికార్జున్, పోలి రాజ తదితరులు పాల్గొన్నారు.

● నిమజ్జనానికి తరలిన బొజ్జ గణపయ్య



మండలంలోని నవులూరు గోలి వారి తోటలో ఘనంగా మేళతాళాలు, కనక తప్పెట్లతో వినాయక ఊరేగింపు జరుపుతున్న విగ్రహ కమిటీ సభ్యులు.
-మంగళగిరి రూరల్

ద్వారకానగర్‌లో మెగా వైద్య శిబిరం

● 1270 మందికి వైద్య పరీక్షలు ● ఔషధాల పంపిణీ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శివన్నారాయణ

మంగళగిరి: జనవిజ్ఞాన వేదిక మంగళగిరి డివిజన్ కమిటీ, జీబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ద్వారకానగర్ ఎస్‌ఎల్‌ఎం చైతన్య హైస్కూల్ ఆవరణలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగరు, ఫిట్స్, పక్షవాతం తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సుమారు 1,270 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్టు డాక్టర్ గోపాళం శివన్నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయప్రదా దేవి, వెలగా శ్రీనివాసరావు, కోమలి, మహేష్, శిందె రామసుబ్బారావు, కృష్ణప్రసాద్, శిందె వెంకటేశ్వరరావు, జనవిజ్ఞాన వేదిక డివిజన్ నాయకులు ఏబీ కుటుంబరెడ్డి, ఏ.సాంబిరెడ్డి, కొల్లి నాగేశ్వరరావు, తాతిరెడ్డి, అంకెం సాంబశివరావు, గాదె నాగిరెడ్డి, పమిడిమళ్ల సాంబిరెడ్డి, ఉయ్యాల సత్యనారాయణ, నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థులు, స్టూడెంట్స్ యూనియన్ ఫర్‌నేషన్, చైతన్య హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నంబూరు, వెనిగండ్లలో పర్యటించిన ఎమ్మెల్యే నరేంద్ర

● ఆయా గ్రామాల్లో వినాయకునికి ప్రత్యేక పూజలు



పెదకాకానిలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నరేంద్ర

పెదకాకాని : మండలంలోని నంబూరు, వెనిగండ్ల, ఉప్పలపాడు గ్రామాల్లో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో వాడవాడల్లో వెలిసిన వినాయకుడి విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు. తొలుత నంబూరులో పర్యటించిన ఎమ్మెల్యే నాగారపమ్మ గుడి సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని సందర్శించి ప్రత్యేక అభిషేక పూజల్లో పాల్గొన్నారు. పెదకాకానిలో సగరపాలెం, వెనిగండ్లలోని యాదవపాలెం ప్రాంతాల్లో, ఉప్పలపాడు గ్రామాల్లో పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సంగం డెయిరీ డైరెక్టర్ బుర్రా రామారావు, నంబూరు నాయకులు మాకిరెడ్డి జయరామిరెడ్డి, జొన్నల మురళీకృష్ణారెడ్డి, సాంబిరెడ్డి, దూపాటి వెంకటరావు, సిద్దారెడ్డి, బుల్లా గురవయ్య, ఆలపాటి సత్యనారాయణ, ఉయ్యూరు నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి : సీపీఐ

పెదకాకాని : అగ్రిగోల్డ్ బాధితులకు నష్ట పరిహారం తక్షణమే చెల్లించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం నుంచి అనంతపురం వరకు ఈ నెల 16 నుంచి ప్రారంభించిన బస్సు యాత్ర ఆదివారం పెదకాకాని చేరుకుంది. ఈ సందర్భంగా పెదకాకాని శివాలయం సెంటర్‌లో సీపీఐ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి కొల్లి రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 19.52 లక్షల మంది కస్టమర్లలో రూ.20 వేల లోపు దాచుకున్న వారు 13 లక్షల మంది ఉన్నారని, వీరికి తక్షణమే పరిహారం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగస్టీన్, ఉప్పాల సత్యనారాయణ, సంగీతరావు, పార్టీ కార్యకర్తలు, పలువురు అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

31 లోగా పాన్‌కార్డ్‌కు ఆధార్ లింక్

ఆదాయ పన్నుశాఖ గడువు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఆదాయ పన్ను చెల్లింపు దారులతో పాటు, ఇటీవల కొత్తగా రిటర్న్‌లు దాఖలు చేసినవారు ఈనెల 31 లోగా తమ పాన్ నెంబర్లకు ఆధార్ లింక్ చేయాలని ఆదాయపు పన్ను శాఖ సూచించింది, సుప్రీం కోర్టు ఇటీవల ఆధార్‌పై ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఆధార్ లింక్ చేయకుండా వుండటానికి వీలులేదని ఆదాయ పన్నుశాఖ ప్రకటిం చింది. ఆదాయ పన్ను రిటర్న్‌లు దాఖలు చేసిన వారిలో ఇప్పటివరకు సగం మంది మాత్రమే ఆధార్‌తో లింక్ అయినట్లు గుర్తించింది. అయితే మరొకొంత మంది ఆధార్‌లింక్ అయినప్పటికీ రిటర్న్‌లు దాఖలు చేసి రిజిస్టర్ చేయించుకోలేదని కూడా వెల్లడించింది. అయితే దాఖలు అయిన రిటర్న్‌లలో ఇప్పనటివరకు నాలుగో వంతు రిటర్న్‌లను ఇ- వెరి ఫికేషన్‌ను నిర్వహించినట్లు తెలు స్తోంది. ఉదాహరణకు సుమారు లక్ష మంది రిటర్న్‌లు దాఖలు చేస్తే వారిలో 25 వేల రిటర్న్‌లను మాత్రమే ఇ వెరిఫికేషన్ అయ్యాయి. ఇ వెరిఫికేషన్‌లో ఏదైనా తేడాలు వచ్చినట్లయితే వాటిని సరి చేసుకోవాలని లేక పోతే నోటీసు వచ్చే అవకాశం ఉంది.

29బి చెల్లదు..

ఆదాయ పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లు దాఖలు చేయడానికి గాను ఫారం 29బి ద్వారా ఒక డిక్లరేషన్ ఇచ్చేవారని, ఇప్పుడు అది చెల్లదని కొత్త ఫార్మెట్‌లో డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుం దని, దీనిని త్వరలోనే ప్రకటిస్తామని ప్రత్యక్ష పన్నుల బోర్డు ప్రకటించింది. ఇ ఫైలింగ్ చేసే వారికి త్వరలో కొత్త ఫార్మెట్ అందుబాటులోకి వస్తుందని, అప్పటి దాకా వేచి ఉండాలని సూచించింది.

ఈపోస్ ద్వారానే ఎరువుల పంపిణీ

వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్

పెనమలూరు : కేంద్రం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి అమలులోకి తీసుకురానున్న ఈపోస్ ద్వారానే రైతులకు ఎరువులు డీలర్లు పంపిణీ చేయాల ని అగ్రికల్చరల్ జాయింట్ డైరెక్టర్ నరసింహారావు తెలిపారు. ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. పోరంకి సాయి కల్యాణ మండపంలో జిల్లా ఆదివారం ఎరువులు, పురుగుల మందుల రిటైల్ డీలర్ల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గతంలో వలే ఎరువుల దుకాణం వద్దకొచ్చి రైతు ఎన్ని బస్తాలు కావాలంటే అన్ని అందించే విధానానికి స్వస్తి పలకాలని, రసీదులు ఇక ఉండదన్నారు. భూమి విస్తీర్ణత, సాయిల్ టెస్ట్ ద్వారా ఆ రైతుకు చెందిన భూమికి ఎంత మేరకు ఎరువులు అవసరమవుతాయో ఈపోస్ విధానంలో తెలిసిపోతుందన్నారు. రైతు ఆధార్, వేలిముద్ర వల్ల అతనికి చెందిన వ్యవసాయ పద్ధతి, విధివిధానం మొత్తం తెలిసిపోతుందన్నారు. అదే విధంగా జీఎస్టీ తప్పక అమలు చేయవల్సి ఉంటుందన్నారు. సంఘ అధ్యక్షుడు విజయ్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సునీత కుమార్, డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

బోయపాలెం అడ్డాగా గంజాయి విక్రయాలు

నూలు, క్వారీ కార్మికులే లక్ష్యం

యడ్లపాడు: పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మండలంలోని బోయపాలెం గంజాయి విక్రయాలకు అడ్డాగా మారుతోంది. నూలు, క్వారీ పరిశ్రమలలో పనిచేసే కార్మికులను లక్ష్యంగా చేసుకుని కొందరు గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నారు. బోయపాలెంలోని పార్వతీపురం ఏరియాతోపాటు, పెట్రోలు బంకు సమీపంలోని దాబాహోటల్, బోయపాలెం - కొండవీడు, బోయపాలెం - ఉన్నవ మార్గాలలో విక్రయాలు సాగుతున్నట్లు సమాచారం. పార్వతీపురం ఏరియాలోని పంజాబీ హోటల్ యజమానిని పోలీసులు గత మంగళవారం అదుపులోకి తీసుకోవడంతో ఈ ప్రాంతం గంజాయి విక్రయాలకు అడ్డాగా మారినట్లు వెల్లడైంది. ఈ ఏరియాలోనే పలు డాబాహోటళ్ళు, వైన్‌షాపులు ఉన్నాయి. దీనితో వ్యాపారులు ఏం విక్రయిస్తున్నారో, కొనుగోలుదారులు ఏం కొంటున్నారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. పార్వతీపురం ఏరియా ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉంది. మండల కేంద్రం ఈ ప్రాంతానికి సుమారు 12 కి.మీల దూరంలో ఉండడంతో పోలీసుల నిఘా ఈ ప్రాంతంపై అంతంత మాత్రమే. పైగా మామూళ్ళ కోసం తప్ప ఈ ప్రాంతంలో జరిగే అసాంఘిక కార్యక్రమాలను అదుపు చేసేందుకు పోలీసులు ఏ మాత్రం శ్రద్ధ చూపడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గత రెండేళ్ళుగా గంజాయి విక్రయాలు జరుగుతున్నా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పరిశ్రమల యజమానులు, ప్రజలు వాపోతున్నారు.

స్థానికేతరులే అధికం..

ప్రత్తిపాడు, యడ్లపాడు మండలాలకు మధ్యన తుమ్మలపాలెం, వంకాయలపాడు పంచాయితీల పరిధిలో జాతీయ రహదారికి ఇరువైపులా బోయపాలెం విస్తరించి ఉంది. దీనితో ఈ గ్రామం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతూ వస్తోంది. గతంలోనే ఈ ప్రాంతం స్టోన్‌క్రషర్‌లు, మెటల్ విక్రయాలకు ప్రసిద్ధిగాంచింది. దీనికితోడు గత పదేళ్ళలో 10కి పైగా నూలు పరిశ్రమలు ఈ ప్రాంతంలో ఏర్పాటయ్యాయి. పరిశ్రమలలో పనిచేసేందుకు యజమానులు వివిధ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో ఈ ప్రాంతానికి కార్మికులు రప్పించారు. వీరిలో సగానికిపైగా ఒడిసా రాష్ట్రానికి చెందిన వారే. దీంతో ఈ గ్రామంలో స్థానికుల కన్నా స్థానికేతరులే అధికంగా నివాసం ఉంటున్నారు.



పార్వతీపురం పరిధిలోని పంజాబీ ధాబా

కార్మికులే లక్ష్యంగా విక్రయాలు..

నూలు, క్వారీ పరిశ్రమలలో పనిచేసే కార్మికులే లక్ష్యంగా గంజాయి విక్రయాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఒడిసా రాష్ట్రానికి చెందిన యువకులు గంజాయికి బానిసలైనట్లు తెలుస్తోంది. మద్యానికి అలవాటుపడిన వీరు అధిక ధర చెల్లించి మద్యం కొనుగోలు చేయలేక తక్కువ ధరకు లభించే గంజాయివైపు మొగ్గుచూపుతున్నారు. రాత్రివేళల్లో గుట్టుగా సాగే ఈ వ్యాపారానికి ఈ ప్రాంతం వేదికగా మారింది. ఒడిసా, ఏజెన్సీ ప్రాంతాల నుంచి కొందరు గంజాయిని అక్రమంగా ఈ ప్రాంతానికి చేరవేస్తుంటారని చెబుతున్నారు. గ్రాము పొట్లాలుగా కట్టి రూ.100కు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. సోమవారం స్థానిక నూలు మిల్లులో పనిచేసే ఇద్దరు ఒడిసా కార్మికులు గంజాయి తాగుతూ పట్టుబడడంతో మిల్లు యాజమాన్యం ఒక్కసారిగా ఉలిక్కిపడి పోలీసులకు సమాచారం అందించింది.

విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు: నూలు మిల్లు ఉద్యోగి

గంజాయిలాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడిన కొందరు కార్మికులు విధులకు కూడా సక్రమంగా హాజరుకావడం లేదని ఈ ప్రాంతంలోని నూలు మిల్లులో పనిచేసే ఓ ఉద్యోగి తెలిపారు. గంజాయి తాగి తరచూ గొడవలకు పాల్పడుతుంటారనీ, వారిలో వారే కొట్టుకుంటారనీ చెప్పారు. గంజాయి విక్రయాలను అరికట్టకుంటే ఈ ప్రాంతం మాఫియాకు కేంద్రంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

మానేసిన విద్యార్థులపై వేధింపులు తగవు

ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యంపై టీడీపీ నేత కనపర్తి ధ్వజం

ఆంధ్రజ్యోతి, గుంటూరు: ఇంజనీరింగ్ కళాశాలలో చేరి ఆనివార్య కారణాలతో మధ్యలో చదువు మానేసిన విద్యార్థినీ, విద్యార్థులకు ఒరిజనల్ సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వకుండా కళాశాల యాజమాన్యాలు వారిని తీవ్రంగా వేధిస్తున్నాయని టీడీపీ జిల్లా ఆధికార ప్రతినిధి కనపర్తి శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు ఇంజనీరింగులో సబ్జెక్టు అర్థం కాకపోవడం, ఆర్థిక, ఆనారోగ్యపరమైన కారణాలవల్ల చదువు మానేస్తే వారికి వేరే అవకాశాలు లేకుండా కళాశాలల యాజమాన్యాలు అడ్డుకుంటున్నాయని అన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు యూజీసీ, రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖాధికారులు స్పందించి కోర్సు మధ్యలో ఆపివేసిన విద్యార్థులకు చదవిన విద్యా సంవత్సరాలకు మాత్రమే ఫీజు వసూలు చేయాలని, మిగిలిన సంవత్సరాలకు ఫీజు వసూలు చేయకుండా సర్టిఫికెట్లను తిరిగి ఇవ్వాలన్న ఆదేశాలను యజమాన్యాలు ధిక్కరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి గంటా శ్రీనివాసరావు స్పందించి అధికారులతో చర్చించి కళాశాలల యాజమాన్యాలకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కనపర్తి కోరారు.

గుంటూరులో ఐ డయాగ్నోస్టిక్స్ సెంటర్ ప్రారంభం


ఐ డయాగ్నోస్టిక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ తారక్‌నాథ్

గుంటూరు (మెడికల్): గుంటూరులో అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరికరాలతో ఐ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌ను ప్రారంభించడం హర్షణీయమని సుప్రసిద్ధ శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణ పేర్కొన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యాధునిక రోగ నిర్ధారణ పరికరాలతో గుంటూరు నగరం కొత్తపేట యడవల్లి వారివీధిలో ఐ డయాగ్నోస్టిక్స్ సెంటర్‌ను ఆదివారం ప్రారంభించారు. డాక్టర్ గోపాలకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేయగా, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ వీఆర్ తారక్‌నాథ్ డయాగ్నోస్టిక్‌ను ప్రారంభించారు. గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్బారావు అల్ట్రాసౌండ్ స్కానింగ్ విభాగం, ప్రభుత్వ సమగ్రాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ రాజునాయుడు ఎక్స్‌రే, సీఆర్మ్ ఇమేజ్ విభాగాలను ప్రారంభించారు. జీజీహెచ్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్వీ సుందరాచారి సీటీ స్కాన్ విభాగం, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ టీ నాగేశ్వరరావు పీఏసీఎస్ విభాగం, రేడియాలజిస్ట్ డాక్టర్ కే సుశీల్‌కుమార్ 1.5 టెస్లా ఎంఆర్ఐ విభాగం ప్రారంభించారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధి, సోనాలజిస్ట్ డాక్టర్ నాగళ్ల కిషోర్ డాక్టర్స్ చాంబర్‌లను ప్రారంభించారు. డాక్టర్ కొండబోలు బసవపున్నయ్య మాట్లాడుతూ అడ్వాన్స్‌డ్ ఫిలిప్స్ డిజిటల్ బ్రాడ్‌బ్రాండ్ ఎంఆర్ఐ విత్ ఆల్ డెడికేటెడ్ కాయిల్స్, కేన్సర్ స్క్రీనింగ్‌లో అవసరమయ్య హోల్‌బాడీ ఎంఆర్ఐ స్కానింగ్ అందుబాట్లోకి తేవడం అభినందనీయమన్నారు. ఐ డయాగ్నోస్టిక్స్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ రమాదేవి, డాక్టర్ సుష్మిత మాట్లాడుతూ తమ సెంటర్‌లో వితౌట్ కాంట్రాస్ట్ యాంజియోగ్రామ్ వంటి ఆధునిక వసతులు ఉన్నట్లు తెలిపారు.

రైలుకిందపడి గుర్తుతెలియని యువకుడి మృతి



గుంటూరు(సంగడిగుంట): మంగళగిరి, తాడేపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య శనివారం ఓ యువకుడు రైలుకింద పడి మృతి చెంది ఉండడాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. యువకుడి వయసు సుమారు 17 ఏళ్ల ఉండొచ్చు. శరీరంపై బ్లూ కలర్ టీ షర్టు ధరించి ఉన్నాడు. గుర్తించిన వారు గుంటూరు రైల్వే జీఆర్పీ సీఐ రమేష్‌బాబుకు 9440627546లో సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.

రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి, 9 మందికి గాయాలు

నూజండ్ల: మండలంలో ఆదివారం జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఒక మహిళ మృతి చెందగా, తొమ్మిదిమందికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం... వినుకొండ పట్టణానికి చెందిన కొందరు ప్రకాశం జిల్లా తూర్పుగంగవరం వెళ్లి ఆటోలో తిరిగి వస్తున్నారు. రాముడుపాలెం సమీపంలో ఆటో అదుపుతప్పి పడిపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న షేక్ ఖైరూన్(35) మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన షేక్ రఫీ, ఖాదీమా, ఖాసింబీ, మహబూబ్ సుభాని, దరియా హుస్సేన్, ఆటో డ్రైవర్ ఇస్మాయిల్‌ను 108 వాహనం ద్వారా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మరో ఘటనలో రాముడుపాలెం తండాకు చెందిన కే చిన్నానాయక్, ఎం శివానాయక్‌లు మోటార్‌బైక్‌పై నూజండ్ల వస్తుండగా రోడ్డు పక్కనున్న కల్వర్టును ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

అర్బన్ హెల్త్ ఉద్యోగుల్ని ప్రభుత్వం ఆదుకుంటుంది: మన్నవ

ఆంధ్రజ్యోతి, గుంటూరు: రాష్ట్రంలోని అర్బన్ హెల్త్ ఉద్యోగులకు ప్రభుత్వం గౌరవ వేతనంతోపాటు మరిన్ని సౌకర్యాలను కల్పిస్తుందని గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ మన్నవ సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు గుంటుపల్లి శేషగిరిరావు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మన్నవ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, కార్మికుల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగస్థులు కోరుకునే వేతనాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడతామని వారికి భరోసా ఇచ్చారు. జిల్లాలో టీఎన్‌టీయూసీ అభివృద్ధికి ఆహర్నిశలు కృషి చేస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు గుంటుపల్లి శేషగిరిరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాల్‌వజీర్, ఏపీ తెలుగునాడు అర్బన్ హెల్త్ సెంటర్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు ప్రసన్నకుమార్, నారా జోషి, భానుమతి, లక్ష్మీనారాయణ, మునీశ్వరి, శోభన్, ఏపీ హస్త కళల డైరెక్టర్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.


గుంటూరులోని టీడీపీ కార్యాలయంలో సమావేశంలో ప్రసంగిస్తున్న యార్డు చైర్మన్ మన్నవ

వైసీపీ నాటకంలో కీలుబొమ్మ ఐవైఆర్

● బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ శ్రీధర్

గుంటూరు: వైసీపీ ఆడుతున్న నాటకంలో కీలుబొమ్మ ఐవైఆర్ అని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ జిల్లా కోఆర్డినేటర్ సిరిపురపు శ్రీధర్ విమర్శించారు. బ్రాడీపేటలోని కార్పొరేషన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో అనేక పదవులు అనుభవించిన ఐవైఆర్... వైసీపీ అద్దె మైకులా ఎన్నికల సమయాల్లో బయటకు వస్తూ అభాసుపాలు కావద్దన్నారు. గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన ఐవైఆర్ ఇకనైనా జగన్ స్క్రిప్ట్ చదవడం మానుకుంటే మంచిదన్నారు. జగన్ ఎన్ని కుయుక్తులు పన్నినా, ఎన్ని జన్మలు ఎత్తినా బ్రాహ్మణులు టీడీపీ వెంటే ఉంటారన్నారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి బ్రాహ్మణ కుటుంబానికి లబ్ధి కలిగేలా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ముందే గవర్నర్‌తో మాట్లాడి ఐవైఆర్‌కు చీఫ్ సెక్రటరీ పదవి కట్టబెట్టారన్నారు. ఉద్యోగ విరమణ చేయగానే బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని అప్పచెప్పారన్నారు. అయితే ప్రభుత్వ పదవిలో ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తల్లి, పిల్ల కాంగ్రెస్ కనుసన్నల్లో ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారన్నారు. ఆ పదవి నుంచి తొలగించాక ప్రజలకు ఐవైఆర్ అసలు రూపం ఏమిటో తెలిసిందన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న శ్రీధర్, రాజ్‌కుమార్, జ్ఞానేశ్వర్, వేదాంతం లక్ష్మణ్

ఈ సమావేశంలో టీడీపీ బ్రాహ్మణ నాయకులు వేమూరి రాజ్‌కుమార్, గుండు జ్ఞానేశ్వర్, వేదాంతం లక్ష్మణ్, రవికృష్ణ, శ్రీనివాస శర్మ, మోదుకూరు సాయికుమార్ పాల్గొన్నారు.



లాభం.. లూటీ!

వాహన డీలర్ల భోజ్యానికి.. వినియోగదారులకు లభించే జీఎస్టీ రిలీఫ్ సొమ్ము కాస్తా స్వాహా అవుతోంది. నగరంలోని కొందరు వాహన డీలర్లు ఈ నయా దందాకు తెరలేపారు! జీఎస్టీ ప్రయోజనాలను వినియోగదారులు అందుకోగలుగుతున్నారా లేదా అన్నది పక్కాగా తెలుసుకునే ఎన్‌ఫోర్స్‌మెంట్ లేకపోవటంతో.. ఈ దందా యథేచ్ఛగా సాగిపోతోంది.

- జీఎస్టీ ప్రయోజనం.. వాహన డీలర్ల భోజ్యం
- వినియోగదారులకు ప్రయోజనం నాస్తి
- కొందరు వాహన డీలర్ల నయా దందా
- ఫిర్యాదులతో తలలు పట్టుకుంటున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

జీఎస్టీ ప్రయోజనాలపై చాలామందికి అవగాహన లేక మోసపోతున్నారు. జీఎస్టీపై కొద్దో, గొప్పో అవగాహన ఉన్న వారు వాహనాలు పాత ధరకే విక్రయిస్తున్నారని, వాహనాల ధరలు తగ్గటం లేదని రవాణాశాఖ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ ఫిర్యాదులతో రవాణా శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. జీఎస్టీకి సంబంధించి ఎన్‌ఫోర్స్ చేసే అధికారం తమది కాదని రవాణా శాఖ భావిస్తోంది. జీఎస్టీని అమలు చేసే బాధ్యత ఆ శాఖకు సంబంధించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పర్యవేక్షించాల్సి ఉంటుంది. అసలు జీఎస్టీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగమే లేకపోవటం వల్ల సమస్య ఏర్పడుతోంది. వాహనదారుల జేబులు లూటీ అవుతుంటే వాహన డీలర్లు మాత్రం కాసులు పిండుకుంటున్నారు. కొంతమంది వాహన డీలర్ల దందాపై ప్రత్యేక కథనం..

వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) ప్రయోజనాలను కొందరు వాహన డీలర్లు.. వాహనదారులకు అందకుండా చేస్తున్నారు. ఈ ప్రయోజనాలను కూడా కొందరు వాహన డీలర్లే వ్యక్తిగతంగా లబ్ధి పొందుతుండటంతో వినియోగదారులకు అంతగా ప్రయోజనం కలగటం లేదు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత.. లబ్ధిదారులకు ఎంత ప్రయోజనం కలుగుతుందన్న దానిపై ఆయా సంస్థలు తప్పనిసరిగా ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేసి సూచించాల్సి ఉంటుంది. నగరంలోని వాహన డీలర్లు ఎక్కడా బోర్డులను ప్రదర్శిస్తున్న దాఖలాలు లేవు. వాహనదారులకు కంటితుడుపు ప్రయోజనం కల్పించి చేతులు దులుపుకొంటున్నాయి. ఇప్పటివరకు వాహన డీలర్ ఒక వాహనాన్ని విక్రయించే ముందు దాని ధరతో పాటు వివిధ రకాల పన్నులన్నింటినీ కలిపి చూస్తే.. ఎంత అవుతుందో.. జీఎస్టీ అమల్లోకి వచ్చాక దానిని పరిగణనలోకి తీసుకుని ఆ ప్రయోజనాన్ని వాహన కొనుగోలుదారునికి అందించాల్సి ఉంది. కానీ, ఆచరణలో దీనికి విరుద్ధంగా జరుగుతోంది.

వాహన డీలర్ల దందా..

రూ.లక్ష విలువ ద్విచక్రవాహనం కొనాలంటే.. ఈడీ 12.50 శాతం చొప్పున రూ.12,500, ఎన్‌సీసీడీ 1 శాతం రూ.1000, సెస్ 0.12 శాతం రూ.125 కలిపితే మొత్తం రూ.1,13,625 అవుతుంది. దీనికి సీఎస్‌టీ 2 శాతం రూ.2,272 కలిపితే మొత్తంగా రూ.1,15,897 అవుతుంది. దీనికి 14.50 శాతం వ్యాట్ రూ.16,805 కలిపితే ఓవరాల్‌గా ఆ వాహనం ధర రూ.1,32,702 అవుతుంది. ఇందులో మతలబు ఉంది. వ్యాట్‌తో కలిపి 32.70 శాతం పన్నులు చూస్తున్నాం.

ఇక జీఎస్టీ విషయానికి వద్దాం. ఆ వాహనంపై 28 శాతం జీఎస్టీ విధింపు వల్ల ఆ వాహనం ఖరీదు రూ.1,28,000 అవుతుంది. అంటే జీఎస్టీ వల్ల వాహనదారుడికి వచ్చే ప్రయోజనం రూ.4,700 అన్నమాట. అయితే ఈ ప్రయోజనం అందుతుందా అంటే లేదనే చెప్పాల్సి వస్తోంది. వాస్తవంగా పైన చెప్పుకున్న మతలబు విషయానికి వద్దాం. పైన వసూలు చేస్తున్న పన్ను లెక్కల్లో కొంత గందరగోళం కూడా ఉంది. లక్ష రూపాయల వాహనానికి ఈడీ 12.50 శాతం, ఎన్‌సీసీడీ 1 శాతం, సెస్ 0.125, సీఎస్‌టీ కలిపితే 15.625 శాతం అవుతుంది. దీనికి 14.50 శాతం కలిపితే 30.125 శాతం అవుతుంది. అంటే 2.31 శాతం మేర ఇన్నాళ్లూ కొందరు వాహన డీలర్లు తమ దగ్గరకు వచ్చిన వాహన కొనుగోలుదార్లకు కన్నం పెట్టారు.

జీఎస్టీ రావటం వల్ల వాహనదారుడికి రూ.4,700 మేర ప్రయోజనం కలుగుతుంటే ఆ మొత్తంలో కేవలం రూ.1000 మాత్రమే ఇస్తున్నారు. వినియోగదారులకు కనీస అవగాహన లేకపోవటం వల్ల ఒక వాహనానికి రూ.3వేలు పైన వాహన డీలరే లబ్ధిపొందుతున్నాడన్నమాట. కొంతమంది డీలర్లు నిజాయితీగా వ్యాపారం చే సేవారు కూడా ఉన్నారు. కానీ సింహభాగం డీలర్లు ఇదే పని చేస్తుండటం గమనార్హం. దీనిపై బాధ్యత ఎవరిది? వాహన కొనుగోలుదారుల నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు? అన్నది అంతుచిక్కటం లేదు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏది?

జీఎస్టీ అమలుచేసే ముందు కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టాన్ని తీసుకువస్తున్నట్టు ప్రకటించింది. ఒక రకంగా భయటపెట్టినంత పని చేసింది. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఇదే కేంద్ర ప్రభుత్వం మాట మార్చింది. జీఎస్టీ అమల్లోకి వచ్చాక.. ఎంత మేర ప్రయోజనం కలుగుతుందో తెలియటానికి నాలుగైదు నెలల సమయం పడుతుందని, వినియోగదారునికి ఖచ్చితంగా జీఎస్టీ వల్ల ఎంత ప్రయోజనం కలుగుతుందో ఆ మేరకు ఆ విషయం తెలిసేలా బోర్డులను ఏర్పాటు చేయమని సూచించింది. ఇప్పటివరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఊసే లేదు. జీఎస్టీ ప్రయోజనం ప్రజలకు అందకపోతే ఎన్‌ఫోర్స్‌మెంట్ చూసుకుంటుంది. ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ లేకపోవటం వల్ల వినియోగదారులు మోసపోతే ఎవరికి మొరపెట్టుకోవాలన్నదే ప్రశ్నగా ఉంది.

దుర్గగుడి అభివృద్ధి పనులకు..

వాస్తు బ్రేక్..!

- ఆలయానికి దేవస్థానం మాజీ ఆగమ పండితుడు రాక
- ట్రస్ట్‌బోర్డు సభ్యులకు పలు సూచనలు చేసిన వెంకటేశ్వర సోమయాజులు
- 30న జరగాల్సిన ట్రస్ట్‌బోర్డు సమావేశం వాయిదా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

దుర్గగుడిలో వాస్తువిరుద్ధంగా జరుగుతున్న అన్ని పనులకు ట్రస్ట్‌బోర్డు రెడ్‌సిగ్నల్ చూపడంతో ఎక్కడిపనులు అక్కడే నిలిచిపోయాయి. వాస్తు సమ్మతంగా ప్రస్తుత నిర్మాణాలను వేరొక చోట నిర్మించేందుకు అభ్యంతరం లేదని ట్రస్ట్‌బోర్డు స్పష్టం చేసింది. భక్తులకు అవసరమయ్యే పనులు తప్ప, మిగతా వేటిని కూడా అనవసర వ్యయం చేసి నిర్మించరాదని కూడా బోర్డు తేల్చి చెప్పింది. రెండునెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన ట్రస్ట్‌బోర్డు సభ్యులు మొదటి సమావేశంలోనే మోతమోగించారు. ముఖ్యంగా కొన్ని నిర్మాణాలను నిలుపుదల చేయాలని, దేవస్థానంలో అమ్మవారి దర్శనం టికెట్‌ను రూ.300 నుంచి రూ.150కు తగ్గించాలని కోరారు. దీనిపై ఈవో స్పందిస్తూ తీర్మానాల రూపంలో వస్తే ఈ విషయాలన్నిటినీ పరిశీలన చేస్తామని చెప్పారు. ఆ తరువాత కథ మలుపులు తిరిగింది. విషయం మంత్రి ఉమామహేశ్వరరావు ద్వారా సీఎం దృష్టికి వెళ్ళింది. రాజధాని ప్రాంతంలో అతి పెద్ద ఆలయం దుర్గగుడిలో వాస్తు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే పాలకులకూ ఇబ్బంది కలుగుతున్న సంకేతం పంపారు. దీంతో అమరావతి నిర్మాణానికి వాస్తు చూసిన పండితుడు రాఘవయ్యను ఇటీవల దుర్గగుడికి తీసుకువచ్చి అన్ని ప్రదేశాలను చూపించగా ఆయన కొన్ని సూచనలు చేశారు. వాటిపై నివేదిక సమర్పించాల్సి ఉంది. ఈ లోపల కమిటీ సభ్యులు ముఖ్య కార్యదర్శిని కలిసారు. ఆయన సలహా మేరకు నలుగురితో కమిటీని నియమించాలని నిర్ణయించారు. కమిటీని కూడా రేపో మాపో ప్రకటించనున్నారు. ఈలోగా ఈనెల 30న ట్రస్ట్‌బోర్డు సమావేశం జరగనున్నట్టు దేవస్థానం అధికారులు ప్రకటించడంతో ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంసిద్ధులయ్యారు. తాము ఏవైతే సంస్కరణలు, మార్పులు, చేర్పులు చేపట్టాలనుకున్నారో వాటన్నిటినీ కూడా తీర్మానాల రూపంలో పెట్టి తీన్మార్ మోగించాలనుకున్నారు. అయితే 30వ తేదీ సమావేశాన్ని వాయిదా వేసి, వచ్చే నెల రెండునగాని, మూడునగాని సమావేశం ఉంటుందని అనధికారికంగా ప్రకటించారు. ఈలోపల ఆదివారం దేవస్థానానికి ఆగమ సలహాదారుగా సుదీర్ఘకాలం పనిచేసిన 93 సంవత్సరాల వయోవృద్ధుడు వెంకటేశ్వరసోమయాజులును ట్రస్ట్‌బోర్డు ఆలయానికి వీల్‌ఛైర్‌లో తీసుకువచ్చారు. ఆయనకు ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివరించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు పద్మశేఖర్, బడేటి ధర్మారావు, శంకరంబాబు, సూర్యలత తదితరులు యాజులతో సమావేశమయ్యారు. ఆయన ఆగమ శాస్త్రాన్ని అనుసరించి కొన్ని సూచనలు చేశారు. దీంతో మొత్తంగా ఇప్పుడు ఆలయంలో వాస్తుకు విరుద్ధంగా జరుగుతున్న అన్ని పనులను నిలిపివేయాలని ట్రస్ట్‌బోర్డు సభ్యులు నిర్ణయించారు.

వాటర్ ఫాల్స్ నిర్మాణం, చీరల కౌంటర్ వద్ద పెద్ద ద్వారాన్ని తెరవడం, ఈశాన్య నిర్మాణంలో వంటశాల పనులను నిలిపివేయడం, ఆశీర్వచన కార్యక్రమాన్ని యధావిధిగా ఆలయం పక్కన ప్రాకార మండపంలోకి మార్చడం, సీవీ రెడ్డి ఛారిటీస్‌లో షెడ్లకు బదులు పర్మినెంట్ గదులతో విశ్రాంతి భవనాన్ని నిర్మించడం, గొల్లపూడిలో కూడా గోశాలకు బదులు విశ్రాంతి భవనం, ఉండవల్లి స్థలంలో కూడా విశ్రాంతి భవన నిర్మాణం వంటివి చేపట్టడం వంటివాటిపై తీర్మానాలను ప్రవేశపెట్టడానికి ట్రస్ట్‌బోర్డు సభ్యులు నిర్ణయించారు. ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గూడపాటి పద్మశేఖర్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు సూచనలతో ఆలయంలో భక్తులకు వసతులు ఏర్పాటు చేయడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. దేవస్థానంలో వాస్తు విరుద్ధంగా సాగించే నిర్మాణాలను, అనవసర నిర్మాణాలను చేపట్టకుండా నిరోధిస్తామని, అవసరమనుకుంటే వాటిని వేరొకచోట, భక్తులకు అనుగుణంగా వాస్తు సమ్మతంగా నిర్మించడానికి అంగీకరిస్తామని తెలిపారు. ఇప్పటికైతే అన్ని పనులు నిలిపివేసినట్టు బడేటి ధర్మారావు తెలిపారు.



దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆగమపండితుడు వెంకటేశ్వరసోమయాజులతో సమావేశమైన ట్రస్ట్‌బోర్డు సభ్యులు

దేశాభివృద్ధిలో ఏయూ పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఏయూ వీసీ నాగేశ్వరరావు

- ఆంధ్ర విశ్వవిద్యాలయ అభివృద్ధికి అ'పూర్వ' సహకారం అందిద్దాం
- ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు
- ఏఎన్‌యూలో ఏయూ పూర్వ విద్యార్థుల సంఘం అమరావతి చాప్టర్ సమావేశం

ఏఎన్‌యూ: దేశాభివృద్ధిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల పాత్ర కీలకమైనదని ఆంధ్రా వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డైక్‌మెన్ ఆడిటోరియంలో ఆదివారం ఆంధ్ర వర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్ర వర్సిటీ వీసీ ఆచార్య జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులను ఏకం చేసి విశ్వవిద్యాలయ అభివృద్ధికి, వికాసానికి దోహదపడేలా సంఘం కృషి చేస్తుందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి 92 ఏళ్ల చరిత్ర ఉందన్నారు. దేశానికి ఇద్దరు ఉప రాష్ట్రపతులను అందించిన ఘనత వర్సిటీకి దక్కిందన్నారు. జీఎంఆర్, మహమ్మద్ జానీ వంటి ప్రముఖులను సమాజానికి అందించిందని తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఈ ఏడాది డిసెంబర్ 10న ఆచార్య సీఆర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సమావేశం నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తాన్నామన్నారు.

కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో అమరావతి చాప్టర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.రామకృష్ణారావు మాట్లాడుతూ చారిత్రాత్మకంగా ఖ్యాతి గడించిన ఏయూను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. రాజకీయ నాయకులను, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలను తయారు చేసిన విద్యాసంస్థను మరింత అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తనకు అన్నం పెట్టిన తల్లి లాంటి విశ్వవిద్యాలయం వృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిభయే ప్రామాణికంగా తీసుకుని ప్రోత్సహిస్తూ, సంఘంలో మంచి గుర్తింపు వచ్చేలా వర్సిటీ సహకారం అందించినట్లు తెలిపారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కేఆర్ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ జువాలజీ డిగ్రీ అర్హత గల వారికి ఫార్మసీలో పీహెచ్‌డీ చేయడానికి ఎక్కడ అనుమతి ఇవ్వలేదని, ఏయూ మాత్రం అవకాశం కల్పించిందన్నారు. పారిశ్రామికవేత్త బొమ్మిడాల కృష్ణమూర్తి మాట్లాడుతూ ఏయూ పూర్వ విద్యార్థుల సంఘంలో సభ్యునిగా ఉన్నందుకు గర్వంగా ఉందన్నారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఇతర సేవలు అందించాలని సూచించారు. విదేశాల్లో కూడా నూతన చాప్టర్లు ప్రారంభించాలన్నారు. సెప్టెంబర్ 16న ఢిల్లీలో నూతనంగా చాప్టర్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. నేపాల్, ఆఫ్రికా దేశాలలో చాప్టర్ ప్రారంభించాలన్నారు. ఆంధ్ర వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు జిల్లాల పూర్వ విద్యార్థుల స్పందన బాగుందన్నారు. సంఘం బలోపేతానికి కృషి చేద్దామన్నారు. ఏయూ పూర్వ విద్యార్థి, ఏఎన్‌యూ విశ్రాంత ఉద్యోగి నూతక్కి వెంకటప్పయ్య, ఏయూ పూర్వ విద్యార్థి సంఘానికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. సంఘం జాయింట్ సెక్రటరీ రవిశంకర్ జీఎస్టీపై రచించిన గ్రంథాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో ఆచార్య జంపాల రాజేష్, డాక్టర్ ఏవీ రవికుమార్, డాక్టర్ ఎల్.పాపారావు, డాక్టర్ ఎం.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





జీఎస్టీపై రవిశంకర్ రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏయూ, ఏఎన్‌యూ వీసీలు తదితరులు, నూతన చాప్టర్‌లో సంతకం చేస్తున్న దృశ్యం

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు

- నాలుగు పళ్ల విభాగంలో విజేత కృష్ణా జిల్లా
- 6 పళ్ల విభాగంలో గుంటూరు జిల్లా

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని కాకాని వెంకట్రామయ్య క్రీడా ప్రాంగణంలో ఎన్టీఆర్ మెమోరియల్ ఒంగోలు జాతి రెండు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. రెండు, నాలుగు, ఆరు పళ్ల విభాగాల్లో పోటీలు ముగియగా ఆదివారం వ్యవసాయ విభాగంలో పోటీలు జరుగుతున్నాయి. రెండు పళ్ల విభాగంలో విజేతలకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే రావెల కిషోర్‌బాబు బహుమతులను అందజేశారు. మొదటి మూడు బహుమతులను గుంటూరుకు చెందిన అనిల్‌చౌదరి అందజేయగా, మిగిలిన బహుమతుల పారితోషకాన్ని జి.వెంకటేశ్వరరావు, మన్నవ మల్లేశ్వరరావు, కాకాని సురేష్‌బాబు అందజేశారు.

నాలుగు పళ్ల విభాగంలో..

నాలుగు పళ్ల విభాగంలో కృష్ణా జిల్లా ఘంటసాల మండలం, దాలిపర్రు గ్రామానికి చెందిన బొందలపాటి కోటేశ్వరరావు ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. కర్నూలు జిల్లా యాపిలి మండలం, సింగనూరుపల్లె గ్రామానికి చెందిన సదా ఆంజనేయులు గౌడ్‌కు చెందిన ఎడ్ల జత ద్వితీయ, గుంటూరు జిల్లా అమరావతి మండలం లింగాపురం గ్రామానికి చెందిన వట్టికుంట భార్గవచౌదరికి చెందిన ఎడ్లు తృతీయ స్థానంలో నిలిచాయి. కడప జిల్లా రాజుపాలెం మండలం, వాసుదేవాపురం గ్రామానికి చెందిన మారెళ్ల మోక్షారెడ్డికి చెందిన ఎడ్లు నాలుగో, కృష్ణాజిల్లా గన్నవరం మండలం మెట్లపల్లికి చెందిన చిలకపాటి రాజీవ్ ఎడ్ల జత ఐదోస్థానంలో నిలిచాయి.

ఆరుపళ్ల విభాగంలో..

ఆరుపళ్ల విభాగంలో మంగళగిరి మండలం, నవులూరు గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాసరావు ఎడ్ల జత ప్రథమ, తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా, హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రబాబుకి చెందిన ఎడ్లు ద్వితీయ, కృష్ణాజిల్లా ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్, వేమూరి మౌర్యచంద్రలకు చెందిన ఎడ్లు తృతీయ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా పర్చూరు మండలం, గొల్లపూడికి చెందిన చితలపూడి రామారావు ఎడ్లజత నాలుగో, నరసరావుపేట మండలం, పెట్లూరివారిపాలేనికి చెందిన మోజాల వెంకట దుర్గారావు ఎడ్ల జత ఐదో స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జడ్పీటీసీ డక్కుమళ్ల భాగ్యారావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు శివరామప్రసాద్, నిర్వాహకులు పమిడి అంజియ్య, కాకాని సురేష్ పాల్గొన్నారు.



పోటీపడుతున్న ఎడ్లజత

కార్మికులకు పీఎఫ్ చెల్లించకపోతే చర్యలు

పీఎఫ్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్

మంగళగిరి టౌన్: యాజమాన్యం ప్రతి కార్మికునికి పీఎఫ్ చెల్లించాల్సిందేనని, అలా చెల్లించని పక్షంలో సదరు యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని అడిషనల్ పీఎఫ్ కమిషనరు వైడీ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళగిరి చిల్లపల్లి కల్యాణ మండపంలో ఆదివారం ఎన్నారై ఆసుపత్రి, హాయ్‌ల్యాండ్, వివిధ గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు పీఎఫ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఎన్నారై నర్సింగ్ యూనియన్ అధ్యక్షుడు ఏటుకూరి గంగాధర్‌రావు అధ్యక్షత వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పీఎఫ్ చెల్లించిన సర్వీసు ఆరేళ్ల దాటితే హౌసింగ్, హెల్త్ లోన్లు తీసుకోవచ్చని చెప్పారు. పది సంవత్సరాలు అలా చెల్లిస్తే 58 సంవత్సరాలు దాటిన తరువాత నెలకు రూ.వెయ్యి పెన్షన్ వస్తుందన్నారు. విధుల్లో వున్నప్పుడు ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.ఆరున్నర లక్షల ఇన్స్యూరెన్స్ వర్తిస్తుందన్నారు. ఈపీఎఫ్ యూనియన్ రాష్ట్ర నేత కె.నాగరాజు మాట్లాడుతూ ప్రతి కార్మికుడు ఈపీఎఫ్‌పై అవగాహన కలిగివుండాలన్నారు. పీఎఫ్ చెల్లించిన తరువాత యూనిక్ నెంబరు వస్తుందని, కాంట్రాక్టరు మారినప్పుడల్లా పీఎఫ్ తీసుకోకూడదని, ఆ పీఎఫ్‌ను వేరే అకౌంటులోకి జమ చేసుకోవచ్చని, పీఎఫ్ తీసుకుంటే సర్వీసు తగ్గిపోతుందని తెలియజేశారు. పీఎంఏవై పథకంలో ప్రతి కార్మికునికి ఇల్లు కట్టించుకోవడానికి రూ.రెండున్నర లక్షల సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు తమ సమస్యలను వివరించారు. పీఎఫ్ చెల్లిస్తున్నప్పటికీ తమకు ఫోనులో సందేశాలు రావడంలేదని, యాజమాన్యాలు అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఫిర్యాదు చేశారు. యూనియన్ నేత ఏటుకూరి గంగాధర్‌రావు మాట్లాడుతూ యాజమాన్యాలే కార్మికులకు పీఎఫ్‌పై అవగాహన కల్పించే క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఎన్నారై నర్సింగ్ యూనియన్ కార్యదర్శి మాధవి, నాయకులు వరలక్ష్మీ, మల్లేశ్వరీ, విజయకుమారి, శాంతకుమారి, రాణి, ఎంపీటీసీ కే శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ జీ శ్రీనివాసరావు, వి.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న పీఎఫ్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్

పీజీ ఈ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం



విద్యార్థులకు అడ్మిషన్ పత్రం అందిస్తున్న వీసీలు

ఏఎన్‌యూ : రాష్ట్రవ్యాప్తంగా ఎంఫార్మసీ, ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి వర్సిటీ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కేంద్రంలో ఆదివారం పీజీ ఈ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమైంది. ఆంధ్రా, ఏఎన్‌యూ వర్సిటీల వీసీలు ఆచార్య జి.నాగేశ్వరరావు, ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ కౌన్సెలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు పీజీ ఈసెట్ ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని కో ఆర్డినేటర్ డాక్టర్ రామచంద్రన్, డాక్టర్ రవికుమార్ తెలిపారు. సోమవారం జీపాట్, గేట్‌లో అర్హత సాధించిన వారికి కౌన్సెలింగ్ ప్రక్రియ వుంటుందన్నారు.



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

గుంటూరు(పాతగుంటూరు): చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సీజీజీబీ) ఆధ్వర్యంలో ఐబీపీఎస్, ఆర్ఆర్‌బీ ఉద్యోగాల కోసం రాష్ట్రస్థాయిలో ప్రీమియర్ అకడమీ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సీజీజీబీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, జీఎం ఫణికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ నేటి నుంచి(సోమవారం) స్థానిక బ్రాడీపేట 6వ లైనులోని మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాలలో ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్ఆర్‌బీ సిడబ్ల్యుఈ-3కి దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇక బియ్యం తూకం పక్కా..!



ఎంఎల్ఎస్ పాయింట్‌లో నూతనంగా అమర్చిన ఈ-పోస్ యంత్ర పరికరం

- ఎంఎల్ఎస్ పాయింట్లలో ఈ-పోస్ యంత్రాలు
- తూకం వేసి డీలర్లకు రేషన్ సరుకుల సరఫరా
- తరుగులు వస్తున్నాయనడం కుదరదిక

ఆంధ్రజ్యోతి, గుంటూరు: 'ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి మాకు వచ్చే బియ్యం బస్తాల్లో తరుగు ఉంటోంది. అందుకే మా వద్ద బియ్యం స్టాకులో వ్యత్యాసం ఉంది' అని రేషన్ డీలర్లు తప్పించుకోవడం కుదరదిక. గ్రాములతో సహా బియ్యం తూకంవేసి కార్డుదారులకు సరఫరా చేయాల్సివుంటుంది. ఇందుకోసం ఎంఎల్ఎస్ పాయింట్ల లోనే ప్రభుత్వం ఈ-పోస్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని ఎంఎల్ఎస్ పాయింట్లలో ఈ నెల నుంచే ఈ-పోస్ యంత్రపరికరాలను అమర్చారు. వేబ్రిడ్జీలకు కూడా ఇదేవిధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. దీనివల్ల డీలర్‌లకు సరఫరాచేసే బియ్యంలో కనీసం 100 గ్రాముల వ్యత్యాసం కూడా ఇకపై ఉండదని అధికారవర్గాలు చెబుతున్నాయి.

జిల్లాలో 20 మండలస్థాయి స్టాక్ పాయింట్లు ఉన్నాయి. వీటినే సివిల్ సప్లయిస్ పరిభాషలో ఎంఎల్ఎస్ పాయింట్లుగా పిలుస్తారు. తొలుత ఎఫ్‌సీఐ గిడ్డంగుల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం చేరుతుంది. అక్కడి నుంచి రేషన్‌డీలర్లకు సరఫరా చేసి తెల్లకార్డుదారులకు పంపిణీచేస్తారు. అయితే ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యం బస్తాలతూకంలో వ్యత్యాసం ఉంటోందని కొన్నేళ్లుగా ఆరోపణలు వస్తున్నాయి. కొంతమంది ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జ్‌లు కాసుల కోసం కక్కుర్తి పడుతూ బస్తాల నుంచి బియ్యం తీసి నల్లబజారుకు తరలిస్తున్నారు. మరోవైపు తేమశాతం కారణంగా బియ్యం బస్తాల తూకంలో తరుగువుంటోందని ఇన్‌చార్జ్‌లు చెబుతున్నారు. తమకు కచ్చితంగా బియ్యంసరఫరా చేయకుండా ప్రజలకు కచ్చితమైన తూకంతో పంపిణీ చేయమనడం సరికాదని డీలర్లు కాటావేయడంలో మోసాలకు పాల్పడుతున్నారు. ఎలక్ట్రానిక్‌కాటాలను సైతం ఏమార్చుతున్నారు. ఎల్ఈడీ డిస్‌ప్లేలో సక్రమంగానే తూకం అంకెలు కనిపిస్తోన్నప్పటికీ ఇంటికివెళ్లి చూసుకుంటే రెండు కేజీల వ్యత్యాసం ఉంటోందని కార్డుదారులు వాపోతున్నారు. జిల్లా ఆహార సలహా సంఘం సమావేశంలో పలుమార్లు సభ్యులు ఈ అంశాన్ని ప్రస్తావించారు.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎంఎల్ఎస్ పాయింట్లన్నింటికీ ఈ-పోస్ యంత్రాలను సరఫరా చేసింది. వాటిని వేబ్రిడ్జీలకు అమర్చారు. దీనివల్ల డీలర్లకు ఎలాంటి తరుగులేకుండా కచ్చితమైన తూకంతో బియ్యం సరఫరా చేస్తారు. ఇందుకోసం డీలర్లను కూడా బియ్యం లిఫ్టింగ్ సమయంలో ఎంఎల్ఎస్ పాయింట్‌కు రావాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు. ఈ నెల నుంచి ఈ-పోస్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. ఇకపై తూకంలో మోసాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తే మాత్రం ఎవ్వరినీ ఉపేక్షించే ప్రసక్తేలేదని అధికార వర్గాలు స్పష్టం చేశాయి.

ఘనంగా రామిరెడ్డి మనుమరాలి రిసెప్షన్ వేడుక



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న స్పీకర్ కోడెల శివప్రసాదరావు, చిత్రంలో గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్, నడికట్టు రామిరెడ్డి తదితరులు

చిరుమామిళ్ళ (నాదెండ్ల): చిరుమామిళ్ళ గ్రామంలోని రామిరెడ్డి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి మనుమరాలు, గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ మేనల్లుడు అంకిత, విక్రమాదిత్యల వివాహ రిసెప్షన్ వేడుక ఆదివారం వైభవంగా జరిగింది. ఇటీవల మారిషస్‌లో వివాహం జరిగిన సందర్భంగా రామిరెడ్డి స్వగ్రామమైన చిరుమామిళ్లలో రిసెప్షన్ నిర్వహించారు. శాసనసభ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు రిసెప్షన్‌కు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్రకుమార్, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జానీమూన్, రూరల్ జిల్లా ఎస్పీ అప్పలనాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి దంపతులు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే జియావుద్దీన్, కాసు మహేష్‌రెడ్డి తదితరులు ఆశీర్వదించి అభినందనలు తెలిపారు. వారితోపాటు నూతన వధూవరుల తల్లిదండ్రులు నడికట్టు సురేష్‌రెడ్డి,మాధవి, డాక్టర్ రమాదేవి, వరప్రసాద్‌లు హాజరైన వారిలో ఉన్నారు.

రికార్డు స్థాయిలో లడ్డూ వేలం రూ.4.90 లక్షలు



రెంటచింతల: వినాయక పర్వదినాన్ని పురస్కరించుకొని రెంటచింతలలోని ఆనందపేటవాసులు నిర్వహించిన లడ్డూ వేలం పాట ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. పాట ప్రారంభం నుంచి ఎవరికి ఎవరూ తీసిపోని రీతిలో పాటలో పాల్గొన్నారు. చివరకు వెల్దుర్తికి చెందిన పులుసు వెంకటరెడ్డి రూ.4.90 లక్షలకు స్వామివారి లడ్డూ పాటను పాడి చేజిక్కించుకున్నారు. కిందటేడాది ఇదే లడ్డూను దాచేపల్లికి చెందిన ఆలేటి సతీష్ రూ.4.50 లక్షలకు కైవసం చేసుకున్నాడు. 50 కేజీల బరువు ఉండే ఈ లడ్డూలో 24 గ్రాముల బంగారం ఉంది. ఓవైపు పెద్ద ఎత్తున బాణసంచా మోత, మరోవైపు డీజే సౌండ్స్‌తో కళ్లు మిరుమిట్లు గొలిపే రంగురంగుల విద్యుద్దీపాలను చూడటానికి భక్తులు తరలివచ్చారు. పల్నాడులో ఇదే అత్యధిక స్థాయిలో పాడిన పాటగా పలువురు పేర్కొంటున్నారు. గురజాల సీఐ ఆళహరి శ్రీహరి నేతృత్వంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. 20 మంది స్పెషల్ పార్టీ పోలీసులను రంగంలోకి దింపారు.

29న నిడుబ్రోలులో సైక్లింగ్, చెస్ పోటీలు

చిలకలూరిపేట: పొన్నూరులోని నిడుబ్రోలు జెడ్పీ హైస్కూలు ధూళిపాళ్ల వీరయ్య చౌదరి ఇండోర్ స్టేడియంలో 29న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -14, అండర్- 17 బాలబాలికలకు సైక్లింగ్, చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వైవీ చిరంజీవిరావు తెలిపారు. మద్దిరాలలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 29న ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. హాజరయ్యే విద్యార్థులు తమ ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రం తీసుకుని రావాలని సూచించారు.

అండర్ -14 ఎంపికలో పాల్గొనేవారు 6, 7, 8 తరగతులు చదువుతున్న వారై, 1-1-2004 తర్వాత జన్మించి ఉండాలన్నారు. అండర్- 17 ఎంపికలో పాల్గొనేవారు 9, 10 తరగతులు చదువుతూ ఉండాలని, 1-1-2001 తర్వాత జన్మించి ఉండాలని ఆయన పేర్కొన్నారు.



టంగ్ ట్విస్టర్స్

1. Clean clams crammed in clean cans.
2. There those thousand thinkers were thining how did the other three thieves go through.
3. Singing Sammy sung songs on sinking sand.
4. Picky people pick Peter Pan PeanutButter, 'tis the peanut-butter picky people pick.

సూక్తి

అసత్యంతో సాధించే విజయం కంటే.. సత్యంతో సాధించే పరాజయమే మేలు.


ఔనా!



డాల్ఫిన్లు ప్రతి అరగంటకు ఒకసారి సముద్ర ఉపరితలానికి వచ్చి ఊపిరి పీల్చుకుంటాయి.

అద్దాల మయసభ

అదో అద్దాల దారి. అందులో అడుగుపెట్టామో.. ఎటు వైపు చూసినా ప్రతిబింబాలే కనిపిస్తాయి. ఏ దిక్కుకు వెళ్లాలో అర్థం కాదు. కాలు తీసి కాలు వేద్దామంటే.. అంతా అయోమయం. అద్దాల తళుకులు, మిరుమిట్లుగొలిపే కాంతులు కనులను మాయ చేస్తాయి. మరి అద్దాల దారుల్లో అసలు దారేదో కనుక్కోవడమే దీని ప్రత్యేకత. ఇదో 'దారి కనుక్కోండి' పజిల్ అన్న మాట. సింగపూర్‌లోని 'విజ్ఞాన కేంద్రం'(సైన్స్ సెంటర్)లో ఆకట్టుకుంటున్న ఈ 'మిర్రర్ మేజ్' ఓ ఆధునిక మయసభ అన్నమాట!



'దారి కనుక్కోండి' పజిల్ అంటే చాలామందికి ఎంతో ఇష్టం. చాలా దేశాల్లో రకరకాల 'మేజ్ పజిళ్లు' పర్యాటకులను ఆకట్టుకుంటాయి. మొక్కజొన్న, పొద్దు తిరుగుడు తోటల్లోనూ తికమక పెట్టే దారులు ఏర్పాటు చేస్తుంటారు. అలానే సింగపూర్‌లో 'సైన్స్ సెంటర్' ఏర్పాటు చేసి 40 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఇటీవలే అందులో ఓ 'మిర్రర్ మేజ్'ను ఏర్పాటు చేశారు. పెద్ద పెద్ద అద్దాలు ఫ్రేములతో దీన్ని తీర్చిదిద్దారు. ఇందులోకి అడుగుపెడితే చాలు.. పైనా, కిందా, ఎటు వైపు చూసినా అద్దాల అందాలే. ఒకటికి పది ప్రతిబింబాలు కనిపిస్తుంటే.. అంతా అయోమయంగా తోస్తుంది. ఎటువైపు వెళ్లాలో తెలియదు. దారి ఉంది కదా అని అటు వైపు వెళ్లామో.. అంతే అది 'డెడ్ ఎండ్'ను సూచిస్తుంది. ప్రతి మలుపులో భ్రమింపచేసే ఎన్నో మాయలు. అసలు దారి ఎటు ఉందో తెలుసుకుంటే ఈ పజిల్ పూర్తి చేసినట్టే. ఈ అద్దాల గందరగోళానికి తోడు, మిరుమిట్లు గొలిపే లైట్ల కాంతులు కళ్లను తప్పుదోవ పట్టిస్తాయి. మొత్తంగా 270 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆ అద్దాల మేజ్ సందర్శకులన ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ మేజ్ సెప్టెంబర్ వరకు పర్యాటకుల కోసం అందుబాటులో ఉంటుంది. మయసభను తలపిస్తున్న ఈ మాయ అద్దాల దారిలో నడుస్తూ, తెగ సంతోష పడుతు ఆ జ్ఞాపకాల్ని తమ సెల్‌ఫోనుల్లో బంధించుకుంటున్నారు. ఎవరైనా ఉచితంగానే మిర్రర్ మేజ్‌ను సందర్శించవచ్చు.



- **ఆసియాలోని అతి పెద్ద 'మిర్రర్ మేజ్'గా ఇది రికార్డు సృష్టించింది.**
- **కాంతి భౌతిక ధర్మంతో పాటు, రంగులు కలిగించే భ్రమను సందర్శకులకు తెలియజేయడమే ఈ మిర్రర్ మేజ్ లక్ష్యమని నిర్వాహకులు అంటున్నారు.**
- **బ్రిటన్‌కు చెందిన ప్రముఖ మేజ్ డిజైనర్ 'అడ్రియన్ ఫిషర్' ఈ మేజ్‌ను రూపొందించాడు.**

నవ్వుల్ నవ్వుల్

లంబూ : ఏరా! మేధావీ కొత్త కారు కొన్నావట? ఏ కంపెనీది?
మిస్టర్ మేధావి : కంపెనీ పేరు గుర్తుకు రావడం లేదు కానీ 'టీ'తో స్టార్ట్ అవుతుంది.
లంబూ : అవునా! నాది పెట్రోల్ పోస్తే గానీ స్టార్ట్ కాదు.

చెప్పగలరా?


వనంలో ఉన్నా కానీ మనంలో లేను
దివిలో ఉన్నా కానీ భువిలో లేను
నత్తిలో ఉన్నా కానీ సుత్తిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?




పడుకున్నప్పటికంటే టీవీ చూస్తుంటేనే ఎక్కువ క్యాలరీలు ఖర్చు అవుతాయి.


బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



రంగులు వేయండి



జవాబులు

చెప్పగలరా? : వదిన
జంతర్‌మంతర్ :
1. మెలకువ
2. వినియోగం
3. సుప్రభాతం
4. పంచాయతి

జంతర్‌మంతర్

1. మెకువల ► ....
2. వియోనిగం ► ....
3. భాతంసుప్ర ► ....
4. చాపంయతి ► ....

చుక్కలు కలపండి



పశుగ్రాస క్షేత్రాలతో పాడి పరిశ్రమ అభివృద్ధి



వినుకొండరూరల్ : ప్రభుత్వ నిధులతో ఊరూరా పశు గ్రాస క్షేత్రాలు ఏర్పాటు కానుండటంతో మండలంలో గత ప్రభుత్వాల హయాంలో తగ్గిన పాడిపరిశ్రమ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అనూహ్యంగా పుంజుకోబోతోంది. ఇందుకు గాను మండల వెలుగు, పశు సంవర్థకశాఖలు సంయుక్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ఏర్పాట్లు చేసింది. పశుగ్రాస కొరతలేకుండా పాడిపరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ఊరూర పశుగ్రాస క్షేత్రాల పథకాన్ని ప్రవేశపెట్టింది. పశుపోషకుల ఆర్థికస్థితిని మెరుగుపరిచేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావించి పథకంలో అర్హులైన రైతులను ఎంపిక చేసే బాధ్యతను వెలుగు అధికారులకు అప్పగించింది. మరికొన్ని బాధ్యతలను పశుసంవర్థక శాఖ అధికారులకు అప్పగించింది. వెలుగు సిబ్బంది ఎంపిక చేసిన రైతులకు సబ్సిడీలో నిధులు అందించగా, పశుగ్రాసపెంపకాన్ని పశుసంవర్థక శాఖ చేపడుతుంది. ఆయా గ్రామాల్లో సొంతభూమి లేదా కౌలు భూమి ఎకరం తగ్గకుండా ఉండే రైతులు ఈ పథకంలో చేరేందుకు అర్హులుగా ఉంటారని అధికారులు తెలుపుతున్నారు. వినుకొండ మండలానికి సంబంధించి 25 గ్రామ పంచాయతీలకు 125 ఎకరాలను పశుగ్రాస క్షేత్రాలకు ఏర్పాటు చేయాల్సి ఉండగా వెలుగు అధికారులు ఇప్పటికే 77 ఎకరాలను ఎంపిక చేశారు. ప్రతి గ్రామపంచాయతీలో ఐదుగురు రైతులకు ఈ పథకం వర్తించేలా అధికారులు ప్రయత్నిస్తున్నారు. పశుసంవర్థక శాఖ రైతు నుంచి మూడు రకాల అగ్రిమెంట్లు చేయించుకొని పొలంలో నీటి సౌకర్యం ఉన్న రైతుకు తొలి ప్రాధాన్యం ఇచ్చి ఎంపిక చేసిన రైతుకు ఎకరాకు రూ.20వేలను రెండు విడతలుగా ప్రభుత్వం మంజూరు చేస్తుంది. ఒకసారి ఎంపిక చేసిన రైతులకు వరుసగా మూడేళ్లు ఇదే సబ్సిడీని అందజేస్తారు. రైతు తనకు కేటాయించిన పశుగ్రాస క్షేత్రంలో గడ్డిని పెంచి సొంతానికి వాడుకొని మిగిలిన గడ్డిని కేజీ రూపాయి చొప్పున ఇతర రైతులకు అమ్మాలనేది ప్రభుత్వ నిబంధన. దీంతో ఇది రైతుకు ఆదాయ వనరుగా మారింది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రజల్లో పశుగ్రాస క్షేత్రాలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది.

పశుగ్రాస క్షేత్రాలతో ఆర్థికాభివృద్ధి
- చిలకా నాగరాజు



పశుగ్రాస క్షేత్రాలతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన చిలకా నాగరాజు అన్నారు. ప్రభుత్వం పశుగ్రాస క్షేత్రాల ద్వారా ఆయా గ్రామాల్లో పశువులకు సరిపడ మేత దొరుకుతుందని, దీంతో పాడిపరిశ్రమ అభివృద్ధి దిశలో పయనిస్తుందన్నారు.

త్వరలో అన్ని గ్రామపంచాయతీల్లో..
- రమేష్‌బాబు,వెలుగు ఏపీఎం



వినుకొండ మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో 77 ఎకరాలను పశుగ్రాస క్షేత్రాలకు రైతులను ఎంపిక చేయడం జరిగిందని, ఈ వర్షాకాలంలో పశుగ్రాస క్షేత్రాల్లో గడ్డి పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెలుగు ఏపీఎం రమేష్‌బాబు తెలిపారు. రైతు పశుగ్రాస క్షేత్రాల్లో గడ్డిని పెంచి సొంతానికి వాడుకొని మిగిలిన గడ్డిని అదే గ్రామంలో విక్రయించుకోవచ్చన్నారు.

ఎరువుల యాజమాన్యంతో అధిక దిగుబడులు



తిరుమలాదేవి, ఏడీఏ, పొన్నూరు

పొన్నూరు: సరైన ఎరువుల వాడకంతో పోషకాల సమతుల్యత పాటించి వరిలో అధిక దిగుబడులు పొందవచ్చని పొన్నూరు ఏడీఏ సీహెచ్ తిరుమలాదేవి రైతులకు సూచించారు. ఎరువుల యాజమాన్యంపై ఆమె పలు సూచనలు చేశారు. వాతావరణ పరిస్థితులు, సీజన్, నేల లక్షణాలు భూసారం ఆధారంగా వేర్వేరు మండలాలకు, జిల్లాలకు వేర్వేరు పోషక మోతాదులు సూచించడం జరిగింది.

సూక్ష్మపోషక లోపాలు:

జింకు లోపం: వరిలో రాష్ట్రమంతటా అన్ని ప్రాంతాల్లో జింకు లోకం తీవ్రంగా కనిపిస్తోంది. ఖరీఫ్‌కన్నా రబీ పైరుపై లోపం అధికంగా ఉంది. ముఖ్య పోషకాలు తగినంత వేసినప్పటికీ నాటిన మొక్క వెంటనే నిలదొక్కుకోకపోవడం, మొక్క ఆరోగ్యంగా కనిపించక ఒక విధమైన పసుపురంగులో ఉండటం, పిలకలు పెట్టవలసినంతగా పెట్టకపోవడం వంటి లక్షణాలు జింకు లోపాన్ని సూచిస్తాయి.

లోప లక్షణాలు: ఆకు మొదటి భాగంలోని మధ్య ఈనె ఆకుపచ్చ రంగు కోల్పోయి పసుపు రంగుకు మారుతుంది. ఆకుల చివర్లలో మధ్య ఈనెకు ఇరువైపులా తుప్పు రంగు, లేక ముదురు ఇటుకరంగు మచ్చలు ఏర్పడతాయి. తగినంత నత్రజని వాడినప్పటికీ పైరంతా ఒకరకమైన పసుపుపచ్చగా కనిపిస్తుంది.

నివారణ: ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్ నేలకు వేసిగాని 0.2 శాతం జింకుసల్ఫేటు ద్రావణాన్ని పైరుపై 4-5 రోజుల తేడాతో 2-3 సార్లు పిచికారి చేసి లోపాన్ని సవరించుకోవచ్చు. ఎకరానికి సుమారు 200 లీటర్ల ద్రావణం ఉపయోగించి మొక్క బాగా తడిసేటట్లు పిచికారి చేయాలి.

ఎరువుల వాడకంలో మెళకువలు

1.భూసార పరీక్షల ద్వారా నిర్ణయించబడిన పోషక మోతాదులు సాధారణ సిఫార్సులకన్నా మేలైనవి, ఖచ్చితమైనవి. నత్రజని ఎరువులను మూడుసార్లుగా విభజించి భాస్వరం పూర్తి మోతాదు ఒకేసారి, పొటాష్ రెండుసార్లుగా విభజించి వేయాలి.

2. అమ్మోనియం సల్ఫేటు, కాల్షియం అమ్మోనియ నైట్రేటు వేసినప్పుడు 24 గంటల తర్వాత, యూరియా వేసినప్పుడు 36 నుంచి 48 గంటల తర్వాత నీరు పెట్టాలి. నిలిచివున్న నీటిలో ఎరువులు వేయరాదు.

3. నీరు తీయడానికి వీలు లేనప్పుడు పైరుపై 2-3 శాతం యూరియా ద్రావణం పిచికారి చేసి నత్రజని అందించాలి. లేదా యూరియా, మట్టి మిశ్రమం 1:8 నిష్పత్తిలో బాగా కలిపి నీటిని చిలకరించి యూరియా కరుగునట్లు చేయాలి.

4. భాస్వర పోషకాన్ని సూపర్‌పాస్ఫేటుతో అందిస్తే అందులోని కాల్షియం, గంధకం కూడా ఉపయోగపడతాయి.

5. పొటాష్ ఎరువులు రెండు సమభాగాలుగా విభజించి నాటే సమయంలోనూ, అంకుర ప్రారంభదశలోనూ వేయాలి. దీని వల్ల మొక్కకు రోగ నిరోధక శక్తి పెరిగి ఫలసాయం, నాణ్యత పెరుగుతుందని ఏడీఏ తిరుమలాదేవి రైతులకు తెలియజేశారు.

జిల్లాలో 3.56 లక్షల హెక్టార్లలో పంట సాగు

● 1.14 హెక్టార్లలో వరి ● రెండు వారాల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలు

(ఆంధ్రజ్యోతి - గుంటూరు)

జిల్లాలో రెండు వారాల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాలతో వివిధ రకాల పంటల సాగు గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 5.35 లక్షల హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటి వరకు 3.56 లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటలు వేసినట్లు వ్యవసాయశాఖాధికారులు ఆ శాఖ రాష్ట్ర కార్యాలయానికి నివేదికలు పంపారు. సాగైన పంటల్లో సుమారు 45 శాతం పత్తి వేశారు. కృష్ణా పశ్చిమ డెల్టా, గుంటూరు ఛానల్‌కు పట్టిసీమ నీరు రావడంతో వరి సాగు ముమ్మరం అయ్యింది. ఈ ప్రాంతంలో వెద పద్ధతిలో సుమారు 61వేల హెక్టార్లలో వరి వేశారు. 53వేల హెక్టార్లలో నాట్లు వేశారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 1.14 లక్షల హెక్టార్లలో వరి వేసినట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో వివిధ రకాల పంటల సాగు

ఈ ఏడాది ఖరీఫ్‌లో 5లక్షల 35వేల 214 హెక్టార్లలో వివిధ రకాల పంటలు వేసే అవకాశం ఉన్నట్లు వ్యవసాయశాఖాధికారులు అంచనాలు తయారు చేశారు. దీనిలో ఇప్పటి వరకు 3లక్షల 55వేల 850 హెక్టార్లలో వివిధ రకాల పంటలు వేసినట్లు తెలిపారు. వరి లక్షా 13వేల 730 హెక్టార్లు, జొన్న 29 హెక్టార్లు, సజ్జ 1,159 హెక్టార్లు, మొక్కజొన్న 418హెక్టార్లలో వేశారు. కంది. 15,689 హెక్టార్లు, పెసర 4,152 హెక్టార్లు, మినుము 10,585 హెక్టార్లలో సాగు చేశారు. వేరు శనగ 586 హెక్టార్లు, నూగు 1,419 హెక్టార్లు, ఆముదం 427 హెక్టార్లు, సోయాబీన్ 10 హెక్టార్లలో వేశారు. పత్తి లక్షా 66వేల 673 హెక్టార్లు, మిర్చి 15,295 హెక్టార్లు, చెరుకు 206 హెక్టార్లు, పసుపు 4518 హెక్టార్లు, జూట్ 3,886 హెక్టార్లు, వివిధ రకాల కూరగాయలు, ఉద్యాన వన పంటలు 17,068 హెక్టార్లలో వేసినట్లు జేడీ కృపాదాస్ ఆ శాఖ కమిషనర్ డాక్టర్ హరి జవహర్‌లాల్‌కు నివేదికలు పంపారు.

తగ్గిన ముందస్తు ఖరీఫ్

ఈ ఏడాది ముందస్తు ఖరీఫ్ అంచనాలు గణనీయంగా తగ్గాయి. జిల్లా వ్యాప్తంగా 40వేల హెక్టార్లలో ముందస్తు ఖరీఫ్‌పంటలు సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయశాఖాధికారులు అంచనాలు వేశారు. పెసర 10వేల హెక్టార్లలో వేయాలని ప్రతిపాదించగా 4,152 హెక్టార్లలో, మినుము 24 వేల హెక్టార్లలో అంచనా వేయగా 10,585 హెక్టార్లలో, నూగు 4వేల హెక్టార్లలో వేస్తారని భావించగా 1,419 హెక్టార్లలో, జొన్న, సజ్జ, ఇతర చిరుధాన్యాల పంటలు రెండువేల హెక్టార్లలో వేస్తారని భావించగా 1,188 హెక్టార్లలో మాత్రమే వేశారు. ఈ ఏడాది 40వేల హెక్టార్లలో ముందస్తు ఖరీఫ్ పంటలు వేస్తారని భావించగా ఇప్పటి వరకు 17,344 హెక్టార్లలో మాత్రమే పంటలు వేశారు. ముందస్తు ఖరీఫ్ అంచనాల్లో 35 శాతం సాగు చేశారు.



చుక్కల్లో చక్కెరకేళి, అరటి ధరలు

యాపిల్, దానిమ్మ ధరలతో పోటీ పడుతున్న వైనం

తగ్గిన దిగుబడి .. నంద్యాల, రావులపాలెం నుంచి దిగుమతి



తెనాలి రూరల్ : అరటి పండ్ల ధరకు రెక్కలొచ్చాయి. నిత్యం పూజలకు భోజనాంతరం తినే అరటి, చక్కర కేళి ధరలు రోజు రోజుకు పెరిగిపోతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ప్రతి చిన్న శుభ కార్యనికైనా, పూజకైనా అరటి కాయలు లేనిదే పని జరగదు. సంప్రదాయం ప్రకారం.. తాంబూలం ఇవ్వడం తప్పనిసరి. నిన్నటి వరకు శ్రావణ మాసం కావడంతో ప్రత్యేక పూజల నిమిత్తం కాయలు కొనుగోలు చేయక తప్పలేదు. మరలా గుడికి వెళ్లాలన్నా, పండుగలకు పూజలలో వాడేందుకు అరటి పండ్లు కొనుగోలు చేయక తప్పదు. సాధారణ అరటి పండ్లు రూ.60-80 వరకు ఉండటంతో కొనుగోలు దారులు చూసి చూసి కొనుగోలు చేస్తున్నారు. చక్కర కేళి అయితే ఇక చెప్పనవసరం లేదు. మార్కెట్‌లో డజను రూ.100కు పైమాటే తప్ప తక్కువ లేదు. హోల్‌సేల్ వ్యాపారుల వద్దే 7-8 హస్తాలుండే గెల రూ.850 పైనే పలుకుతుంది. సాధారణ అరటి రకం రూ.350 నుంచి రూ.600 వరకు గెలలు పలుకుతున్నాయి. హోల్ సేల్ వ్యాపారుల వద్ద రిటైల్ వ్యాపారులు కొనుగోలు చేసి వాటిని కావు వేయాల్సి ఉంటుంది. కావుకు మరలా గెలకు రూ.15 వరకు అదనంగా ఖర్చు అవుతుంది. దీంతో మార్కెట్‌లో అధిక ధరలు పలుకుతున్నాయి. ధర పెరుగుదలతో అమ్మకాలు తగ్గి వ్యాపారాలు పడి పోయాయని అరటి వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్‌లో సుమారు 40 కుటుంబాలకు పైబడి అరటి వ్యాపార వృత్తిలో జీవనం సాగించే వారున్నారు. మే నెలలో వీచిన గాలులకు కొన్ని చోట్ల అరటి చెట్లు పడి పోయాయి. దాంతోపాటు ఈ ఏడాది పంట వేసి విస్తీర్ణం కూడా పరిసర ప్రాంతాలలో తగ్గడంతో ఈ సీజన్‌లో రావాల్సిన దిగుబడి కంటే తక్కువ దిగుబడి వచ్చింది. సాధారణంగా పెరుకలపూడి, మూల్పూరు, చిలుమూరు, తుమ్మపూడి, జంపని, జాగర్లమూడి, పెసర్లంక, సుగ్గునలంక, ఈపూరులంక, చిలుమూరు ప్రాంతాల నుండి తెనాలి మార్కెట్‌కు అరటి గెలలు వస్తుంటాయి. ఆయా ప్రాంతాల నుండి వచ్చే అరటి గెలల దిగుమతి ఈ ఏడాది బాగా తగ్గడమే పెరుగుదలకు కారణమని వ్యాపారులు అంటున్నారు. అరటి వ్యాపారులు నంద్యాల, రావులపాలెం తదితర ప్రాంతాల నుంచి అరటి గెలలను దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడ కూడా గెల రూ.400-600 వరకు అరటి పడుతుండటం, దానితో పాటు ఒక్కో గెలకు రూ.60 వరకు రవాణా చార్జి పడుతుండటంతో స్థానికంగా టోకు వర్తకుల వద్ద ధరలు పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. గతంలో మన ప్రాంతం నుంచే అమృతపాణి రకం కలకత్తా తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతుండేది. ప్రస్తుతం అరటి తోటల సాగు విస్తీర్ణం తగ్గడం, రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపడం వంటి కారణాలతో అరటి దిగుబడులు తగ్గుతున్నాయని పలు వురు అంటున్నారు. గతంలో డజను రూ.10-20కి దొరికే అరటి పండ్లు నేడు రూ.50-70 పెట్టి కొనాల్సి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు. ఇంకా రెండు నెలల వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంటుందని వ్యాపారులు అంటున్నారు. పట్టణంలో 3, 4 హోల్ సేల్ అరటి దుకాణాలున్న మొత్తం రోజుకు 300 గెలలు కూడా సరుకు రాని పరిస్థితి. అంతే కాకుండా ఇతర తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే దిగుమతులు కూడా తగ్గిపోయాయి. ఇతర జిల్లాల నుంచి సరుకు వస్తే తప్ప ధర తగ్గే అవకాశం ఉండదని వ్యాపారులు అంటున్నారు.

ధర పెరగడంతో అమ్మలేకపోతున్నాం
- దర్శి శంకర్, వర్తకుడు



అరటి గెలల ధరలు బాగా పెరిగిపోవడంతో సరుకు అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. గతంలో రోజుకు 20-30 గెలలు విడిగి అమ్మే వాళ్లం. ఒక్కసారి ధర పెరగడంతో కొనుగోలు చేసేందుకు విని యో గదారులు ఆసక్తి చూపడం లేదు. తప్పని పరిస్థితులలో కొద్ది మేరకే కొనుగోలు చేస్తున్నారని చెబుతున్నారు. గతంలో పండుగ సీజన్ విపరీతంగా వ్యాపారాలు బాగా ఉండేవి. నాలుగు రూపాయలు మిగిలే అవకాశం ఉండేది. ఈ ఏడాది వ్యాపారమే సరిగా లేదు. గెలలు పండిన తర్వాత నిల్వ ఉంచితే పాడైపోతున్నాయి.

సంగీత, సాహిత్య, సాంస్కృతిక కదంబం
14
అమరావతీయం
గుంటూరు ● సోమవారం ● 28 ఆగస్టు 2017


దాస్య భక్తిని పండించిన దాసరులు

జానపదం

(గత సంచిక తరువాయి)

'గరుడ స్తంభం' అనే పేరుగల ఎత్తైన దీప స్తంభం ఏర్పాటుచేసి వత్తులు వెలిగించియుంచుతారు. ఈ స్తంభాన్ని పూలతో, తోరణంతో అలంకరిస్తారు. దీన్ని వీరు విష్ణువాహనానికి గుర్తుగా భావిస్తారు. కనుకనే 'గరుడ స్తంభం' అని పిలుస్తారు. నలుగురైదుగురు దాసరులు ఒక చేత్తో ఇత్తడి లేదా కంచుతో చేసిన పళ్లెం ఆకారంలోని వస్తువును తాడుతో వేలాడదీసి చేతికి తగిలించుకొని కొయ్యముక్కతో దాని మీద కొడుతూ తాళం వేస్తూ, దీప స్తంభంచుట్టూ ఒక మాదిరి నృత్యం చేస్తూ భజన కీర్తనలు గానం చేస్తారు. మధ్య మధ్య శంఖం పూరించి ప్రదర్శనకు నిండుదనం తెస్తారు. ఇలా చేయడాన్ని 'దీపసేవ' అంటారు. వీరు దీన్ని మంచి కళారూపంగా కూడా తీర్చిదిద్దుకున్న సందర్భాలూ లేకపోలేదు.

ఈ ప్రదర్శన సమయంలో వీరి ఆశీస్సులు పొందడం ఒక దైవయోగంగా కొన్నిప్రాంతాల వారు భావిస్తున్నారు. ముఖ్యంగా వీర వైష్ణవ మత ప్రభావమున్నవారు ప్రదర్శన మధ్యలో వారికి 'దక్షిణ' యిచ్చి మరీ గోత్రనామాలతో ఆశీస్సులు పొందడం జరుగుతుంది. దానికిగాను వారు ఒక గద్య చదువుతారు. గద్య చదివే విధానం ఆకర్షణీయంగా ఉంటుంది. ఒక కుటుంబంవారంతా ముందుకొచ్చి, దాసరికి దక్షిణ యిచ్చి, దీప స్తంభం కింద జిడ్డుగానున్న మసిని తీసుకొని బొట్టుగా ధరించి ముకుళిత హస్తాలతో



నమస్కరిస్తూ నిలబడితే దాసరి వారిమీద పూలు చల్లుతూ ఆశీర్వచన గద్య చదివి గోత్ర నామాలతో వారిని రక్షించవలసిందిగా భగవంతునికి నివేదిస్తాడు.

"శ్రీమదఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకా! వేదవేదాంత వేద్యా! బ్రహ్మాండ పాలకా! బాలగోపాలా! అవతారములు చూపు అంబుజనాభుడా.. రవిచంద్ర నేత్రుడా! రంగనాయకుడా! నరసింహరూపాన వెల్గు నారాయణాఖ్యుడా!"

"రాగి కాంచనమిచ్చి గోవిందయనువారి శ్రీనారసింహుడా సౌభాగ్యమీయరా! విజయనగరమున్ను ఉగ్ర నరసింహా! కావేటి రాయడా కస్తూరి నరసింహా! కరుణగలిగిన తండ్రి కదిరి నరసింహా! మార్కాపురమందున్న మద్దిలేటయ్యా! మంగళాద్రిని వెలయు మధురనరసింహా!.. గోత్రంబువారైన.. నీదు భక్తుడయ్య నిలిచి బ్రోవుమయ్యా..." ఇలా ఉంటుంది గద్య.

శ్రీవైష్ణవ వేషధారణతో శంఖాన్ని పూరిస్తూ మధ్య మధ్య గంట మోగిస్తూ గద్య చదివే ఆశీర్వచన రూపం చాలా హృద్యంగా అనిపిస్తుంది. కాని ఈనాడు ఎక్కడా కనిపించడంలేదు. దీపస్తంభం చుట్టూ నడిచే దీపసేవ కనుమరుగైనా కూడా వీరు దీపశిఖతో చిరతలు వాయిస్తూ ఉంఛవృత్తి చేయడం పదేళ్ల క్రితం వరకూ అక్కడక్కడా గ్రామాల్లో కనిపించేది. గద్యలు కూడా అక్కడక్కడ చదివేవారు. గృహస్తులు కూడా దాసరులను వొట్టి చేతులతో పంపేవారు కాదు. ధాన్యం, బియ్యం, పప్పులు, పళ్లు, డబ్బు ఇచ్చి పంపేవారు.

ఈ దండే దాసరుల స్త్రీలు ఈ కార్యక్రమాల్లో పాల్గొనరు. పూసలు, దువ్వెనలు, చిన్నచిన్న అద్దాలు, కుంకుమ, రకరకాల తిలకాలు, పిన్నీసులు, మూటగట్టుకొని, ఆ మూట తగిలించుకొని వీధి వీధి తిరిగి అమ్ముకుంటారు. ఇప్పుడొస్తున్న పై వస్తువులేవీ దాసరి స్త్రీలు అమ్మేదశలోను, వీరి దగ్గర కొనే దశలో సమాజం లేదు. అందుకే కూలినాలి చేసుకుంటున్నారు. నగరాల్లో అక్కడక్కడా పూసలమ్ముతూ కనిపించే స్త్రీలు ఈ దాసరి వనితల కారని గమనించాలి. ఆంధ్రదేశంలో రాయలసీమ ప్రాంతంలో ఈ దాసరివారు ఎక్కువగా ఉన్నారు. అక్కడ రామానుజ మతాన్ని స్వీకరించినవారు వివాహ కార్యక్రమాల్లో విధిగా ఈ దీపసేవ చేసుకునేవారు.

దేవతారాధనకు ఒక వృత్తిగా, జీవనాధారానికి కూడా ముందునిలిచిన ఈ జానపద్య కళారూపం ఇప్పుడు పూర్తిగా కనిపించడంలేదు. వేరువేరు వృత్తులనవలంబించి జీవనం గడుపుచున్నారు. ఏ వృత్తిలోనున్నా ఇంకా సాంఘిక జీవన పద్ధతుల్లో వైష్ణవ ఛాయలు మాత్రం ఈ దాసరులకు పోలేదు. వీరి జీవనం సుఖంగా సాగాలని కోరుకుందాం.

- డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, సెల్: 98483 61627

తొలి తెలుగు మూక నాటిక 'శాంతి'

నాటకం

విశ్వ వేదికపై యుద్ధోన్మాద తీవ్రతను కళ్లకు కట్టినట్లుగా చూపి ప్రపంచశాంతికి బావుటా ఎత్తిన గొప్ప రచనగా అనిశెట్టి శాంతి తెలుగు నాటకరంగంలో నిలిచింది.

తెలుగు నాటకరంగంలో సుప్రసిద్ధుడైన నాటక రచయితగా గుర్తింపు పొందిన అనిశెట్టి సుబ్బారావు గాలి మేడలు, మాఊరు, మానవుడు చిరంజీవి, చెప్పుకింది కూడు, జీవన సంగీతం, చరమాంకం వంటి నాటకాలు, నాటికలను రచించారు. తెలుగు నాటకరంగంలో తొలి తెలుగు మూక నాటికకగా గుర్తింపును పొందిన శాంతి నాటికను అనిశెట్టి 1951లో రచించాడు. శాంతికాముకుల అచంచల దీక్షను తట్టుకోలేక యుద్ధశక్తులు పలాయనం చిత్తగిస్తాయి. శాంతి బావుటాలను ఎగురవేస్తూ చైతన్య యాత్ర జరిగిన తీరును ఇతివృత్తంగా శాంతి మూకాభినయ నాటికను అనిశెట్టి రచించారు. ఈ నాటికను అభ్యుదయ కళాసమితి మద్రాసు మ్యూజియం థియేటర్‌లో 1951 ఏప్రిల్ 16న తొలిసారిగా ప్రదర్శించారు. 1952లో ఏలూరులో జరిగిన ఆంధ్ర రాష్ట్ర శాంతి సాంస్కృతిక మహాసభలలో ప్రదర్శించి ప్రథమ బహుమతిని పొందారు. అఖిలభారత శాంతి మహాసభ కౌన్సిల్‌లో సోవియట్ రచయితల ప్రతినిధి వర్గం ఎదుట ప్రదర్శించబడింది. తమిళ, మళయాల భాషలలో అనువదించబడి అనేక ప్రదర్శనలకు నోచుకుంది. సోవియెట్ రష్యా చలనచిత్ర ప్రతినిధి బృందం శాంతి నాటికను 1200ల అడుగుల నిడివిగల సినిమాగా తీసి రష్యాలో ప్రదర్శించారు. ఈ నాటికలో యువకుని పాత్రను వల్లం నరసింహారావు, యుద్ధశక్తులుగా వేణుగోపాల్, గిడుతూరి సూర్యం, కార్మిక కర్షక వీరులుగా పరుచూరి హనుమంతరావు, మహదేవ్, సైనికుడిగా పద్మనాభం, అమ్మగా అన్నపూర్ణ, వ్యాఖ్యాతలుగా వెంపటి రాధాకృష్ణ, పెరుమాళ్లు, మానుకొండ సూర్యావతి నటించారు. అనిశెట్టి గిడుతూరి సూర్యంతో కలసి మానవుడు చిరంజీవి అనే మూకాభినయ నాటికను రచించారు. ఈ నాటికను 1955లో మద్రాసులో జరిగిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రదర్శించారు.

- డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, 9848351517

మహిళలకు స్ఫూర్తి జానీమూన్

గుంటూరు మహిళలు



జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ షేక్ జానీమూన్ కాకుమాను మండలం కొమ్మూరులో 1989న ఆగస్టు 5న పేద కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు జిలేఖా, షేక్ సుభాని. జానీమూన్ కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలల్లో ఇంటర్‌మీడియట్ వరకు విద్యాభ్యాసం చేశారు. పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. పాఠశాల స్థాయి నుంచి సాటి విద్యార్థినులకు సహాయసహకారాలు అందించటంలో ఆసక్తి చూపేవారు. వారికి కష్టం కలిగినపుడు తానున్నానని ధైర్యం చెప్పేవారు. నిరుపేదల అభ్యున్నతికి కృషి చేయాలనేది ఆమె సంకల్పం. కాకుమాను మండలం ముస్లిం మైనార్టీ మహిళకు కేటాయించటం ఆమె ఆశయ సాకారానికి దోహదం చేసింది. కాకుమాను జడ్పీటీసీగా ఎన్నికై అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవిని చేపట్టారు. కాకుమాను మండలంలోని పద్దెనిమిది గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్న అనుభవం ఆమెకుంది. భర్త అబ్దుల్‌గఫార్ ప్రోత్సాహంతో రాజకీయాలలో రాణిస్తున్నారు. అటు అధికారులకు, ఇటు ప్రజలకు వారధిగా ఉంటూ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మండల, గ్రామస్థాయి ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించటంలో తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు జానీమూన్.

-డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, 9394 113848

కవి మహర్షి.. కన్నెకంటి వీరభద్రాచార్యులు

గుంటూరు కవులు

కన్నెకంటి వీరభద్రాచార్యులు పల్నాటి సోదర కవులలో మూడో వారు. 1912 మార్చి 29న తక్కెళ్లపాడులో జన్మించారు. కొద్దికాలం స్వర్ణకార వృత్తిలో ఉన్నారు. క్రమేపి ఆ వృత్తిని వదిలిపెట్టి హరికథాగానాన్ని, అవధానాలను నిర్వహించారు.

వీరు యౌవన దశ నుంచే చొక్కా ధరించటం మానేశారు. ఖద్దరు శాలువా, మెడలో లింగకాయకట్టిన జందెము, విభూతి ధారణం, చేతి సంచితో సనాతనులుగా కనిపించేవారు. తక్కెళ్లపాడు, జూలకల్లు, దాచేపల్లి, గురజాల, మోర్జంపాడులలో నివాసమున్నారు. ఉన్నవ, త్రిపురనేని, స్వామి తత్వానంద, బులుసు సాంబమూర్తి, ఆచార్య రంగా వంటి పెద్దలతోను, తుమ్మల, ఏటుకూరి, జాషువా వంటి కవులతోను స్నేహసంబంధాలు ఉన్నాయి. మధురకవి ఏలేశ్వరాచార్యులు, చిత్రావూరు నాగభూషణాచార్యులు, కాటూరి, విశ్వనాథ, కొప్పరపు సోదర కవులతో సత్సంబంధాలున్నాయి. వీరు మీర్జాపూర్ రాజా తీసిన 'రాధాకృష్ణ' చిత్రానికి మాటలు రాశారు.

వీరి రచనలు : 1. కుమార విజయం 2.ఆంజనేయ శతకం 3.గౌన్నాభక్తుల అచ్చమాంబికా ప్రశంస 4.పేదరాలు 5.పార్వతి 6.భువనజ్యోతి 7.ఆపన్న 8.సువర్ణాంజలి 9.నవభారతం 10.విశ్వవిపంచి 11.నందికొండ రాచిలుక 12.లోకబాంధవులు 13.పేద కాపు 14.పొట్టిశ్రీరాములు 15.అటుకుల మూట 16.శ్రీశైల ఖండము 17.కోదండరామ శతకం.

వీరభద్రాచార్యుల జీవితం, కవిత్వంపై స్వాతంత్ర్యోద్యమ ప్రభావం ఉంది. వీరి కవితా సామర్థ్యాన్ని గుర్తించి మాధవ రెడ్డి రాజయ్య పాల్వంచలోను, అడుసుమల్లి సూర్యనారాయణ గుడివాడ-ఆంధ్ర నలందలోను, తిక్కన జయంతి సందర్భంగా తిక్కవరపు రామిరెడ్డి, దసరా ఉత్సవాలలో మాచర్ల సాహితీ సమితివారు ఘనంగా సన్మానించారు. కాటూరి వారు వీరిని కవి మహర్షి అని సంబోధించారు.

వీరభద్రాచార్యుల కవితాగానం శంఖారవమును పోలి ఉంటుంది. శ్రోతలను తన్మయులను చేయటం వీరి సహజ లక్షణం. వీరిని 'చొక్కాలేని కవి'యని, 'మోర్జంపాటి కవి'యని, 'పలనాటి సంచి కవి'యని పిలిచేవారు. 1974 ఏప్రిల్ 3న వీరభద్రాచార్యులు పరమపదించారు.

'అరువదియేండ్ల భారత మహామహితోద్యయ గాథలన్నిటినిన్
వరుసగ గూర్చి పద్యములు వ్రాయుట సాధ్యముకాదు కాన నే
నెరిగినయట్లు చేర్చి రచియించితి కావ్యము, పండితోత్తముల్
సరసులు సత్కవీంద్రులది సైచినను గరుణింత్రుకావుతన్'

ఇది వీరి నవభారతంతోలోని పద్యం. తద్వారా వీరి వినయ సంపన్నత వెల్లడవుతోంది.

-డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు, 9393015584

గ్రంథ సమీక్షకు ఆహ్వానం

జిల్లాకు సంబంధించిన రచయితల గ్రంథాల సమీక్షకు ఆంధ్రజ్యోతి శ్రీకారం చుట్టింది. దీనికిగాను రచయితలు చేయవలసిందల్లా వారి ప్రచురితమైన రచనకు సంబంధించి రెండు కాపీలను దిగువ చిరునామాకు పంపాలి. రచనలు సాహిత్య, సాంస్కృతిక, సామాజిక ఇతివృత్తాలతో కూడి ఉండాలి. సమీక్షకు సంబంధించిన గ్రంథాల ఎంపికలో తుది నిర్ణయం ఆంధ్రజ్యోతిదే. తమ రచనలను పంపవలసిన చిరునామా :

ఎడిషన్ ఇన్‌చార్జి, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రఘుమాన్షన్ బిల్డింగ్స్, ఫస్ట్ ఫ్లోర్, బ్రాడీపేట 4వ లైన్, గుంటూరు.

నానీలు

పల్లెల్లో
గాదెల మాయం
పందికొక్కులు మాత్రం
ఎప్పటిలాగానే ..!?
....
లింకుల కర్రది
ఎంత అదృష్టం
భూమిని కొలుస్తూనే
మట్టిని ముద్దాడుతుంది

-సోమేపల్లి వెంకట సుబ్బయ్య

గ్రంథ సమీక్ష



'నాదోపాసనతోనే
మేదిని పావనముచేయ
మానవరూపం పొందిన
గంధర్వుడు మానాన్న'

భూసురపల్లి వేంకటేశ్వర్లు తన తండ్రి ఆదిశేషయ్య గురించి రాసిన కవితాత్మకమైన వాక్యమిది. లోకంలో ప్రతి వ్యక్తికి తండ్రికి సంబంధించిన అనుభవాలు, అనుభూతులు ఉంటాయి. కొందరికి అవి చేదుగా ఉంటే మరికొందరికి తీయగా ఉంటాయి. అనుభూతులను కొందరు వ్యక్తం చేస్తారు. కొందరు మనసులో దాచుకుంటారు. వ్యక్తం చేసే వ్యక్తి కవి అయితే భూసురపల్లి 'నాన్న కోసం'లో చెప్పినట్లు కవిత్వీకరించి చెపుతారు.

ఆదిశేషయ్యగారు ఆంధ్రదేశం గర్వించదగ్గ గొప్ప డోలు కళాకారుడు. ఆయన గొప్పతనం, ఆలోచనలు, ఆవేదనలు అపురూపంగా దాచుకొని, వెంకటేశ్వర్లు తన జ్ఞాపకాల హారాన్ని తన తండ్రి స్మృత్యర్థం ప్రచురించటం అభినందనీయం.

ఆదిశేషయ్యగారు తనపట్ల చూపించిన వాత్సల్యాన్ని, తన ఎదుగుదలకు ప్రోత్సహించిన విధానాన్ని, తనతో పోటీపడుతూ సంతోషించిన విషయాలను, ఆయన వైదుష్యాన్ని, వినయ సంపన్నతను ఇలా బహుముఖీనంగా వెంకటేశ్వర్లు ఈ చిన్నపుస్తకంలో గొప్పగా వ్యక్తీకరించారు.

గొప్ప తండ్రులున్నవారు తమ తండ్రుల గురించి ఇంత గొప్పగా రాయడాకి ఈ పుస్తకం దోహదపడుతుందని నా విశ్వాసం.

(**నాన్న కోసం,** రచన: భూసురపల్లి వెంకటేశ్వర్లు, పుటలు: 32, ప్రతులకు 9848361627లో సంప్రదించవచ్చు.

- డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, 9849799711

సాహితీ క్విజ్

1. 'పైర పంట' అనే రచన చేసిన కవి ఎవరు ?
2. 'భారత మాతను పచ్చి బాలింతరాలితో పోల్చిన కవి ఎవరు ?
3. 'లోయలో మనిషి' అనే కవితా సంకలన రచయిత ఎవరు ?
4. 'శాంతి ప్రసూనం' అనే గేయసంపుటిని రచించిన కవి ఎవరు ?
5. 'భారత పద్యశైలి' పై పరిశోధన చేసిన సాహితీవేత్త ఎవరు ?

జవాబులు :

1 తుమ్మల 2 జాషువా
3 సోమేపల్లి వెంకటసుబ్బయ్య
4.డీవీ నరసింహదీక్షిత్
5.డాక్టర్ చెరెడ్డి మస్తాన్‌రెడ్డి

నిర్వహణ : డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, 9849799711

సమాజం కోసం జీవించండి

- స్వతంత్ర భారతంలో ఇప్పటికీ ఆర్థిక, సాంఘిక అసమానతలు
- ప్రభుత్వంతో ప్రజలు కూడా కలిసి పనిచేస్తేనే అభ్యున్నతి
- ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య

(ఆంధ్రజ్యోతి,విజయవాడ/ గన్నవరం/ఉంగుటూరు) : 'మీ కోసం జీవించవద్దు! సమాజం కోసం జీవించండి!! ప్రభుత్వాలే అన్నీ చేయాలని ఇన్నాళ్ళూ ఒక అపోహ ఉండేది. ప్రభుత్వంతో పాటు ప్రజల నుంచి కూడా సహకారం లభించినప్పుడే సంపూర్ణ అభివృద్ధి దిశగా అడుగులు వేయగలం. సమాజ సేవ, స్వచ్ఛంద సేవ చేయటం అంటే నాకు ఎంతో ఇష్టం. సమాజసేవ చేయటం ద్వారా వచ్చే ఆనందం నిరుపమానం. ఒక్కసారి దానిని ఆస్వాదిస్తే సమాజ సేవలో ఉన్న మాధుర్యమేమిటో మీకు తెలుస్తుంది' అని భారత ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. నవ్యాంధ్రప్రదేశ్ అమరావతి రాజధాని ప్రాంతంలో రెండవ రోజు ఆదివారం తన పర్యటనలో ఆత్కూరులోని స్వర్ణభారత్‌ట్రస్ట్‌లో మెగా మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ ఉపరాష్ట్రపతిగా పదవి అలంకరించిన తర్వాత మొదటిసారిగా తెలుగునేలకు వచ్చి పౌర సన్మానం స్వీకరించటం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు రాజకీయాలకు దగ్గరగా ఉండేవాడినని, ఉప రాష్ట్రపతి పదవికి ఉన్న పరిమితులు, అధికారాలు, ఆంక్షలు నేపథ్యంలో, తాను అన్నింటికీ దూరంగా ఉండాల్సి వస్తుందన్నారు. తనకు ఎంతో ఇష్టమైన స్వర్ణభారత్ ట్రస్టుకు కూడా రాలేనని, అధికారులతో మాట్లాడి ఇష్టమైన ట్రస్టుకు వచ్చానన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలలో ప్రజలు విరివిగా పాల్గొనాలన్నారు. స్వతంత్ర భారతంలో ఇప్పటికీ ఆర్థిక అసమానతలు, సాంఘిక అసమానతలు ఉండటం దురదృష్టకరమన్నారు. సరైన విద్య, వైద్య సేవలు కూడా అందటం లేదన్నారు. ప్రజలు ఆకలికి అలమటిస్తున్నారని చెప్పారు. ఇలాంటి పరిస్థితులలో ప్రభుత్వంతో ప్రజలు కూడా కలిసి పనిచేస్తే వేగంగా అభ్యున్నతి సాధ్యమౌతుందని తెలిపారు. పూజలు, ప్రార్థనల వల్ల ఎంత పుణ్యం వస్తుందో, సామాజిక సేవ చేస్తే అంత పుణ్యం వస్తుందన్నారు. న్యాయం జరగని వారికి న్యాయం దక్కేలా చేసినా అంతే ప్రతిఫలం లభిస్తుందన్నారు. సొంత లాభం కొంతమానుకుని సమాజ సేవ చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. గవర్నర్ ఈఎల్ఎస్ నరసింహన్ మాట్లాడుతూ స్వర్ణభారతి ట్రస్టు గ్రామీణ ప్రాంతాల ప్రజల అభ్యున్నతికి ఎంతగా దోహదపడుతుందో తెలుసుకోగలిగానన్నారు.వెంకయ్యనాయుడు రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కావటం చేత గ్రామీణ ప్రాంత ప్రజలకు మేలు చేయటానికి ఈ ట్రస్టు ద్వారా మేలు చేస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ట్రస్టు ద్వారా నైపుణ్య శిక్షణ కల్పించటం వల్ల ఎంతో మందికి ఉపాధి లభిస్తోందని అన్నారు. మంత్రి కామినేని శ్రీనివాస్, గన్నవరం శాసన సభ్యులు వల్లభనేని వంశీమోహన్, కృష్ణా జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం, పోలీసు కమిషనర్ గౌతమ్ సవాంగ్ పాల్గొన్నారు.




ప్రసంగిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు

స్వర్ణభారతి ట్రస్టులో కళాశాల విద్యార్థినులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. విద్యార్థినులు ఎంతో పరిణితితో అడిగిన ప్రశ్నలకు వెంకయ్యనాయుడు చలోకీగా ఛలోక్తులతో సమాధానాలు ఇచ్చారు.

● మీరెప్పుడూ ఎందుకు తెల్లటి దుస్తులనే ధరిస్తారు? - స్వరూప



వెంకయ్య : తెలుపు చాలా స్వచ్ఛమైనది. కలర్‌ఫుల్ వస్త్రాలు వేసుకోవచ్చుగా అనిచాలా మంది అడుగుతుంటారు. మంచి డ్రెస్సులు వేసుకుని కలర్‌ఫుల్‌గా ఉండటం నాకు సంతృప్తిగా ఉండదు. నేను తెలుపు మార్చను. తెలుపు వేసుకోవటం నాకు ఇష్టం.

● పర్సనల్ లైఫ్‌ను, పొలిటికల్ లైఫ్ ఎలా మేనేజ్ చేయగలుగుతున్నారు? - సౌజన్య



వెంకయ్య : ప్రజా జీవితంలో ఉన్నప్పుడు పర్సనల్ లైఫ్‌ను త్యాగం చేయక తప్పదు. సొంత లాభం కొంత మానుకుని సేవ చేయాలి. పదవికి వన్నె తేవాలంటే మానసికంగా సిద్ధం కావాలి. ప్రజా సేవే పరమావధిగా మారాలి.

● మీ విజయసూత్రం ఏమిటి? మీరోల్ మోడల్ ఎవరు? - చరిత



వెంకయ్య : హార్డ్‌వర్క్ చేయటమే. కష్టే ఫలి. కష్టపడి పనిచేయటం, క్రమశిక్షణ, అంకితభావం ఉంటే విజయం మీ వెంట వస్తుంది. సర్దార్ వల్లభాయ్ పటేల్ నాకు రోల్ మోడల్. ఆయన తర్వాత నాకు అడ్వానీ, వాజపేయి అంటే స్ఫూర్తి.

● గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి ఎలా దోహదపడాలి? - రేణుక



వెంకయ్య : పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాలలోనే నిరుద్యోగం ఎక్కువగా ఉంది. గరీబీ హఠావో వంటి నినాదాలు ఇచ్చినంత మాత్రాన వీటిని రూపుమాపలేం. గ్రామీణ ప్రాంతాలలో శిక్షణలు, ఉపాధి కల్పించాలి. అన్నింటికీ మించి ప్రభుత్వ వ్యవస్థను మార్చాలి.

వాలీబాల్ విజేత నూజివీడు

- జూనియర్ విభాగంలో తెలంగాణ
- ముగిసిన రెండు రాష్ట్రాల స్థాయి వాలీబాల్ పోటీలు



ప్రథమ స్థానం సాధించిన నూజివీడు జట్టుతో ప్రిన్సిపాల్ ఆంతోని తదితరులు

గుంటూరు(క్రీడలు) : గుంటూరు నల్లపాడులోని లయోల పబ్లిక్ స్కూల్ క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న ఆంధ్రా, తెలంగాణ ఐసీఎస్ఈ, ఐఎస్‌సీ పాఠశాలల వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. సీనియర్ విభాగంలో ప్రథమ స్థానాన్ని కృష్ణా జిల్లా నూజివీడులోగ ల ఎస్‌డీపీ హైయ్యర్ సెకండరీ స్కూల్, ద్వితీయ స్థానాన్ని రాజమండ్రికి చెందిన ఫ్యూచర్ కిడ్స్ పబ్లిక్ స్కూల్ కైవసం చేసుకున్నాయి. జూనియర్ విభాగంలో ప్రథమ స్థానాన్ని హైదరాబాద్ మలక్‌పేటలో గల సెయింట్ జోసఫ్ స్కూల్, ద్వితీయ స్థానాన్ని హైదరాబాద్‌లోని సెయింట్ ఆన్స్ స్కూల్స్ కైవసం చేసుకున్నాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ చీఫ్ రిఫరి డానియల్ మాట్లాడుతూ పోటీలలో గెలుపు ఓటములు సహజమేనని, పాల్గొనడం ముఖ్యమని ఆయన అన్నారు. లయోల పాఠశాల ప్రిన్సిపల్ ఆంటోని మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఐసీఎస్ఈ, ఐఎస్‌సీ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు అందించే మెరిట్ సర్టిఫికెట్లు నీట్ పరీక్షల్లో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్బారావు, బాపూజీ, ఆంజనేయులు, కోటేశ్వరరావు, షేక్ ఫాతిమా, రమాదేవిలను అభినందించారు. జూనియర్ ఇండియన్ కప్పు విజేత ఎస్.సాయికిషోర్, అర్జున్ అవార్డు గ్రహీత, సింగారావు, లయోల పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ అంథోని, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ ఆండ్రూస్, లయోలా తెలుగు మీడియం ప్రధానోపాధ్యాయులు ఫాదర్ సునీల్ పాల్గొన్నారు.



పోటీపడుతున్న క్రీడాకారులు

సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్‌లో పతకాలు

గుంటూరు (క్రీడలు): తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో ఈ నెల 21 నుంచి జరిగిన 9వ సౌత్‌జోన్ రైఫిల్ షూటింగ్ పోటీల్లో గ ుంటూర ులోని ఇండియన్ అకాడమి ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ క్రీడాకారులు పలు సాధించినట్లు కోచ్ సుబ్రహ్మణ్యం తెలిపారు. టీమ్ ఈవెంట్‌లో ఐదు పతకాలు, వ్యక్తిగత ఈవెంట్‌లో ఒక పతకం సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం గుంటూరు అమరావతి రోడ్డులోని ఇండియన్ అకాడమి ఆఫ్ షూటింగ్‌లో క్రీడాకారులకు అభినందన కార్యక్రమం జరిగింది. ఈ పోటీల్లో గెలుపొందిన వారు సెప్టెంబర్ 14 నుంచి 27 వరకు ముంబైలో జరిగే ప్రీ ఓపెన్ నేషనల్ పోటీల్లో పాల్గొంటారని కోచ్, డైరెక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ముఖేష్ నెలవల్లి వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించాడు. పిప్‌సైడ్ సీనియర్ విభాగంలో అభి, వేద కిరణ్, వెంకట అమరేష్‌లు కాంస్య పతకాలు సాధించారు. జూనియర్ విభాగంలో అభి, వెంకట్, అమరేష్, హితేష్ నెలవల్లి టీమ్ ఈవెంట్స్‌లో కాంస్యపతకం సాధించారు. పిప్‌సైడ్ మెన్ విభాగంలో అభి, వెంకట్, హితేష్ కాంస్య పతకాలు సాధించగా ఎయిర్ పిస్టల్ సీనియర్ విభాగంలో ముఖేష్, సిహెచ్ గణేష్‌లు కాంస్య పతకాలు సాధించారు. తమ క్రీడాకారులు 15 పతకాలు సాధించారని పేర్కొన్నారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ సుబ్రహ్మణ్యం

మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రచారం

● సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు.. ● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విజయవాడ: సీపీఐ జాతీయ కార్యవర్గం నిర్ణయం మేరకు కేంద్రంలో మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ దేశ వ్యాప్తంగా సెప్టెంబర్ 15వ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నెలరోజుల పాటు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఆదివారం విజయవాడలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో డేరాబాబా సహకారంతో హరియాణాలో ఎన్నికలను నిర్వహించినందునే ప్రస్తుతం ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని అన్నారు. డేరాబాబాతో అక్కడి ప్రభుత్వం లాలూచీ పడటం వల్లే అక్కడ అంత పెద్దస్థాయిలో విధ్వంసం జరిగిందన్నారు. ఒకవైపు పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వల్ల సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మరో వైపు మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు.

ఎలక్షన్ కాదు.. ఆక్షన్ పెట్టాలి

రాష్ట్రంలో ప్రజాస్వామ్య యుతంగా జరపాల్సిన ఎన్నికలను అధికార, ప్రతిపక్షాలు అపహాస్యం చేస్తున్నాయని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ ఎన్నికలను చూస్తుంటే భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో కమ్యూనిస్టులు పోటీ చేయకుండా ఉండటమే మేలనే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. రాష్ట్రంలోని పరిస్థితులపై కూడా నెలరోజుల పాటు జరిగే కార్యక్రమంలో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సీఐఈఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, రావుల వెంకయ్య, జి.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కె.రామకృష్ణ

కాపు రిజర్వేషన్‌తో బీసీలకు అన్యాయమే

- బీసీల రాజకీయ పార్టీ ఏర్పాటుకు త్వరలో నిర్ణయం
- త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీ బహిరంగసభలు
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

గుంటూరు: కాపు రిజర్వేషన్‌తో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు. పాతగుంటూరులో ఆదివారం జరిగిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీలకు అన్యాయం జరగకుండా కాపులకు రిజర్వేషన్ కల్పిస్తామనడం ఆచరణ సాధ్యం కానిదన్నారు. కాపు రిజర్వేషన్‌తో బీసీలు రాజకీయంగా మరింత అణచివేయబడతారన్నారు. కాపు రిజర్వేషన్‌కు ఎందుకు వ్యతిరేకమో చర్చలకొస్తే పూర్తి వివరాలతో సమాధానం చెబుతామన్నారు. మంజునాధ కమిషన్ నిష్పక్షపాతంగా సర్వే చేయాలని కోరారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని ధనస్వామ్యం, అగ్రకుల స్వామ్యాలు పనిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఓట్లు బీసీలవి...సీట్లు అగ్రకులాల నాయకులకా అని ప్రశ్నించారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగుల ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ ముందు 75 డిమాండ్లు పెట్టగా రెండింటిని ఆమోదించటం హర్షణీయమన్నారు. ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించటం, ఓబీసీల వర్గీకరణకు ఆమోదించటమన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని 14 లక్షల ఉద్యోగ ఖాళీలు, రాష్ట్రంలోని మరో లక్ష ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బీసీలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు త్వరలో రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో భారీ బహిరంగసభలు నిర్వహించనున్నట్లు కృష్ణయ్య పేర్కొన్నారు. బీసీలను వైసీపీ నేతలు రెచ్చగొడుతున్నారన్న విమర్శలపై ఆర్ కృష్ణయ్య స్పందిస్తూ తమను ఎవరూ రెచ్చగొట్టాల్సిన పనిలేదని రెండున్నర దశాబ్దాలుగా బీసీ పోరాటాలు చేస్తున్నామని సమాధానమిచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ కాపు రిజర్వేషన్ రాజ్యాంగ విరుద్ధమన్నారు. కాపులు ఇప్పటికే అన్ని రంగాల్లో అభివృద్ధి చెం దారన్నారు. కాపు రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా తాము ఎటువంటి త్యాగాలకైనా సిద్ధమని ప్రకటించారు.

బీసీ పార్టీ కోసం కార్యకర్తల నినాదాలు

సమావేశం మధ్యలో బీసీ రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాలంటూ పలువురు కార్యకర్తలు ఆర్ కృష్ణయ్య సమక్షంలోనే నినాదాలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు తదితరులు

సీట్లు అడుక్కోవటం కాదు...మనమే సీట్లు ఇద్దామంటూ కొందరు కార్యకర్తలు నినాదాలతో ఆందోళనకు దిగారు. దీనిపై కృష్ణయ్య స్పందిస్తూ బీసీ రాజకీయ పార్టీ ఏర్పాటు కోసం త్వరలో అన్ని బీసీ కులాలతో చర్చలు జరిపి నిర్ణయం తీసుకుంటామన్నారు. విలేకరుల సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఈడే మురళీకృష్ణ, నగర అధ్యక్షులు కన్నా మాష్టారు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, నాయకులు అంగిరేకుల ఆదిశేషు, మారగాని నాగేశ్వరరావు, సుబ్రమణ్యం, కిశోర్‌కుమార్ తదితరులున్నారు.



ఉపరాష్ట్రపతి వెంకయ్యకు వీడ్కోలు పలుకుతున్న మంత్రులు, గవర్నర్ నరసింహన్

వెంకయ్యనాయుడుకు ఘన వీడ్కోలు

ఎయిర్‌పోర్టు(గన్నవరం): కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొని చెన్నై వెళుతున్న ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు గన్నవరం ఎయిర్‌పోర్టులో ఘనంగా వీడ్కోలు పలికారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత వైద్య శిబిరం ప్రారంభించి రోడ్డు మార్గాన ఎయిర్‌పోర్టుకు వచ్చారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, రాష్ట్ర మంత్రులు దేవినేని ఉమామహే శ్వరరావు, డాక్టర్ కామినేని శ్రీనివాస్, నక్కా ఆనంద్‌బాబు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దినేష్ కుమార్, డీజీపీ నండూరి సాంబశివరావు, ఇంటెలిజెన్స్ చీఫ్ ఏబీ వెంకటేశ్వరరావు, ప్రోటోకాల్ కార్యదర్శి ఎన్. శ్రీకాంత్, కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, సీపీ గౌతం సవాంగ్, డీసీపీ క్రాంతి రాణా తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా హాస్పటల్స్‌లో పిల్లలకు ఉచిత గుండె ఆపరేషన్‌లు

ఆంధ్రజ్యోతి, విజయవాడ : హీలింగ్ లిటిల్ హార్ట్, యూకే చారిటీ వారి సౌజన్యంతో ఏడుగురితో కూడిన ఇంగ్లాండ్ పిల్లల గుండె జబ్బుల వైద్య బృందం, ఆంధా హాస్పటల్స్, హార్ట్ అండ్ బ్రెయిన్ ఇన్‌స్టిట్యూట్స్, ఆంధ్ర హాస్పటల్స్‌లో సెప్టెంబర్ 9వ తేదీ వరకు పిల్లల గుండె ఆపరేషన్లు చేయనున్నట్లు చీఫ్ ఆఫ్ చిల్డ్రన్ సర్వీసెస్ పి.వి.రామారావు తెలిపారు. డీవీ మానర్ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ వైద్య బృందంలో పిల్లల గుండె జబ్బుల వైద్య నిపుణులు, డాక్టర్ బ్రాంకో మిమిక్ - కార్డియాలజిస్ట్, డాక్టర్ జూలియా, డాక్టర్ జోహా తదితరులు 25 మంది పిల్లలకు గుండె ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. పిల్లలకు కాంప్లికేషన్స్, గుండెలో రంధ్రాలు, ఊపిరితిత్తులలోని రక్తనాళాలలో వత్తిడి ఎక్కువగా ఉండటం, మూడు లేక నాలుగు రకాల గుండె సమస్యలు ఉన్న క్లిష్టమైన జబ్బులతో ఉన్న పిల్లలకు శస్త్ర చికిత్సలు చేయటం జరుగుతుందన్నారు. 2015 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు ఆరుసార్లు ఆంధ్ర హాస్పటల్స్‌లో 164 మంది పిల్లలకు సర్జరీలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఇక నుంచి ప్రతి రెండు నెలలకొకసారి చిన్న పిల్లల గుండెలకు శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రా హాస్పటల్స్ రాష్ట్ర ఇండియన్ అకాడమి ఆఫ్ పెడియాట్రిక్స్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో వైద్యులు ప్రసంగించారు. సదస్సులో రాష్ట్రంలోని పిల్లల డాక్టర్లు, ఇంటెన్సివ్ కేర్ స్పెషలిస్టు, కార్డియాలజిస్టులు పోస్టుగ్రాడ్యుయేట్స్ పాల్గొన్నారు. ఇంగ్లాండ్ వైద్యులు డాక్టర్ విక్రమ్ కుడుములు, డాక్టర్ జోహా, డాక్టర్ జూలియా, డాక్టర్ ఆర్.వెంకటేశ్వరరావు, డాక్టర్ దుర్గారావు, డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ మల్లికార్జునరావు, డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ రామారావు

పేద చేనేత కుటుంబాలకు అండగా నిలుస్తాం

మంగళగిరి టౌన్: రాష్ట్రంలోని పేద చేనేత కార్మిక కుటుంబాలకు, వారి పిల్లలు ఉన్నత చదువులు చదువుకునేందుకు పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున అండగా నిలుస్తామని అసోసియేషన్ కేంద్ర కమిటీ అధ్యక్షులు స్వర్గం పుల్లారావు అన్నారు. అసోసియేషన్ మంగళగిరి శాఖ ఆధ్వర్యాన సాయినగర్‌లోని గంజి వెంకయ్య-సామ్రాజ్యం కల్యాణ మండపంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంగళగిరి అసోసియేషన్ అధ్యక్షులు అవ్వారు సత్యకృపాల్ డాంగే అధ్యక్షతన జరిగిన సభలో పుల్లారావు ప్రసంగించారు. అసోసియేషన్ తరపున గత ఎనిమిదేళ్లుగా పేద చేనేతలకు అనేక సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రూ.కోటి 55 లక్షల విలువ చేసే ఆర్థికసాయం అందించినట్టు చెప్పారు. ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ చదువుతున్న 115 మంది విద్యార్థులకు రూ.రెండు లక్షల విలువైన ఉపకార వేతనాలు, ఆర్థికసాయం, ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న రెండొందల మంది విద్యార్థులకు రూ.35 వేల విలువ చేసే నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కటకం అన్నపూర్ణ వైద్య ఖర్చుల నిమిత్తం ఆమె భర్త చంద్రరావుకు రూ.11 వేలను అందజేశారు. నిట్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించి ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీటు సాధించిన ముగ్గురు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి విన్నకోట వెంకటేశ్వర్లు (కన్నా మాస్టారు), మంగళగిరి శాఖ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, సభ్యులు మురుగుడు లక్ష్మీనారాయణ, నీలి కనకదుర్గాప్రసాద్, బట్టు నారాయణ, దామర్ల శివరామకృష్ణ, జొన్నాదుల బాపూజీ, గంజి రవీంద్రనాథ్, జొన్నాదుల మణి, మంచా విజయమోహన్, నందం బాబూరావు, దామర్ల వెంకటస్వామి, పడవల పెరుమాళ్లు, మండ్రు రాము, దామర్ల కుబేరస్వామి, నీలి గిరిధర్‌రావు, అందె వెంకన్న, వంగర పెదలక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేస్తున్న స్వర్గం పుల్లారావు తదితరులు

ఏళ్ల తరువాత ఏకమైన వేళ..

- ఆత్మీయ ఆలింగనాలు, పలకరింపులతో పులకరించిన చిన్ననాటి మిత్రులు
- 47 ఏళ్ల తరువాత కలిసిన కావూరు ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు



దశాబ్దాల తరువాత ఒకచోట కలిసిన కావూరు పాఠశాల పూర్వ విద్యార్థులు

చెరుకుపల్లి: ఆత్మీయ ఆలింగనాలు, పలకరింపులు, అలనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ ఆరు పదుల వయస్సు నుంచి ఒక్కసారిగా బాల్యంలోకి వెళ్లిపోయారు మండలంలోని కావూరు జిల్లా పరిషత్ స్కూల్ పూర్వ విద్యార్థులు. కావూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం 1969-70లో కావూరు జిల్లా పరిషత్ హయ్యర్ సెకండరీ అండ్ మల్టీపర్పస్ స్కూల్‌లో సెవెంత్ ఫారం చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 47 ఏళ్ల తర్వాత తర్వాత చిన్ననాటి మిత్రులందరినీ ఒక్కసారిగా కలవడంతో భావోద్వేగానికి గురయ్యారు. వారి ఆత్మీయ పలకరింపులతో కళాశాల ప్రాంగణం పులకరించింది. ఎక్కడ ఉంటున్నారు.. ఏం చేస్తున్నారంటూ కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి విశ్రాంత ఉపాధ్యాయుడు తుమ్మల గాంధీ ప్రసాద్ అధ్యక్షత వహించి ప్రారంభో పన్యాసం చేశారు. ఆత్మీయ సమ్మేళనానికి అందరికీ సమాచారం అందించి నిర్వహణ బాధ్యతలు వహించిన డాక్టర్ ఎండీ తుమ్మల రామకృష్ణ మాట్లాడుతూ చిన్ననాటి మిత్రుల మంతా కలుసుకోవాలనే సదుద్దేశంతో ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తరచూ కలవడం ద్వారా అనుబంధాలు పెరుగుతాయన్నారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కార్యాచరణ రూపొంది స్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం అలనాటి గురువులు కొడాలి రాజారామ్మో హన్‌రావు, సుఖవాసి రాధాకృష్ణమూర్తి, కాట్రగడ్డ హరిప్రసాద్, పర్చూరి సుధాకరరావు, గాంధీప్రసాద్, రామకృష్ణలను రామకృష్ణ మిత్ర బృందం ఘనంగా సత్కరించి మెమొం టోలు అందజేసింది. రేపల్లె మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తుమ్మల నరేంద్రనాథ్‌ను సత్కరించారు. ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసిన రామకృష్ణ దంపతులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. వీరాస్వా మి, కె.మాధవరావు, పావులూరి సాంబశివరా వు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి

తాడికొండ: మండల పరిధిలోని రావెల గ్రామంలో విద్యుదాఘాతానికి యామర్తి అభినందరావు (42) అనే వ్యక్తి మృతి చెందాడు. వినాయక విగ్రహ నిమజ్జనం అనంతరం మండపాన్ని తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు తాడికొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన అభినందరావు

అట్టహాసంగా... గణేష్ నిమజ్జనాలు



నిమజ్జనానికి అమరావతి తరలివస్తున్న వినాయకుని విగ్రహాలు

అమరావతి: వినాయక చవతి పర్వదినం రోజున పూజలు అందుకున్న గణనాథుల విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఆదివారం కోలాహలంగా జరిగింది. పండుగ తరువాత వచ్చిన ఆదివారం మూడోరోజు కావడంతో గుంటూరు పరిసర గ్రామాల నుంచి వివిధ రూపాల్లో కొలువై ఉన్న బొజ్జ గణపయ్యల విగ్రహాలను పలు వాహనాలపై తీసుకువచ్చి అమరావతిలోని నదీతీరాన నిమజ్జనం చేస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి సత్తెనపల్లి, గుంటూరు రహదారుల నుంచి ఎక్కువ సంఖ్యలో గణనాథుల విగ్రహాలతో వాహనాలు అమరావతి చేరుకున్నాయి. ముందుగా ప్రధానవీధిలో గుండా పోస్టాఫీసు పక్క రోడ్ నుంచి ధ్యానబుద్ధ ప్రాంగణంలోకి వాహనాలను పోలీసులు పంపించారు. నిమజ్జన ప్రదేశంలో రద్దీని బట్టి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. మూడు క్రేన్‌లతో విగ్రహాలను పడవలపైకి చేర్చి అక్కడ నుంచి నదిలో నిమజ్జనం చేయించారు. భారీ సంఖ్యలో వినాయక విగ్రహాలు అమరావతి చేరడంతో సీఐ మురళీకృష్ణ, ఎస్ఐలు నరసింహారావు, రహంతుల్లా అదనపు సిబ్బందితో బందోబస్తు నిర్వహించి నిమజ్జనంలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూశారు. నిమజ్జనం పూర్తిచేసుకున్న భక్తులు ధ్యానబుద్ధ పుష్కరఘాట్‌లో స్నానాలు చేసి తమ వెంట తెచ్చుకున్న ప్రసాదాలను స్వీకరించి వెళ్తున్నారు. నదిలో నీటి మట్టం కూడా పెరగడంతో విగ్రహాలు నీటిలో నిమజ్జనం అవుతున్నాయి.



పెదపరిమిలో గణనాథుల విగ్రహాల ఊరేగింపు

మూడేళ్లుగా హనుమయ్యకే గణేశ్ లడ్డూ

● ఈ సారి వేలం రూ.1.15 లక్షలు



అమరావతి: స్థానిక సత్తెనపల్లి రోడ్డులోని సుందరయ్య నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ మండపం వద్ద ఆదివారం నిర్వహించిన వేలంపాటలో లడ్డూ ధర రూ.1.15 లక్షలు పలికింది. ఇదే కాలనీకి చెందిన నెట్టెం హనుమయ్య వేలంపాటలో లడ్డూ ప్రసాదం దక్కించుకున్నారు. మూడు సంవత్సరాల నుంచి హనుమయ్య వేలంలో లడ్డూను దక్కించు కుంటున్నారు. వేలంపాటలో చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

తుళ్లూరు మండలంలో...



తాడికొండలో వినాయక విగ్రహాల నిమజ్జనం

తుళ్లూరు: పెదపరిమి గ్రామంలో ఆదివారం ఘనంగా విఘ్నేశ్వరుల విగ్రహాల నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం జరిగింది. భక్తిశ్రద్ధలతో వినాయకుల విగ్రహాలకు పూజా కార్యక్రమం నిర్వహించారు. నెక్కల్లు రోడ్డులోని వినాయకుడి గుడి, వైఎస్సార్ సెంటర్, మిక్చర్ కాలనీ, వేణుగోపాల స్వామి గుడి సెంటర్‌లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలతో నిమజ్జన ఊరేగింపు నిర్వహించారు. చౌదరి యూత్ ఆధ్వర్యంలో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బాణసంచా కాల్చుతూ ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు. మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. నిమజ్జనానికి తరలి వెళుతున్న వినాయక విగ్రహాలకు భక్తులు హారతులు కానుకలు సమర్పించారు. ఈ సందర్భంగా పెదపరిమిలో కోలాహలం నెలకొంది. ఊరేగింపు అనంతరం రాయపూడి కృష్ణానదిలో విగ్రహాలను నిమజ్జనం గావించారు. కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

తాడికొండ అక్కదేవత చెరువులో...

తాడికొండ: మండలంలో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ఆదివారం అక్కదేవత చెరువులో నిమజ్జనం నిర్వహించారు. నిమజ్జన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పొన్నెకల్లులో ప్రత్యేక పూజలు ...

తెలుగు యువత ఆధ్వర్యంలో పొన్నెకల్లు గ్రామ దిగుడు బావి సెంటర్‌లో, పరిటాల యువసేన ఆధ్వర్యంలో కోపూరి వారి సెంటర్‌లో గణపతి మహోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు ప్రత్తిపాటి సుధీర్, ప్రత్తిపాటి భాను, ప్రత్తిపాటి వంశీ, ప్రదీప్, కామేపల్లి సతీష్, రామినేని సుధీర్, బిక్కు సురేష్, నెల్లూరి మనీష్, తెలుగుదేశం కార్యకర్తలు పాల్గొన్నారు.

కుమారుడి అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు



శ్రీనివాసరావు

అమరావతి: వినాయక చవితి వేడుకలకు బంధువుల ఊరు వెళ్లిన కుమారుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో అమరావతి పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేసిన సంఘటన ఆదివారం జరిగింది. తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన నంబూరి సత్యం రెండవ కుమారుడు శ్రీనివాసరావు (55) మానసిక వికలాంగుడు. మాటలు సరిగా మాట్లాడలేడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. అమరావతి మండలం లింగాపురం గ్రామంలోని బంధువుల ఇంటికి పండుగ రోజు వెళ్లాడు. 26వ తేదీ ఉదయం 11 గంటలకు పెదపరిమి వెళ్తున్నానని బయలుదేరాడు. అమరావతి బస్టాండ్‌కు చేరుకున్న శ్రీనివాసరావు ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆదివారం పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి హోమం

అమరావతి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కోదండ రామాలయంలో ఆదివారం లక్ష్మీగణపతి హోమం భక్తిశ్రద్ధలతో జరిగింది. తొలుత ఆలయ అర్చకులు పరాశరం రామకృష్ణమాచార్యులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన నిర్వహించి హోమాన్ని నిర్వహించారు. హోమంలో దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యల పరిష్కారానికి కృషి

● ఎంపీపీ షేక్ రిజ్వానా

తాడికొండ: స్థానిక ప్రభుత్వ బీసీ బాల బాలికల వసతి గృహంలో తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ షేక్ రిజ్వానా మాట్లాడుతూ విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే తెలపాలన్నారు. దీనికి విద్యార్థులు మాట్లాడుతూ భోజనానికి రేషన్ బియ్యం వాడుతున్నారని, వాటి స్థానంలో సన్న బియ్యం ఇవ్వాలని కోరారు. హాస్టల్ బయట మురుగు కాలువ పూడిక తీయించాలన్నారు. వర్షం పడినప్పుడు మురుగు నీరు హాస్టల్ ఆవరణలోకి వస్తున్నాయని తెలిపారు. తాగడానికి ప్యూరిఫైర్ వాటర్‌ను ఏర్పాటుచేయాలని కోరారు. దీనికి స్పందించిన ఎంపీపీ ఆయా సమస్యలన్నింటినీ త్వరలో పరిష్కరిస్తానని హామీఇచ్చారు.



విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంపీపీ షేక్ రిజ్వానా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

● ఎమ్మెల్సీ రామకృష్ణ

తాడికొండ: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనని గుంటూరు, కృష్ణా జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ ఏఎస్ రామకృష్ణ అన్నారు. ఆదివారం తాడికొండ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ స్కౌట్స్ అండ్ గైడ్స్ 1907లో ఇంగ్లాండ్‌లో ప్రారంభమైందని, ఇదొక సేవాసంస్థ అని అన్నారు. విద్యార్థులకు మంచి పదాలు, మంచి వాక్యాలు నేర్పాలన్నారు. సమాజంలో ఏ పనిచేయాలన్నా శిక్షణ అవసరమన్నారు. మనలో మార్పు వచ్చినప్పుడు ఇతరుల్లో మార్పును కోరుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నేర్చుకున్న జ్ఞానాన్ని విద్యార్థులకు పంచాలన్నారు. ప్రతి వ్యక్తి మంచి ఆలోచనలు, మంచి స్వభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. వ్యక్తి పేరును బట్టిగుర్తింపు అనేది రాదని, అతను చేసే సామాజిక సేవ, ప్రవర్తనను బట్టి గుర్తింపు వస్తుందన్నారు. విద్యార్థులకు శారీరకంగా, మానసికంగా దృఢంగా చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి వ్యక్తిలో బలం, బలహీనతలు, మంచీచెడూ ఉంటాయన్నారు. మనిషి పుట్టుక ఎంత సంతోషంగా ఉంటుందో మరణం కూడా అంతే సంతోషంగా ఉండాలన్నారు. ప్రతి వ్యక్తి ధైర్యంగా ముందుకు పోవాలన్నారు.

కార్యక్రమానికి తాడికొండ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్సీ రామకృష్ణను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.



- తుళ్లూరు, అమరావతి

టీడీపీ నాయకుల ప్రచారం

కాకినాడలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో శని, ఆదివారాల్లో పాల్గొన్న తాడికొండ, పెదకూరపాడు ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, కొమ్మాలపాటి శ్రీధర్



దినఫలాలు

అదృష్టసంఖ్యలు: 1, 9

మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): రుణాలు మంజూరవుతాయి. సన్నిహితుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. పొదుపు పథకాల గురించి సహోద్యోగులతో చర్చిస్తారు. ఆస్పత్రులు, ఔషధ రంగాల వారికి ప్రోత్సాహకరం.

వృషభరాశి: (ఏప్రిల్21-మే20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. శ్రీవారు, శ్రీమతి విషయాల్లో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. కొత్త పరిచయాలు ఉల్లాసం కలిగిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం.

మిథునరాశి: (మే21-జూన్21): వృత్తి, వ్యాపారాల్లో మార్పులు, చేర్పులకు అనుకూలం. సహోద్యోగుల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకోవాల్సి రావచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు కొలిక్కి వస్తాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతారు.

కర్కాటకరాశి: (జూన్22-జూలై23): పొదుపు పథకాలు, చిట్‌ఫండ్‌లు లాభిస్తాయి. మెయిల్స్, శుభ సందేశాలు అందుకుంటారు. సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రవేశానికి అనుకూలం. ప్రేమానుబంధాలు బలపడతాయి. విద్యార్థులకు శుభప్రదం.

సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్థిక విషయాల్లో లక్ష్యాలు సాధిస్తారు. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. ఆర్థిక విషయాలను సమీక్షించుకుంటారు. రుణాలు మంజూరవుతాయి.

కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీ, సోదరుల వ్యవహారాలు, ప్రయాణాలు, చర్చలకు అనుకూల సమయం. వాహనాలు కొనుగోలు చేస్తారు. స్టేషనరీ, ఏజెన్సీలు, మార్కెటింగ్, బోధన రంగాల వారికి శుభప్రదం. శుభవార్త అందుకుంటారు.

తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కీలక సమాచారం అందుకుంటారు. రాజకీయ, సినీరంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులను సమీక్షించుకుంటారు. పాత బకాయిలు వసూలవుతాయి.

వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): స్నేహానుబంధాలు విస్తరిస్తాయి. యూనియన్‌లు, సహకార సంఘాల కార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు. వేడుకల్లో పాల్గొంటారు. ఊరేగింపులు, ప్రదర్శనల్లో పాల్గొంటారు. సంకల్పం నెరవేరుతుంది.

ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ప్రముఖుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. రాజకీయ, సినీ, బోధన రంగాల వారు గౌరవ పదవులు అందుకుంటారు. పూర్వానుభవంతో లక్ష్యాలు సాధిస్తారు.

మకరరాశి(డిసెంబర్22-జనవరి21): న్యాయ, రక్షణ, బోధన రంగాల వారికి ఆర్థికంగా ప్రోత్సాహకరం. పెట్టుబడులకు సంబంధించిన సమాచారం సేకరిస్తారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో పనులు పూర్తవుతాయి. సంకల్పం నెరవేరుతుంది.

కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పెద్దల ఆరోగ్యం మెరుగుపడుతుంది. వృత్తి, వ్యాపారాల్లో పురోగతిని సమీక్షించుకుంటారు. ప్రముఖుల సహకారంతో ఆర్థికపరమైన లక్ష్యాలు సాధిస్తారు. శ్రమకు తగిన ఫలితం అందుకుంటారు.

మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. న్యాయ, రక్షణ, బోధన రంగాల వారు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. సమావేశాలకు సన్నాహాలు చేస్తారు. సంకల్పం ఫలిస్తుంది.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

గన్నవరం విమాన సమాచారం

ఎయిర్ పోర్టు ఫోన్ నెంబర్ : 0866- 2846729

- **హైదరాబాద్** : ఉదయం 9:35, సాయంత్రం 5:20, 5:35, రాత్రి 9:55 (ప్రతి రోజు), మధ్యాహ్నం 1:20 (బుధవారం మినహా)
- **విశాఖపట్నం** : ఉదయం 10:55 (బుధవారం మినహా), మధ్యాహ్నం 3:35 (బుధవారం మాత్రమే)
- **బెంగళూరు** : ఉదయం 7:45, రాత్రి 8:00 (ప్రతిరోజు), మధ్యాహ్నం 2:00 (మంగళవారం మినహా)
- **ఢిల్లీ** : ఉదయం 9:05, సాయంత్రం 5:20 (హైదరాబాద్ మీదుగా), రాత్రి 8:40 (ప్రతిరోజు)
- **చెన్నై** : ఉదయం 7:55, సాయంత్రం 5:20 (ప్రతిరోజు)
- **తిరుపతి** : ఉదయం 7:55 (బుధవారం మినహా)

13 మండలాల్లో 1.2మి.మీ సగటు వర్షపాతం

● తాడికొండలో అధిక వర్షపాతం

ఆంధ్రజ్యోతి, గుంటూరు: జిల్లాలో ఆదివారం ఉదయం 8 గంటల వరకు 13 మండలాల్లో 1.2 మిల్లీమీటర్లు సగటు వర్షపాతం నమోదైంది. అధికంగా తాడికొండలో 17.2 మిల్లీమీటర్లు, తక్కువగా అమృతలూరు, నరసరావుపేటలలో 1.2 మి.మీ. వంతున వర్షంకురిసింది. నెలాఖరు వరకు జిల్లాలో 152 మి.మీ. వర్షపాతం నమోదు కావాలి. ఈ నెల 27 తేదీ ఉదయం 8గంటల వరకు 138.6 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 178.1 మి.మీ. కురిసి 28శాతం ఎక్కువగా ఉంది. తాడికొండ, తాడేపల్లి, దుగ్గిరాల, గుంటూరు, కాకుమాను, మాచవరం, నూజెండ్ల, పెదకూరపాడు, ప్రత్తిపాడు, తుళ్లూరు మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో అధికంగా శావల్యాపురంలో 133, బొల్లాపల్లిలో 103 శాతం వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 28 శాతం వర్షపాతం ఎక్కువగా నమోదైనట్లు తెలిపారు.

ఆర్టీసీ కార్గో పార్సిల్ కేంద్రం ప్రారంభం



కార్గో పార్సిల్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌ఎం శ్రీహరి

గుంటూరు: ఆర్టీసీ కార్గో పార్సిల్, కొరియర్ రవాణా కార్యాలయాన్ని గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ఆదివారం రీజనల్ మేనేజర్ జ్ఞానంగారి శ్రీహరి ప్రారంభించారు. ఆర్టీసీలో ఏఎన్‌ఎల్ పార్సిల్ సంస్థ టెండర్ సమయం ముగియటంతో ఆర్టీసీ కార్గో సంస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎన్‌టీఆర్ బస్టాండ్‌లోని ఏఎన్‌ఎల్ పార్సిల్ కార్యాలయాన్నే కార్గో పార్సిల్ కార్యాలయంగా ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం శ్రీహరి మాట్లాడుతూ ప్రజలకు సరుకు రవాణా, కొరియర్ రవాణా కోసం ఆర్టీసీ అతి తక్కువ సమయంలోనే గమ్యస్థానాలకు చేరవేస్తుందన్నారు. పార్సిల్‌కు భద్రత కల్పించటంతో పాటు నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా బీమా సౌకర్యం ఉంటుందన్నారు. నగరంలో ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలో, మార్కెట్ పాయింట్, కొత్తపేట మెడికల్ కాంప్లెక్స్, బ్రహ్మానందరెడ్డి స్టేడియం ఎదుట, జిల్లాలోని ముఖ్యపట్టణాల్లో కార్గో పార్సిల్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం వాణిశ్రీ, డిపో మేనేజర్‌లు కేఎం రెడ్డి, శివరామ్, ఏటీఎం వీవీ సుబ్బారావు, కమర్షియల్ ఏటీఎం మధు, షెడ్యూల్ సీఐ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ చేస్తే.. ఇంటికే డ్రైవర్



నెల్లూరు (వెంకటేశ్వరపురం) : కారు ఉండి.. డ్రైవర్ లేక ఇబ్బంది పడుతున్న వారికి ఫోన్ చేసిన వెంటనే డ్రైవర్‌ను పంపే సర్వీసును 'సుబ్రీజ్ డ్రైవర్స్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ గుంటూరు నగరంలో ప్రవేశపెడుతోంది. ఈ విధానంలో గంటల చొప్పున డ్రైవర్‌కు కిరాయి చెల్లించవచ్చు. గంటకైతే రూ. 99, పగటి పూట 10 గంటలకు రూ.799గా రోజుకు రూ.999గా వసూలు చేస్తామని, తమ వద్ద అన్ని విధాలా అర్హతలున్న డ్రైవర్లే ఉంటారని తెలిపారు. అలాగే కారుకు అవసరమైన ఫోమ్ వాష్, క్లీనింగ్, ఇంటీ రియల్ క్లీనింగ్‌లకు వాహనదారుని ఇంటి వద్దకే వెళ్లి సర్వీసు చేస్తారు. అలాగే 'సుబ్రీజ్' యాప్ ద్వారా వాహన యజమాని తమకు దగ్గరలో ఉన్న డ్రైవర్‌ను ఎంచుకోవచ్చునని, జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా వాహన యజమాని సురక్షితంగా ప్రయాణం చేయవచ్చునని తెలిపారు. 24 గంటల్లో తమ సర్వీసులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి


బ్రాయిలర్ బర్డ్	91.00,99.00,110.00
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్‌లెస్	186.00

బ్రాయిలర్ ధరలు

వెన్‌కాబ్

రైతు ధర	84.00
రిటైల్ లైవ్	99.00
విత్‌స్కిన్	139.00
స్కిన్‌లెస్	163.00

జిల్లాలో నేటి వాతావరణం



గుంటూరు: జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు ఈ విధంగా ఉండవచ్చు. గుంటూరులో పగలు అత్యధికంగా 31 డిగ్రీల సెల్సియస్, రాత్రి అత్యల్పంగా 26 డిగ్రీల సెల్సియస్. జిల్లాలో కొన్ని ముఖ్య ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు. జంగమహేశ్వరపురం 29-25, తెనాలి 31-26, మాచర్ల 29-24, బాపట్ల 31-26, నరసరావుపేట 30-25 డిగ్రీల సెల్సియస్ ఉండవచ్చు.

ఆర్టీసీ సమాచారం

గుంటూరు : స్థానిక ఎన్‌టీఆర్ బస్టాండ్ నుంచి సోమవారం రాత్రి బయలుదేరు దూరప్రాంత సర్వీసుల సీట్ల ఖాళీల వివరాలను ఆర్‌ఎం జ్ఞానంగారి శ్రీహరి తెలిపారు. రిజర్వేషన్ కోసం సెల్ నం: 9959061597కు సంప్రదించాలని కోరారు. రాత్రి 11.00 - గుంటూరు - కేపీహెచ్‌బీ -గరుడ (ఏసీ)-23, రాత్రి 10.50- గుంటూరు- కేపీహెచ్‌బీ- అమరావతి (ఏసీ)- 21, రాత్రి 10.15- గుంటూరు- కేపీహెచ్‌బీ -ఇంద్ర (ఏసీ)-13, రాత్రి 9.45- గుంటూరు- కేపీహెచ్‌బీ- ఇంద్ర(ఏసీ)-0, రాత్రి 8.30-గుంటూరు- చెన్నై- సూపర్ లగ్జరీ- 0 అని ఆర్‌ఎం తెలిపారు.

సాగర్‌లో 500.10 అడుగుల నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటిమట్టం ఆదివారం నాటికి 500.10 అడుగులు ఉంది. ఇది 115.46 టీఎంసీలకు సమానం. ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 675 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 749 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 749 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం నీటిమట్టం 783.30 అడుగులు ఉంది. ఇది 21.64 టీఎంసీలకు సమానం.

సత్రశాల టెయిల్ పాండ్ సమాచారం

రెంటచింతల: సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో 4.76 టీఎంసీల నీరు నిల్వ వున్నట్లు ప్రాజెక్టు ఎస్‌ఈ శేషారెడ్డి తెలిపారు. దిగువకు నీటి విడుదలను నిలిపివేశామన్నారు.

పులిచింతలలో 4.85 టీఎంసీల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 4.85 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ జీవీవీ ప్రసాద్ తెలిపారు. ఎగువ నుంచి 3,362 క్యూసెక్కుల నీరు పులిచింతల ప్రాజెక్టుకు చేరుతోంది. పులిచింతలవద్ద స్లూయిజ్‌లను మూసివేసి దిగువకృష్ణకు నీటిని నిలిపివేశామన్నారు.

పశ్చిమ డెల్టాకు 3,506 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల: కృష్ణాపశ్చిమ డెల్టాకు 3506 క్యూసెక్కుల నీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.2 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి హైలెవెల్ చానల్‌కు 180 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 490, పశ్చిమకాల్వకు 165, నిజాంపట్నంకాల్వకు 318, రేపల్లెకాల్వకు 579, కొమ్మమూరు కాల్వకు 1310 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

రాయపూడి మార్కెట్‌లో నిమ్మ ధరలు

తుళ్ళూరు: రాయపూడి నిమ్మకాయల మార్కెట్‌లో ఆదివారం జరిగిన లావాదేవీలు ఈ విధంగా ఉన్నాయి. పచ్చికాయ లావు రకం టిక్కీ రూ. 1400 నుంచి రూ.1600 . పండుకాయ, సన్న రకం రూ.1000 నుంచి రూ. 1200 ధరలు పలికాయి.

పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలి

● జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం డిమాండ్



ఆంధ్రజ్యోతి, గుంటూరు: పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని, 30 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం శ్రీనివాస భవనంలో జిల్లా అధ్యక్షుడు ఎస్. కొండయ్య అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగులకు పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకువస్తామని సంఘ నాయకులు వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి మల్లేశ్వరరావు, ట్రెజరర్ ఆర్. కోటేశ్వరరావు, తెనాలి, మంగళగిరి, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, నరసరావుపేట, వినుకొండ తాలుకా సంఘం సభ్యులు హాజరయ్యారు.

నిర్మాణాల్లో.. నిర్లక్ష్యం

● నత్తనడకన చెక్‌డ్యామ్‌ల పనులు ● నిధులు ఉన్నా నిర్మించలేని దుస్థితి ● 283కిగాను ఇప్పటికి పూర్తయినవి 61 ● వాగుల్లోని నీటిని ఒడిసి పట్టడంలో విఫలం



వర్షాలకు పొంగుతున్న ఓగేరు వాగు

నరసరావుపేట: పల్లెలను సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం చెక్ డ్యామ్‌లను నిర్మించాలని నిర్ణయించింది. నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాంతంలో మూడేళ్ళుగా సాగు నీటి సంక్షోభం నెలకుంది. దీంతో చెక్ డ్యామ్‌లను నిర్మిస్తే మెట్ట పంటల సాగుకు నీటిని వినియోగించుకునే అవకాశం ఉందని ప్రభుత్వం భావించింది. జిల్లాలోని వివిధ వాగులపై నీరు, చెట్టు పథకంలో భాగంగా 283 చెక్‌డ్యామ్‌లు నిర్మించాల్సి ఉంది. ఇందుకు సంబంధించి రూ.29 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఏప్రిల్‌లో చెక్ డ్యామ్‌ల నిర్మాణ పనులను ప్రారంభించారు. 90 రోజుల్లో అంటే జూన్ నెలాఖరు కల్లా 283 చెక్ డ్యామ్‌ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. గడువు పూర్తయి రెండు నెలలు కావస్తున్నా కేవలం 61 చెక్ డ్యామ్‌ల నిర్మాణం మాత్రమే పూర్తి చేశారు. మరో 71 చెక్ డ్యామ్‌ల పనులను ప్రారంభించారు. 151 చెక్ డ్యామ్‌ల నిర్మాణం నేటికి ప్రారంభం కాలేదు. ఈ పనులు చేపట్టడంలో అడుగడుగునా అలసత్వం కనిపిస్తున్నది.

వెనుక బడిన ప్రాంతాలలోని చెక్ డ్యామ్‌ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిపాదించింది. సాగు నీటి వనరులు తక్కువగా వున్న ప్రాంతాలను గుర్తించింది. సాగర్ కుడి కాలువకు నీటి సరఫరా జరగని పక్షంలో ఈ ఆయకట్టు ప్రాంతంలో ఉన్న వాగులపై చెక్ డ్యామ్‌లు నిర్మిస్తే బెట్ట పరిస్థితుల్లో పంటలకు నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుందని ప్రభుత్వం నిర్ణయించింది. కొన్ని మండలాల్లో నేటి వరకు ఒక్క చెక్ డ్యామ్ నిర్మాణం కూడా పూర్తి కాలేదు. జిల్లాలో అత్యధికంగా బొల్లాపల్లి మండలంలో 65 చెక్ డ్యామ్‌లు మంజూరు చేశారు. వీటిలో ఇప్పటికీ నాలుగు చెక్ డ్యామ్‌ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ మండలంలోని అయ్యన్నపాలెం ప్రాంతంలో గుండాలమడుగు వాగుపై 27 చెక్ డ్యామ్‌లు మంజూరయ్యాయి. వీటిలో ఏడు పనులు మాత్రమే ప్రారంభమయ్యాయి. రేమిడిచర్ల ప్రాంతంలో రేలగడ్డ వాగుపై చెక్ డ్యామ్‌ల నిర్మాణం పూర్తికి నోచుకోలేదు. దుర్గి మండలం ముటుకూరు గ్రామ ప్రాంతంలో మంజూరైన ఏడు చెక్ డ్యామ్‌ల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన మారింది. కారంపూడి మండలం పేటసన్నిగండ్ల ప్రాంతంలో బోడమ్మ వాగుపై ఎనిమిది చెక్ డ్యామ్‌లు నిర్మించాలి. కారంపూడి వద్ద ఎర్రవాగు, చిలకలూరిపేట మండలం పోతవరం వద్ద నక్కల వాగు, కోసూరు మండలం అనంతారం వద్ద పెద్ద వాగు, నకరికల్లు మండలం చేజర్ల వద్ద గుండ్ల వాగులపై చెక్ డ్యామ్‌ల నిర్మాణం పూర్తవ్వలేదు. అచ్చంపేట మండలంలోని వాగులపై 14 చెక్ డ్యామ్‌లు మంజూరు కాగా ఇప్పటి వరకు రెండు మాత్రమే పూర్తయ్యాయి. చిలకలూరిపేట మండలంలో ఏడు చెక్ డ్యామ్‌లకు గాను రెండు, దాచేపల్లి మండలంలో 20కి 15, గురజాల మండలంలో 11కి ఎనిమిది, కోసూరు మండలంలో 12కు రెండు, మాచవరం మండలంలో 13కు మూడు, నరసరావుపేట మండలంలో 8కి నాలుగు, నూజెండ్ల మండలంలో 24కి పదమూడు, రొంపిచర్ల మండలంలో 17 చెక్ డ్యామ్‌లకు గాను ఏడు చెక్ డ్యామ్‌ల నిర్మాణం పూర్తయ్యాయి. దుర్గి మండలానికి 31 చెక్ డ్యామ్‌లు మంజూరు కాగా ఒక్కటి కూడా నిర్మాణానికి నోచుకోలేదు. యడ్లపాడు మండలంలో మూడు, కారంపూడి మండలంలో 12, నకరికల్లు మండలంలో 16 చెక్ డ్యామ్‌లు నిర్మించాల్సి వుండగా ఒక్కటి కూడా పూర్తి కాలేదు. వీటి నిర్మాణం ఎప్పటికీ పూర్తి చేస్తారో కూడా సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో అధికారులు కొట్టుమిట్టాడుతున్నారు.

వృథాగా పోతున్న వర్షపు నీరు

నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలో సాగు నీరు మూడేళ్ళుగా సరఫరా కాని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆయకట్టులోని లక్షలాది ఎకరాలలో వర్షాల పైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది సాగర్ కుడి కాలువకు నీరు విడుదలయ్యే పరిస్థితులు కన్పించటం లేదు. నీరు, చెట్టు పథకం కింద చెక్ డ్యామ్‌ల నిర్మాణం సమర్థవంతంగా పూర్తి చేసి వుంటే వర్షపు నీటిని వాగుల్లో ఒడిసి పట్టి పంటలకు వర్షాభావ పరిస్థితుల్లో వినియోగించుకునే అవకాశాలు ఉండేవి. వాగుల్లో నీరు వృథాగా ప్రవహిస్తున్నది. వాగుల్లో ప్రవహిస్తున్న నీటిని పంటలకు వినియోగించు కోవటంతో పాటు చెరువులను నింపేందుకు కూడా చెక్ డ్యామ్‌లు ఉపయోగ పడేవి. అధికారుల నిర్లక్ష్యం వల్ల చెక్ డ్యామ్‌లు పూర్తి కాక పోవటంతో వాగుల నీరు నిరుపయోగమవుతున్నది.

రెండేళ్లలో 90 వేల గృహ నిర్మాణాలు లక్ష్యం

● గృహ నిర్మాణ సంస్థ పీడీ నాగశివరావు



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ నాగశివరావు, ఈఈ బసవయ్య

తెనాలి రూరల్ : 2019 నాటికి జిల్లాలో 90వేల గృహాలు నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు గృహ నిర్మాణసంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.నాగశివరావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని గృహనిర్మాణసంస్థ కార్యాలయంలో ఈఈ బసవయ్య, సిబ్బందితో సమీక్షించారు. డివిజన్ స్థాయిలో జరుగుతున్న గృహ నిర్మాణాలు, బిల్లుల చెల్లింపులు, గృహాల మంజూరు, లబ్ధిదారుల సమస్యలపై చర్చించారు. అనంతరం నాగశివరావు విలేకరులతో మాట్లాడుతూ, జిల్లాలో 2014-15 లో రెండు వేల గృహాలు, 2015-16లో 5600 ఇళ్ల నిర్మాణం పూర్తిచేసినట్లు తెలిపారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 18,400 ఇళ్లు మంజూరు కాగా 6700 పూర్తయ్యాయని, ఆయా ఇళ్లకు సంబంధించి జియో ట్యాగింగ్ పూర్తి చేసి రూ.64 కోట్ల బిల్లులు కూడా చెల్లించినట్లు చెప్పారు. ఎన్టీఆర్ గ్రామీణ్ పథకంలో భాగంగా 2016-17 సంవత్సరంలో 14,578 ఇళ్లు మంజూరు కాగా 926 పూర్తయ్యాయని, 2017-18కిగాను 15,850 ఇళ్లు మంజూరుకాగా లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి మరో 15,850 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటికే 6100 మంది లబ్ధిదారులను ఎంపికచేసినట్లు, మిగిలినవి త్వరలో పూర్తిచేయనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై వివిధ దశల్లో ఆగిపోయిన ఇళ్లకు కూడా అదనంగా మరో రూ. 25 వేలు కేటాయించి పూర్తి చేయిస్తున్నట్లు తెలిపారు.

బీఎల్‌సీ పథకం ద్వారా మున్సిపల్ పరిధిలో సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకునేందుకు కూడా 2016-17 సంవత్సరానికి తెనాలిలో 719 ఇళ్లు మంజూరుచేసినట్లు తెలిపారు. వీటితోపాటు అర్బన్ డెవలప్‌మెంట్ పథకం కింద గుంటూరు నగరంలో 3015 ఇళ్లు మంజూరుచేయగా 722 పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నట్లు చెప్పారు. స్లమ్ డెవలప్‌మెంట్‌లో భాగంగా పురపాలక సంఘం ఏపీ టెట్‌కో ద్వారా కూడా ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

లబ్ధిదారులు ఇళ్ల మంజూరుకాగానే తమ బ్యాంకు ఖాతా, ఆధార్ నెంబర్‌ను ఎన్‌పిసిఐ మ్యాపింగ్ చేయించుకోవాలని కోరారు. బ్యాంకు ఖాతాలో లావాదేవీలు జరుపుతూ ఉండాలని, ఆధార్ అనుసంధానం అయినది లేనిదో చూసుకోవాలన్నారు. జీరో అకౌంట్‌లను సాధారణ అకౌంట్లుగా మార్చుకోవాలని సూచించారు. బ్యాంకు ఖాతాలు సరిగాలేని పక్షంలో బిల్లులు వెనక్కి వెళ్లే అవకాశం ఉందన్నారు. గృహ నిర్మాణ మంజూరు విషయంలో, చెల్లింపుల విషయంలో ఎవరైనా అవినీతికి పాల్పడితే సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయండి

● పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు



గుంటూరు(విద్య): కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ 1న విజయవాడలతో తలపెట్టిన మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరాజు విజ్ఞప్తిచేశారు. ఆదివారం ఏఎల్ బీఎడ్ కళాశాలలో పీఆర్‌టీయూ జిల్లా మహాసభ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే మిలియన్ మార్చ్‌లో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. బదిలీల కౌన్సెలింగ్‌లో అన్యాయం జరిగిన ఉపాధ్యాయులకు పోస్టులు కేటాయించాలని కోరారు. నగదు రహిత వైద్య విధానం అందనందున మెడికల్ రీయింబర్స్ విధానాన్ని డిసెంబరు 31వరకు కొనసాగించాలని కోరారు.

పీఆర్‌టీయూ నూతన కార్యదర్శిగా జీవీఎస్ రామకృష్ణ

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శిని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా తెనాలికి చెందిన జీవీఎస్ రామకృష్ణ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ఎన్‌ఏపీసీ విద్యాసాగర్ ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు జి.సుబ్బారావు, జె.జ్ఞానేశ్వరరావు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు డి. శ్రీను, జిల్లా అధ్యక్షుడు సీవీఎస్ మణి, ఏవీ నారాయణ, చంద్రశేఖరెడ్డి, రాజాచౌదరి, ఆనందరావు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



అండర్ -19 బాలికల విభాగంలో తలపడుతున్న శ్రీకాకుళం, బీజాపూర్ జట్లు



పోటీలను తిలకిస్తున్న క్రీడాకారులు

చిలకలూరిపేట టౌన్ : చిలకలూరిపేట మండలంలోని మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయలో హైదరాబాద్ ప్రాంతీయస్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. దక్షిణాది రాష్ట్రాల్లోని నవోదయ విద్యాలయాల క్లస్టర్‌ల పరిధిలోని జట్లకు రెండు రోజులపాటు జరిగిన ఈ పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాలుర విభాగంలో అండర్- 19లో శ్రీకాకుళం క్లస్టర్ ప్రథమస్థానం, మాండ్య క్లస్టర్ జట్టు ద్వితీయస్థానం సాధించాయి. అండర్- 17లో కరీంనగర్ క్లస్టర్ ప్రథమస్థానం, మాండ్య క్లస్టర్ ద్వితీయస్థానంలో నిలిచాయి. అండర్ -14లో మాండ్య క్లస్టర్ ప్రథమస్థానం, కరీంనగర్ క్లస్టర్ ద్వితీయస్థానం సాధించాయి. అండర్- 19 బాలికల విభాగంలో శ్రీకాకుళం ప్రథమ స్థానం, బీజాపూర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. అండర్-17లో షిమోగా క్లస్టర్ ప్రథమ, కర్నూలు క్లస్టర్ ద్వితీయ, అండర్ -14లో మాండ్య క్లస్టర్ ప్రథమ, కరీంనగర్ క్లస్టర్ ద్వితీయస్థానంలో నిలిచాయి. పీడీలు వైవీ చిరంజీవి, టి.కృష్ణమూర్తి, వైఎస్ఆర్‌కె ప్రసాద్, ఎన్.సురేష్, మూర్తిరాజు, కపిల్, శేఖర్, కుటుంబరావు, మనోహర్, కేవీ సుబ్బారావు, చిన్నరామయ్య, ఎంవీ సుబ్బారావు మ్యాచ్‌లకు రిఫరీలుగా వ్యవహరించారు.

కనపడవా ఇసుక డంప్‌లు?

- అమరావతి రోడ్డులో రెండుచోట్ల నిల్వలు
- కలెక్టర్ ఆదేశించినా సీజ్‌చేయని అధికారులు
- లారీల్లో తెచ్చి ఇక్కడ కుప్పపోసి ట్రాక్టర్ల ద్వారా విక్రయం

ఆంధ్రజ్యోతి, గుంటూరు: ఎక్కడా ఇసుక నిల్వలు ఉండటానికి వీల్లేదు. ఎవరైనా అక్రమంగా ఇసుక డంపింగ్ చేసుకొని ఉంటే వాటిని సీజ్‌చేసి ప్రభుత్వ శాఖల అవసరాలకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ కోన శశిధర్ ఆదేశాలు జారీచేశారు. అయితే ఈ ఆదేశాలను కిందిస్థాయిలో అధికారులు అమలు చేయడం లేదు. ఎప్పటిలానే అమరావతి రోడ్డులో రెండు చోట్ల లారీ యజమానులు ఇసుకను భారీగా డంప్‌చేశారు. అక్కడి నుంచి ట్రాక్టర్లు ద్వారా నగరంలో ఇసుక అవసరమైనవారికి సరఫరా చేస్తూ జేబులు నింపుకొంటున్నారు. కొండంత ఎత్తులో ఈ రెండు ఇసుక నిల్వలు కనిపిస్తున్నా అధికారులు వాటిని సీజ్ చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అమరావతి, తుళ్లూరు మండలాల్లోని రేవులనుంచి ఇసుక తీసుకొస్తున్న లారీ, ట్రాక్టర్ డ్రైవర్లు నేరుగా భవన నిర్మాణదారుల వద్దకు వెళ్లి దానిని డంప్‌చేయడం లేదు. మార్గమధ్యంలో లాం, గోరంట్ల శివారులో డంపింగ్ చేస్తున్నారు. ట్రక్ మట్టం వరకు ఇసుకను కింద పోసి మిగతాది విక్రయిస్తున్నారు. దీనివల్ల ట్రాక్టర్ ద్వారా రెండు క్యూబిక్ మీటర్ల ఇసుకకు రూ. 2,500 చెల్లించాల్సి వస్తోంది. రూ. 1,400కు కూడా ఇసుకను ట్రాక్టర్ డ్రైవర్లు తీసుకొచ్చి పోస్తున్నారు. అయితే అది ఒక క్యూబిక్ మీటర్‌కు కొంచెం అటు, ఇటుగానే ఉంటోంది. దీంతో ఇసుకకు రెట్టింపు ధరని ప్రజలు చెల్లించాల్సి వస్తోంది.

నిబంధనల ప్రకారం రేవులో నుంచి తీసుకొచ్చిన ఇసుకను అక్కడికి సమీపంలోనే డంప్ చేయాలి. ఆ డంప్ నుంచి లారీలు, ట్రాక్టర్లకు లోడింగ్ చేయాలి. అనుమతి లేకుండా మరెక్కడా ఇసుక నిల్వచేయరాదు. అపార్టుమెంట్‌లు, వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నవారు కూడా ఇసుకను పని ప్రదేశంలో నిల్వచేసేందుకు అనుమతి తీసుకోవాలి. అయితే, ఎలాంటి అనుమతి లేకుండానే అమరావతి రోడ్డులో రెండుచోట్ల ఖాళీ ప్రదేశాల్లో భారీగా ఇసుక డంపింగ్ చేశారు. తాడికొండ, తుళ్లూరు, అమరావతి మండలాల్లోని వివిధ గ్రామాల్లోనూ ఇసుక నిల్వలు పెడుతున్నారు. ఇలా నిల్వ చేసిన ఇసుకను భవిష్యత్తులో వరద వచ్చినప్పుడు, అధికారుల రైడింగ్‌లు జరిగినప్పుడు బయటకుతీసి అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటారు. ఈ నేపథ్యంలో అధికారులు ఇసుక రేవులతోపాటు ఇలా అక్రమంగా డంపింగ్ చేసిన ప్రదేశాలను గుర్తించి దాడులు నిర్వహిస్తేనే ఇసుక ధర పెరగకుండా నియంత్రణలో ఉంటుంది.



అమరావతి రోడ్డులో ఇసుక డంప్



విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న బాలకృష్ణ

నేతన్నలకు ముద్ర రుణాలివ్వాలి

- ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్

మంగళగిరి: చేనేత కార్మికులందరికీ ముద్ర రుణాలు ఇవ్వాలని ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సహకార సంఘంలోని సభ్యులకు మాత్రమే ఇస్తున్నారని, ప్రైవేటు సెక్టారులోని మాస్టర్ వీవర్స్ వద్ద నేత నేస్తున్న వారికి ఇవ్వడంలేదన్నారు. సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం పోలా రామాంజనేయులు అధ్యక్షతన మంగళగిరి సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగింది. అనంతరం సమావేశ వివరాలను చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ విలేకర్లకు వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి చేనేతపై ఎటువంటి పన్ను లేదని, గతంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు చిలపల నూలుపై 9.2 శాతం ఎక్సైజ్ సుంకం విధించి చేనేతను దెబ్బతీశారన్నారు. చేనేతపై జీఎస్టీని తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల్లో సిల్క్ సబ్సిడీ కార్డులు సర్వే పేరుతో రద్దు చేయడం మానుకోవాలన్నారు. సిల్క్ సబ్సిడీని వెంటనే విడుదల చేయాలని సమావేశం డిమాండ్ చేసినట్టు చెప్పారు. సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో జరిగే అన్ని రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశం సందర్భంగా ఏపీ, తెలంగాణ చేనేత రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరపాలని నిర్ణయించడం జరిగిందన్నారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్టా శివదుర్గారావు, సభ్యులు కారుర్తి ఆంజనేయులు, కౌతరపు వెంకటేశ్వరరావు, గోరు రాజు, పిచ్చుక ఆదిశేషు, దీపాల సత్యనారాయణ, చేనేత వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనరు ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

మూడు రాష్ట్రాల ఆటల

పోటీలు ప్రారంభం

నరసరావుపేట రూరల్ : సరస్వతి శిశుమందిర్ విద్యా భారతి ఆధ్వర్యంలో స్థానిక సాయితిరుమల ఎన్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రాష్ట్రాల దక్షిణ మధ్య క్షేత్ర ఖేల్ కూద్ ఆటల పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య జరిగే ఈ పోటీలను ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ నలబోతు వెంకటరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, నిబద్ధతతో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి విజేతలుగా నిలవాలన్నారు. ఓడినవారు గెలిచినవారి నుంచి స్ఫూర్తి పొందాలన్నారు. పోటీలకు హాజరైన విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. జట్టు కెప్టెన్లు.. క్రీడాకారులను ముఖ్య అతిథిలకు పరిచయం చేశారు. మూడు రాష్ట్రాల నుంచి ఐదు వందల మంది విద్యార్థులు హాజరయ్యారు. కబడ్డీ, ఖోఖో, యోగా, చదరంగం, క్యారమ్స్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీలు ఆసక్తికరంగా జరుగుతున్నాయి.

ప్రారంభ కార్యక్రమంలో దక్షిణ క్షేత్ర సంఘటన మంత్రి లింగం సుధాకరరెడ్డి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పూరా భాస్కరరావు, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొల్లి బ్రహ్మయ్య, మద్ది రామబ్రహ్మానందరావు, కాకుమాను వెంకట కోటేశ్వరరావు, మిరియాల నాగప్రసాదు, బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ చెరుకూరి ప్రసాదు, సరస్వతి శిశు మందిర కమిటీ అధ్యక్షుడు ఏల్చూరి లక్ష్మీకాంతరావు, కళాశాల సెక్రటరీ బి.శౌరిరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




అండర్- 14 ఖోఖో పోటీల్లో తలపడుతున్న బాలికలు



కబడ్డీలో తలపడుతున్న విశాఖపట్నం, కర్నాటక జట్లు

జై జై గణేశా..


అచ్చంపేటలో ఏర్పాటుచేసిన వినాయకుడు



పెనుమూడి కృష్ణానదిలో వినాయక నిమజ్జనం చేస్తున్న భక్తులు


నరసరావుపేట శ్రీరాంపురంలోని మెడికల్ అసోసియేషన్ మండపంలో గొడుగులతో గణపతికి ప్రత్యేక అలంకరణ


రొంపిచర్ల దాసుల బజారు వద్ద పూజలందుకుంటున్న గణనాథుడు

గణపతి ఉత్సవాలు మూడో రోజు ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయా పందిళ్లలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గణేష్ మహరాజ్‌కూ జై అంటూ చిన్నా పెద్దా నినదించారు. పలు పందిళ్లలో అన్నప్రసాద వితరణ జరిగింది. అనంతరం పలు మండపాల్లోని గణనాథులను ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు.

గుంటూరులోని రామన్నపేట 1/2 రామన్నపేట యూత్ ఆధ్వర్యంలో...



గుంటూరులోని శ్రీనగర్ శ్రీ గణేష్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో...


పొన్నూరు మండలం చింతలపూడిలో భక్తులను ఆకర్షిస్తున్న గణనాథుడు


గుంటూరు శ్రీనగర్ 6వ లైనులో శ్రీనగర్ యూత్ ఆధ్వర్యంలో..


ప్రత్తిపాడులో విగ్రహం ముందు చిందులు వేస్తూ సైకిల్‌పై వినాయకుడిని తీసుకెళుతున్న చిన్నారులు




గుంటూరులోని చాకలి గుంట గణేష్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో...


తాడేపల్లిలో కృష్ణానది వద్ద వినాయక నిమజ్జనం చేస్తున్న భక్తులు


గుంటూరులోని అరండల్‌పేట 7/5లో చాణిక్య ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో..

ఇదేంది.. అన్న

దుడ్డు బియ్యంతో భోజనం
ఆసక్తి చూపని గర్భిణులు, బాలింతలు
అన్న అమృతహస్తంలో తగ్గుతున్న నాణ్యత
అరకొర సౌకర్యాలతో అంగన్‌వాడీ కేంద్రాల్లో అవస్థలు

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు అమృత హస్తం పథకం కింద పౌష్టికాహారం అందిస్తున్నారు. ఈ పథకం ద్వారా భోజనంతో పాటు పాలు, గుడ్లు, బియ్యం, కందిపప్పు, పామాయిల్ అందిస్తున్నారు. అయితే దుడ్డు బియ్యం అందిస్తున్నారని, వీటితో తయారయ్యే భోజనంలో నాణ్యత అంతగా ఉండటంలేదని, దీనిని తిని కడుపు నొప్పితో అల్లాడుతున్నామని బాలింతలు, గర్భిణీలు ఆరోపిస్తున్నారు. ఈ పథకంలో ఇచ్చే కొన్ని సరుకుల్లో నాణ్యత అంతగా లేదంటున్నారు. వారానికి ఒకసారి అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని ఇంటికి తీసుకెళ్లేవారు. ప్రస్తుతం రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తేనే ఇస్తాంటున్నారు. వీటిని తీసుకునేందుకు రోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాల్సి రావడం కారణంగా బాలింతలు, గర్భిణీలు ఎన్నో వ్యయప్రాసలకు గురవుతున్నారు. ఇంటి వద్దే అందించేలా చూడాలని వారు కోరుతున్నారు. లేదా వారానికి ఒకసారి కేంద్రాలకు వెళ్లి తీసుకోవడానికి అభ్యంతరం లేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అన్న అమృత హస్తం కింద ఇచ్చే సరుకులు స్వీకరించే వారు కేంద్రాలకు అంతగా రావడంలేదు. అయినా రికార్డుల్లో మాత్రం పెద్దసంఖ్యలో ఆయా సరుకులు తీసుకునేవారు ఉంటున్నారు. కాని వాస్తవంగా ఆ సంఖ్య క్షేత్రస్థాయిలో కనిపించడంలేదు.

అమలైతే.. అమృతమే

మాతా శిశు మరణాలు నివారించేందుకు బాలింతలు, గర్భిణీల కోసం అన్న అమృతహస్తం పథకాన్ని జూలై 1 తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుంది. ఈ పథకంలో భాగంగా పౌష్టికాహారం అందించాలి. అంతేగాకుండా రక్తహీనత నివారించడం, సుఖప్రసవం అయ్యేవిధంగా వైద్యుల ద్వారా తగిన సూచనలు అందించాలి. అన్నం, పప్పు లేదా సాంబారు, రెండు రోజులు ఎగ్ కర్రీ, మిగతా నాలుగు రోజులు ఉడికించిన గుడ్డు, 200 మి.లీ.ల పాలు వంతున అందించాలి. అయితే వీటి కోసం నిత్యం బాలింతలు, గర్భిణీలు ఆయా అంగన్‌వాడీ కేంద్రాలకు రావడం ఓ పరీక్షగా మారింది. ఇక్కడ అందించే భోజనంలో నాణ్యత లేక పోవడం.. దడ్డు బియ్యం కారణంగా అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వారు వాపోతున్నారు. అంతేగాకుండా కనీస సౌకర్యాలు లేని కేంద్రాల్లో కింద కూర్చొని తినలేక అనేక మంది ఈ పథకంపై విముఖత చూపుతున్నారు.

నేలపై కూర్చొని తినలేక అవస్థలు

అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రతిరోజూ మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట మధ్య ఆహారాన్ని అందిస్తున్నారు. గర్భిణీలకు కూర్చోని భోజనం చేయటానికి బెంచీలు లేవు. దీంతో పలు కేంద్రాల్లో నేలపైనే కూర్చొని భోజనం తినాల్సి వస్తుంది. దీంతో వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. బాలింతలు, గర్భిణీలు నేలపైన కూర్చోలేరు.. వైద్య పరంగా కింద కూర్చోకూడదు.. అయినా దీని గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు సమీపంలోని ఇళ్ల నుంచి కుర్చీలు తీసుకువచ్చి సరిపెడుతున్నారు. ఈ పథకం కింద గర్భిణీలకు పౌష్టికాహారం అందించేందుకు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం పంచాయతీలను ఆదేశించింది. పట్టణాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మున్సిపల్ కమిషనర్ ద్వారా బెంచీలు సరఫరా చేయాల్సి ఉంది. అయితే ప్రభుత్వ ఉత్తర్వులను ఆయా పంచాయతీలుకాని, మున్సిపల్ అధికారులు కాని ఎక్కడా అమలు చేయలేదు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు దూరంగా ఉంటున్నాయి. దీంతో గర్భిణీలు, బాలింతలు ఎక్కువమంది కేంద్రాలకు రాలేకపోతున్నారు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. అనేకం మండలపరిషత్ పాఠశాలల ప్రాంగణం, కమ్యూనిటీ హాల్స్‌లో, ప్రైవేటు సంస్థలకు సంబంధించిన భవనాలలో నిర్వహిస్తున్నారు. ఆయా కేంద్రాల వద్ద భోజనం వండి పెట్టటం కార్యకర్తలకు ఇబ్బందిగా ఉంది. గర్భిణీ, బాలింతలు కూడా వచ్చే సమయానికి ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో ఉండటంతో వారు భోజనం చేసేందుకు అంతగా ఆసక్తి చూపటంలేదు. కొంత మంది బాక్స్‌లో భోజనం పెట్టించుకుని వెళుతున్నారు. మరికొందరు పాలు, గుడ్డుతో సరిపెట్టుకుంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన వంట సామాగ్రిని కొనుగోలు చేసి ఇవ్వాలంటూ ప్రభుత్వం సర్పంచ్‌ల ఖాతాలకు రూ.5 వేల చొప్పున నిధులను జమచేసింది. వీటితో వంటపాత్రలను, గ్లాసులు, ప్లేట్లను కొనుగోలుచేసి ఇవ్వాల్సి ఉంది. అయితే దీని గురించి ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు.

● మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో మొత్తం 237 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గర్భిణీ లు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం మంగళగిరి, తాడేపల్లి, పెదకాకాని ప్రాంతాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో 4,188 మంది మహిళలకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్నారు. మంగళగిరి ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంచాయతీరాజ్ శాఖ రూ.5వేలతో వంట పాత్రలను కొనుగోలు చేసి ఇచ్చింది. కొన్ని సెంటర్లకు స్థానికంగా ఉండే దాతలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

● బాపట్ల పరిధిలో అన్న అమృతహస్తం పథకంలో నానాటికి ఆహారంలో నాణ్యత తగ్గుతున్నది. దీంతో అనేకమంది భోజనం చేసేందుకు సుముఖత వ్యక్తం చేయటంలేదు. నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలో మొత్తం 249 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. పట్టణంలో 51, మండలంలో 82, కర్లపాలెంమండలంలో 63, పిట్టలవానిపాలెం మండలంలో 53 కేంద్రాలు చొప్పున ఉన్నాయి. వీటిల్లో సొంతభవనాలు ఉన్నకేంద్రాలు 53 ఉన్నాయి. 196 కేంద్రాలు మండలపరిషత్ పాఠశాలల ప్రాంగణంలో, కమ్యూనిటి హాల్స్‌లో, ప్రైవేటు సంస్థలకు సంబంధించిన భవనాలలో, అద్దెభవనాలలో నిర్వహిస్తున్నారు. ఆయా కేంద్రాల వద్ద భోజనం వండిపెట్టటం కార్యకర్తలకు ఇబ్బందిగా ఉంది.

● నరసరావుపేట నియోజకవర్గంలోని అంగన్ వాడీ కేంద్రాలలో అమృత హస్తం పథకం పూర్తి స్థాయిలో అమలు కావటం లేదు.

● పొన్నూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్‌లో 171 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో 635 మంది బాలింతలు, 791 మంది గర్భిణీలు ఉన్నారు. బెంచీలు లేకపోవటంతో గర్భిణీలు బాలింతలు నేల మీద కూర్చుని భోజనం చేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న దుడ్డు బియ్యంతో పలువురు గర్భిణీలు భోజనం చేయటం లేదు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వంట చేయకుండా బియ్యం, నూనె, సరుకులు, గుడ్లు బాలింతలు, అంగన్‌వాడీలకు ఇచ్చి పంపిస్తున్నారు. దీంతో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు మొక్కుబడిగా పనిచేస్తున్నాయి. దీంతో ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరటం లేదు.

● అన్న అమృతహస్తం పథకం సత్తెనపల్లి, ముప్పాళ్ళ, క్రోసూరు, అచ్చంపేట, పెదకూరపాడు మండలాల్లో సక్రమంగా అమలుకావటంలేదు. సంబంధిత ఐసీడీఎస్ అధికారుల, సూపర్‌వైజర్ల పర్యవేక్షణ కూడా కొరవడింది. ఆయా కేంద్రాల్లో కూర్చుని తినటానికి అవసరమైన ఏర్పాట్లు కూడా లేకపోవటం సమస్యగా మారింది. కొంతమంది కేంద్రాలకు వచ్చి గుడ్లు మాత్రం తీసుకెళుతున్నారు. కేంద్రాలకు ఇచ్చే బియ్యం లావుగా ఉండటం, ఆ అన్నం తింటే కడుపునొప్పి వస్తుందని గర్భిణీలు వాపోతున్నారు. పిల్లలతో పాటు కూర్చుని భోజనం చేయటం కూడా వారికి ఇబ్బందిగా ఉంది. కొన్ని పంచాయతీల్లో మాత్రమే వంటపాత్రలు కొనుగోలు చేస్తున్నారు.


● మాచర్ల నియోజకవర్గ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, బాలింతలు చిన్నారులతోపాటుగా నేలపైనే కూర్చొని భోజనం చేస్తున్నారు. ఎక్కడా మెనూ ప్రకారం భోజనాన్ని వడ్డించడం లేదు. పౌష్టికాహారం ఊసే లేదు. కేంద్రాల్లో దొడ్డు బియ్యంతో వండిపెట్టే భోజనాన్ని తినలేక చాలాచోట్ల గర్భిణీలు, బాలింతలు కేంద్రాలకు రావడమే మానేశారు. అన్నం, పప్పుచారుతో భోజనం వడ్డించి మమా అనిపిస్తున్నారు. కోడిగుడ్లు సక్రమంగా పంపిణీ చేయడం లేదు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సొంత గృహాల్లోనో, అద్దె భవనాల్లోనే కేంద్రాన్ని నడిపిస్తున్నారు. ఎక్కువగా ఇరుకైన గదుల్లోనే వంటా వార్పు, భోజనాలు తదితర పనులు పూర్తి చేస్తున్నారు. తక్కువ మంది గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు కేంద్రాలకు వస్తున్నా ఎక్కువగా వస్తున్నట్లు చూపుతున్నారు.

● చిలకలూరిపేట నియోజకవర్గంలో నాదెండ్ల ఐసీడీఎస్ పరిధిలో మొత్తం 267 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాల పరిధిలో సుమారు 3 వేల మంది గర్భిణీలు నమోదై ఉన్నారు. పంచాయతీల నుంచి ప్రతి కేంద్రానికి రూ.5వేల చొప్పున కేటాయించి వంట సామగ్రి పంపిణీ చేశారు. కేంద్రానికి నాణ్యమైన బియ్యం సరఫరా కాకపోవడంతో అన్నం ముద్దగా ఉంటుంది. గర్భి ణీలు భోజనం చేసేందుకు వీలుగా కుర్చీలు, బల్లలు ఒక్క కేంద్రంలో కూడా లేవు. దీనితో కిందనే కూర్చొని భోజనం చేస్తు న్నారు. ఎక్కువ శాతం మంది గర్భిణీలు కేంద్రానికి పాలు, గుడ్లు అందుకోవడానికే వస్తున్నారు తప్పితే భోజనం చేసేందుకు రావడంలేదు.


మంగళగిరి గండాలయపేట అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న గర్భిణులు, బాలింతలు


పథకం ప్రారంభం రోజు బాపట్లలోని చెంగల్రాయుడుతోట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వరండాలో అన్నఅమృతహస్తం భోజనం చేస్తున్న గర్భిణులు


పొన్నూరు గాజుల పాలెంలో తెరవని అంగన్‌వాడీ కేంద్రం


పొన్నూరులో బాలింతలకు సరఫరా చేసిన కొత్త దుడ్డు బియ్యం


పొన్నూరు 25 వార్డులో అంగన్‌వాడీ కేంద్రంలో నేల మీద కూర్చుని భోజనం చేస్తున్న బాలింతలు, గర్భిణులు


సత్తెనపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న గర్భిణులు

కార్పొరేషన్ హెల్ప్ లైన్			
అదనపు కమిషనర్(రెవెన్యూ, ఎడ్యుకేషన్)	9849908386	ఎంహెచ్‌వో -2(పశ్చిమ)	9177001865
డిప్యూటీ కమిషనర్(శానిటేషన్, ఉపాసెల్)	9849908364	బయాలజిస్ట్-	9849908366
సూపరింటెండెంట్ ఇంజనీర్	9849908400	మేనేజర్ -	9849908374
సిటీ ప్లానర్	9959666914	ఫిర్యాదుల విభాగం -	0863 -2345103
ఎంహెచ్‌వో-1(తూర్పు)	9849908398		

మాంసపు దుకాణాలపై దాడులు



మాంసపు దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు

- అనుమతి లేని వాటికి జరిమానా విధించిన అధికారులు

గుంటూరు (కార్పొరేషన్) : నగరంలో అనుమతి లేని మాంసపు దుకాణాలపైనా, చేపల విక్రయాలపైనా నగరపాలక సంస్థ ప్రజారోగ్య శాఖ అధికారులు ఆదివారం ముమ్మరంగా దాడులు చేపట్టారు. బృందాలుగా విడిపోయి నగరంలోని పాతగుంటూరు, సుద్దపల్లిడొంక, అలీ నగర్, పొన్నూరు రోడ్డు, కేవీపీ కాలనీ, నగరం, లాల్‌పురం రోడ్డు, స్తంభాలగరువు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా రోడ్డు పక్కన జంతువులను వధిస్తూ, చేపలు విక్రయిస్తున్న వాటిపైనా అపరాధ రుసుం విధిస్తున్నారు. రూ. 6,200లను వసూలు చేసినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంహెచ్‌వో డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ అనధికారికంగా మాంసం విక్రయాలు నిషేధం అన్నారు. నగరంలో మాంసం విక్రయదారులు నగరపాలక సంస్థ జంతు కబేళా నుంచి అధికార ముద్రతోనే మాంసం విక్రయించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాంబాబు, జాస్తి రామారావు, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలు శారీరక దృఢత్వానికి దోహదం



కర్రసాము పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీ చైర్ పర్సన్ జానీమూన్, అర్బన్ ఏఎస్పీ వైటీ నాయుడు

గుంటూరు: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వాన్ని పెంపొందిస్తాయని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ షేక్ జానీమూన్ అన్నారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం స్కేటింగ్ రింగ్‌లో ఆదివారం మూడో రాష్ట్ర స్థాయి శిలంబం కర్రసాము పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా జానీమూన్ తొలి రౌండ్ పోటీలను ప్రారంభించగా, అర్బన్ అడీషనల్ ఎస్పీ వైటీ నాయుడు రెండో రౌండ్‌ను ప్రారంభించారు. గ్రూపు ఈవెంట్‌ను శిలంబం కర్రసాము చైర్మన్ పొత్తూరి రామకృష్ణారావు ప్రారంభించగా, మహిళల పోటీలను ఎస్సీ, ఎస్టీ మైనార్టీ ప్రజా సమితి కో చైర్మన్ శివశంకర్ ప్రారంభించారు.

అనంతరం జానీమూన్ మాట్లాడారు. కర్రసాముతో స్వీయ రక్షణ పొందవచ్చన్నారు. క్రీడల ప్రోత్సాహానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. వైటీ నాయుడు మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలపైనా ఆసక్తిని చూపించాలని కోరారు.

వైద్య రంగంలో ఫిజియోథెరపీలు కీలకం



మాట్లాడుతున్న నూతలపాటి వీరప్రకాశరావు

గుంటూరు(సంగడిగుంట): వైద్య రంగంలో రోగికి పూర్తి స్వస్థత చేకూర్చడంలో ఫిజియోథెరపిస్టుల పాత్ర కీలకం అని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఏపీ, తెలంగాణా గవర్నర్‌ల ఫోరం చైర్మన్ నూతలపాటి వీరప్రకాశరావు అన్నారు. ఏసీ కళాశాలలో ఆదివారం కుగ్లర్ ఫిజియో థెరపీ డిగ్రీ కళాశాలల పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. క్రీడాకారులు టెండూల్కర్, సానియా, సింధూ వంటి వారికి ప్రభుత్వాలు ఇస్తున్న గుర్తింపు, వారి విజయాల్లో కీలక పాత్ర వహించే ఫిజియో థెరపిస్టులకు ఇవ్వక పోవడం శోచనీయమన్నారు. పూర్వ విద్యార్థులు, కళాశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ యోహాను బెంజిమెన్ అన్నారు. కార్యక్రమంలో చలపతిరావు, సవరం రోహిత్, గోళ్ల అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

'రోజా నోరు అదుపులో పెట్టుకో'

ఆంధ్రజ్యోతి-గుంటూరు : రోజా నోరు అదుపులో పెట్టుకోకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని మాజీ మంత్రి శనక్కాయల అరుణ హెచ్చరించారు. వైసీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో లక్ష్మీపురంలోని మదరథెరిస్సా విగ్రహానికి విన్నవించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అరుణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పంథంలో నడిపిస్తున్నటువంటి చంద్రబాబుపై ఆపార్టీ వారు చేస్తున్న వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఉమాదేవి మాట్లాడుతూ రోజా తన స్థాయిని మరిచి సీఎంను విమర్శిస్తున్నారని, పద్ధతిని మార్చుకోకుంటే తెలుగు మహిళా సంఘం తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నల్లపనేని విజయలక్ష్మి, ఎం. సత్యవాణి, పానకాల వెంకట మహాలక్ష్మి, మల్లె విజయ, తేరువళూరి పద్మావతి, రవణమ్మ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న తెలుగు మహిళలు

స్కూల్ అసిస్టెంట్లకూ ఉద్యోగోన్నతి కల్పించాలి

గుంటూరు(విద్య): ఈ నెల 29న ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్‌లో స్కూల్ అసిస్టెంట్లకూ ఉద్యోగోన్నతిని కల్పించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె బసవలింగారావు, సయ్యద్ చాంద్‌బాషా ఆదివారం డిమాండ్ చేశారు. పలనాడు ప్రాంతంలో అనేక ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్స్ కొరత తీవ్రంగా ఉందని, ఆయా సబ్జెక్టుల్లో సిలబస్ పూర్తికాక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. బదిలీల్లో, బదిలీలు అయిన తరువాత రిలీవర్స్ లేక కుటుంబాలకు దూరంగా ఉండడం వల్ల బోధన మీద దృష్టి సారించలేకపోతున్నట్లు తెలిపారు. దీనికి ఎస్‌జీటీల నుంచి స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతిని కల్పిస్తే సమస్య కొంత వరకు పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. మండల విద్యాశాఖాధికారుల పోస్టులనూ భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

నేత్రదానంపై అవగాహన

గుంటూరు : నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కోసం సక్షమ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. శంకర్ విలాస్‌సెంటర్ నుంచి లాడ్జీ సెంటర్ వరకు కళ్లకు గంతలు కట్టుకొని నడిచారు. ముఖ్యఅతిథులుగా దక్షిణాది రాష్ట్రాల కామ్‌బ ముఖ్య కార్యదర్శి డాక్టర్ సంతోష్, ఏపీ ఔషధ నిల్వలు, అభివృద్ధి కమిటీ చైర్మన్ లక్ష్మీపతి, నగరపాలక సంస్థ కమిషనర్ అనూరాధ, వెస్ట్ డీఎస్పీ సరిత, హైకోర్టు న్యాయవాది సాయికృష్ణ శ్రీనివాస్, పలువురు నేత్ర వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సక్షమ్ కార్యకర్తలు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వివరాలకు 94405-67513 నంబర్లో సంప్రదించాలని కోరారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు



టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు

ఆంధ్రజ్యోతి-గుంటూరు: వినాయక చవితి సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకుడికి ఆదివారం ప్రత్యేక పూజలను పార్టీ నాయకులు చేశారు. నిమజ్జనం సందర్భంగా లడ్డును వేలం వేయగా నగరానికి చెందిన గణేష్ దక్కించుకున్నారు. అనంతరం భారీ మేళతాళాల మధ్య, టీడీపీ కార్యాలయ సిబ్బంది కేరింతల నడుమ నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి ఏవీ. రమణ, నాలెడ్జ్ సెంటర్ కో ఆర్డినేటర్ గురజాల మాల్యాద్రి, దారపనేని నరేంద్ర, కుమార్ చౌదరి, హర్ష, రాంబాబు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొంది.

రేపు సీపీఎస్ రద్దు కోసం కలెక్టరేట్ వద్ద ధర్నా

గుంటూరు(విద్య): నూనత పెన్షన్ విధానం(సీపీఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని ఈనెల 29న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నట్లు ఎస్టీయూ అధ్యక్షకార్యదర్శులు వీవీ శ్రీనివాసరావు, ఎస్ రాచంద్రయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక భద్రతలేని సీపీఎస్ వల్ల ఉపయోగం లేదని పేర్కొన్నారు. వెంటనే దీనిని రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలుచేయాలని కోరారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

డాక్టర్ తారక్‌నాథ్‌కు గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందజేస్తున్న దక్షిణామూర్తి, సాంబశివుడు తదితరులు

తెనాలి రూరల్ : పట్టణానికి చెందిన గుండె వైద్య నిపుణుడు పాటిబండ్ల దక్షిణామూర్తి పేరుతో ప్రదానం చేస్తున్న గోల్డ్ మెడల్‌ను గుంటూరుకు చెందిన న్యూరాలజీ వైద్యుడు ప్రొఫెసర్ వి.రామతారక్‌నాథ్ ఆదివారం అందుకున్నారు. స్థానిక బోసు రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో ఆదివారం రాత్రి ప్రత్యేక కార్యక్రమంలో ఐఎంఏ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ చందు సాంబశివుడు, కార్యదర్శి అనిల్‌కుమార్, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి తదితరులు డాక్టర్ తారక్‌నాథ్‌కు గోల్డ్‌మెడల్ అందజేశారు. తూలుడు జబ్బు నివారణ చర్యలపైనా, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా డాక్టర్ రామ తారక్‌నాథ్ విపులంగా వివరించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు వైద్యులు పాల్గొన్నారు.

నగరంలో నేడు...

- ఉదయం 10 గంటల నుంచి నాజ్ సెంటర్‌లోని గుంటగ్రౌండ్‌లో చేనేత హస్త కళల ప్రదర్శన
- ఉదయం 10.30 గంటలకు జడ్పీ, ఎస్పీ, నగరపాలక సంస్థ, తహసీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే
- సాయంత్రం 4 గంటలకు హోలీ వుడ్, బాలీవుడ్ థియేటర్ల వెనుక బ్రాడీపేట ఎల్ఈఎం స్కూల్ గ్రౌండ్‌లో హ్యాండ్ లూమ్, హ్యాండీ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్
- సాయంత్రం నాలుగు గంటలకు చంద్రమౌళి నగర్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో వినియోగదారుల సమావేశం.



గుంటూరులోని ఏటీ అగ్రహారం 7వ లైనులో శ్రీ కుమారస్వామి సేవా సంఘం నేతృత్వంలో మెగా గణేశ్ యూత్ ఆధ్వర్యంలో రూ.80 వేల విలువైన నోట్లతో గణేశ ప్రతిమను అలంకరించారు.

క్లిక్.. పోస్ట్
Click.. Post

మీ దృష్టికి వచ్చిన, మీ ప్రాంతంలోని సామాజిక సమస్యను ఫొటో తీసి వాట్సాప్ ద్వారా ఆంధ్రజ్యోతికి పంపవచ్చు. సమస్యకు సంబంధించి క్లుప్తంగా వివరాలు, పేరు, ప్రాంతం తప్పనిసరిగా తెలియజేయాలి. నెంబర్ : 9985411212

రోడ్డే డ్రెయినేజీలా...



రాయపాటి శ్రీనివాసరావు కాలనీ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఎదుట మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి అధ్వానంగా తయారవుతోంది. చర్యలు చేపట్టగలరు (ఓ పాఠకుడు)

అధ్వాన రహదారులు



నగర శివారులోని మిర్చి యార్డు ప్రాంతంలో దుస్థితి ఇది. ఇక్కడి కామాక్షినగర్ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. నడిచేందుకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సిమెంటు రోడ్డు వేయించాలని స్థానికులు కోరుతున్నారు. (ఓ పాఠకుడు)

ఖాళీ స్థలాల్లో వర్షపునీరు..



● భానుప్రసాద్ కాలనీలో నిలిచిన వర్షపు నీరు. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. చర్యలు చేపట్టగలరు

(ఓ పాఠకుడు)



శ్రీనగర్ 7/5 మెగా యూత్ ఆధ్వర్యంలో..



నల్లచెరువు మెయిన్ రోడ్డులో...



సాకేతపురం సీతారామ ఆంజనేయ సేవా సమితి ఆధ్వర్యంలో..

బహురూప గణపతికి కైమోడ్పులు

● కోలాహలంగా చవితి పందిళ్లు
● భారీగా అన్నప్రసాద వితరణ

గుంటూరు(సాంస్కృతికం): వినాయక చవితి వేడుకలు ఆదివారం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పందిళ్లలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి విశేష పూజలు నిర్వహించారు. వివిధ రకాల వస్తువులతో బహురూప గణపతిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిళ్లలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



కాకుమాను వారితోట ఆంజనేయ స్వామి గుడి వద్ద...



కూరగాయల మార్కెట్ వద్ద ..

శ్రీనగర్ 7/3లో స్నేహ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో..



ఆర్ అగ్రహారం వాసవి యూత్ ఆధ్వర్యంలో ...







ఎమ్మెల్యే యరపతినేని సత్కరిస్తున్న కాకతీయ యూత్ సభ్యులు, స్కైలైన్ అపార్ట్‌మెంట్‌లో లడ్డుతో మన్నవ వంశీకృష్ణ కుటుంబ సభ్యులు, నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న గీతాంజలి అపార్ట్‌మెంట్ వాసులు

నిమజ్జనానికి తరలిన గణనాథులు

గుంటూరు (సాంస్కృతికం): నగరంలో గత రెండు రోజులుగా పూజలు అందుకున్న గణనాథులను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. ఉదయం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామిని నిమజ్జనానికి తరలించారు.

అలరించిన సంగీత కచేరి

స్థానిక అరండల్‌పేట సత్యనారాయణ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక చవితి పందిరిలో ఆదివారం శ్రీ త్యాగరాజ సంగీత కళాశాల ఆధ్వర్యంలో సంగీత కచేరి జరిగింది. తొలుత ఆలా సాంబశివరావు, చాగంటి రఘురామిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు కోమాండురి సింగర శేష శైల శయనం అయ్యంగార్ శిష్యులు కచేరి నిర్వహించారు. పలు కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. వీణపై కౌశిక్ అయ్యంగార్, క్యాషవాపై మహర్షి కౌశిక్ అయ్యంగార్, సాయి జగదీష్, మృదంగంపై టి లక్ష్మీ శంకర్, తబలాపై లంకా ప్రభాకర్, రిథమ్స్‌పై పి శశిధర్ వాద్య సహకారం అందించారు. కార్యక్రమానికి పెద్దింటి రంగవల్లి, చాగంటి భూలక్ష్మి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.

కాకతీయ యూత్ ఆధ్వర్యంలో..

డీఎస్‌నగర్ రాముల వారి గుడి వద్ద కాకతీయ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులు యరపతినేనిని సత్కరించారు.

స్కైలైన్ అపార్ట్‌మెంట్‌లో..

గుంటూరు: కంకరగుంట ఓవర్‌బ్రిడ్జి పక్కనగల స్కైలైన్ అపార్ట్‌మెంట్‌లో రెండు రోజులుగా అంగరంగవైభవంగా జరుగుతున్న వినాయక చవితి మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. బాణా సంచా కాల్పులు, మేళ తాళాలతో గణపతి నిమజ్జన ఊరేగింపు కోలాహలంగా జరిగింది. వడ్లమూడి కాలువలో నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు నిర్వహించిన గణపతి లడ్డు వేలం పాటలో మన్నవ వంశీ కృష్ణ రూ.13వేలకు లడ్డును దక్కించుకున్నారు. కార్యక్రమంలో స్కైలైన్ వెస్ట్‌ండ్ అధ్యక్షుడు మధుసూదనరావు, బొల్లా నాగేశ్వరరావు, ఈస్ట్‌ండ్ అధ్యక్షుడు నార్నె సాంబశివరావు, కార్యదర్శి బొల్లా సురేష్, పులి సదాశివారెడ్డి (విగ్రహ దాత), నాగభైరు మోహన్‌రావు, నరహరి శ్రీనివాసరావు, డి సత్యనారాయణ, మందడపు వెంకటశివరామ్‌ప్రసాద్(టీవీఎస్), కొత్తమాసు మల్లికార్జునరావు, ఇంటూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి అపార్ట్‌మెంట్‌లో..

గుంటూరు: గుంటూరు నగరంలోని గీతాంజలి అపార్ట్‌మెంట్‌లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం నిమజ్జన వేడుకలు కోలాహలంగా జరిగాయి. మహిళలు ఊరేగింపుగా బయలు దేరి వాహనం ముందు వారు పోసి, కొబ్బరికాయలు కొట్టి హారతులిచ్చారు. పిల్లలు జై బోలో గణేష్ మహరాజ్‌కి జై అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా లడ్డూకు వేలం నిర్వహించారు. అన్నదానం జరిగింది. అనంతరం సంగంజాగర్లమూడి వద్ద కాలువలో విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు తరలివెళ్లారు. కార్యక్రమంలో అపార్ట్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు కల్లూరి హరిబాబు, కార్యదర్శి ఈదర రామారావు తదితరులు పాల్గొన్నారు.





నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి నిమజ్జనానికి తరళివెళ్తున్న గణనాథులు

సేవా సదన్‌లో కంటి పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ సరిత

గుంటూరు (సాంస్కృతికం): భారత్‌పేట సేవా సదన్ కార్యాలయంలో సేవాసదన్, రెటీనా సూపర్ స్పెషాలిటి కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి పరీక్షల శిబిరం జరిగింది. శిబిరాన్ని పశ్చిమ డీఎస్పీ కేజీవీ సరిత ప్రారంభించారు. 200 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పేరం కోటేశ్వరరావు, మిరియాల ప్రసాదరావు, మిరియాల గోపికుమార్, జె నరసింహరావు, జి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సౌరభాలు

గుంటూరు (సాంస్కృతికం): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మహతి స్వరసుధ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అలనాటి సినీ సౌరభాలు ప్రేక్షకులను అలరించాయి. గాయనీ గాయకులు పత్రి నిర్మల, డాక్టర్ కుసుమాగాయత్రి, సీహెచ్ రాజ్యలక్ష్మి, ఎస్‌కే రసూల్ బాబు, కేజే ఉపేంద్ర సింగ్, జి వీరయ్య, పి లాలీత్య, ఎస్ సుఖి, శ్రావ్య మానస, సాహిత్య అలనాటి చిత్రాలలోని పలు మధుర గీతాలను ఆలపించారు. కార్యక్రమాన్ని సంస్థ కార్యనిర్వాహక కార్యదర్శి కె మదన మోహనరావు పర్యవేక్షించారు.



గీతాలాపన చేస్తున్న గాయనీ, గాయకులు

ఫార్మసిస్ట్ శివకుమార్‌కు మదర్ థెరిసా అవార్డు



రోశయ్య నుంచి అవార్డు అందుకుంటున్న శివకుమార్

గుంటూరు (మెడికల్): నగరానికి చెందిన పార్మసిస్టు ముంజంపల్లి శివకుమార్‌కు హెల్త్ కేర్ ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సంస్థ మదర్ థెరిసా సర్వీస్ అవార్డును అందజేసింది. హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య నుంచి ఆయన అవార్డు అందుకున్నారు. శివకుమార్ అమరావతి రోడ్‌లో జనరిక్ మందుల దుకాణం నిర్వహిస్తూ ప్రచారం చేస్తున్నారు. దీనికిగాను శివకుమార్‌ను మదర్‌థెరిసా అవార్డుకు ఎంపిక చేసినట్లు హెల్త్ కేర్ ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

ట్రాన్స్‌కో ఫోన్ నెంబర్లు

ప్రాంతాలు	- ఏఈ -	కార్యాలయం
బ్రాడీపేట	9440812287	- 2221760
గుజ్జనగుండ్ల	9440812288	- 2231151
కృష్ణనగర్	9440812291	- 2256506
గోరంట్ల	9440812290	- 2331200
వికాస్‌నగర్	8330938792	- 2221151
నగరంపాలెం	9440812289	- 2235447
చుట్టుగుంట	7382623147	- 2254065
నల్లచెరువు	9440812283	- 2324708

రక్త నిధి కేంద్రాలు

ప్రభుత్వాస్పత్రి	: 98854 98345
ఎన్టీఆర్ ట్రస్ట్	: 2338444, 2339444
నీడ్స్ బ్లడ్ బ్యాంక్	: 92464 48899
లయన్స్ విజన్	: 98859 09188
సెయింట్ జోసఫ్స్	: 2322700
పద్మావతిహాస్పిటల్	: 93941 10333

రైల్వే సమాచారం

- ఎంక్వైరీ : 139
  టోల్‌ఫ్రీ- (లాండ్‌లైన్ నుంచి మాత్రమే) :0863-2268959

ఫైర్ స్టేషన్

- పశ్చిమ:
  వినయ్‌కుమార్(ఎస్ఐ) - 9963731643
  తూర్పు:
  రామకృష్ణ (ఎస్ఐ) - 9963731857

క్లిక్.. పోస్ట్
Click.. Post

మీ దృష్టికి వచ్చిన, మీ ప్రాంతంలోని సామాజిక సమస్యను ఫొటో తీసి వాట్సాప్ ద్వారా ఆంధ్రజ్యోతికి పంపవచ్చు. సమస్యకు సంబంధించి క్లుప్తంగా వివరాలు, పేరు, ప్రాంతం తప్పనిసరిగా తెలియజేయాలి. నెంబర్ : 9985411212

రోడ్డే డ్రెయినేజీలా...



రాయపాటి శ్రీనివాసరావు కాలనీ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఎదుట మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి అధ్వానంగా తయారవుతోంది. చర్యలు చేపట్టగలరు (ఓ పాఠకుడు)

అధ్వాన రహదారులు



నగర శివారులోని మిర్చి యార్డు ప్రాంతంలో దుస్థితి ఇది. ఇక్కడి కామాక్షినగర్ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. నడిచేందుకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సిమెంటు రోడ్డు వేయించాలని స్థానికులు కోరుతున్నారు. (ఓ పాఠకుడు)

ఖాళీ స్థలాల్లో వర్షపునీరు..



● భానుప్రసాద్ కాలనీలో నిలిచిన వర్షపు నీరు. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. చర్యలు చేపట్టగలరు

(ఓ పాఠకుడు)



గుంటూరులోని ఏటీ అగ్రహారం 7వ లైనులో శ్రీ కుమారస్వామి సేవా సంఘం నేతృత్వంలో మెగా గణేశ్ యూత్ ఆధ్వర్యంలో రూ.80 వేల విలువైన నోట్లతో గణేశ ప్రతిమను అలంకరించారు.



శ్రీనగర్ 7/5 మెగా యూత్ ఆధ్వర్యంలో..



నల్లచెరువు మెయిన్ రోడ్డులో...



సాకేతపురం సీతారామ ఆంజనేయ సేవా సమితి ఆధ్వర్యంలో..

బహురూప గణపతికి కైమోడ్పులు

● కోలాహలంగా చవితి పందిళ్లు

● భారీగా అన్నప్రసాద వితరణ

గుంటూరు(సాంస్కృతికం): వినాయక చవితి వేడుకలు ఆదివారం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పందిళ్లలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామికి విశేష పూజలు నిర్వహించారు. వివిధ రకాల వస్తువులతో బహురూప గణపతిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిళ్లలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



కాకుమాను వారితోట ఆంజనేయ స్వామి గుడి వద్ద...



కూరగాయల మార్కెట్ వద్ద ..

శ్రీనగర్ 7/3లో స్నేహ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో..



ఆర్ అగ్రహారం వాసవి యూత్ ఆధ్వర్యంలో ...



నందివెలుగు రోడ్డు విస్తరణ రెండో దశ పనులు షురూ

లాలాపేట: నందివెలుగు రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే తొలి దశలో భాగంగా నందివెలుగు రోడ్డులోని రైల్వే గేటు నుంచి మణి హోటల్ సెంటర్ వరకు పనులు చేపట్టారు. రెండో దశలో మణిహోటల్ సెంటర్ నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు విస్తరణ పనులు చేపడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా గృహాల వారికి ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. దాంతో స్వచ్ఛందంగా కొందరు ఆక్రమణలు తొలగిస్తుండగా, మరికొన్ని ఆక్రమణలను నగరపాలక సంస్థ అధికారులు పూర్తిగా తొలగిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులతో రోడ్డు వెడల్పు 80 అడుగులకు చేరుకోనుంది. మూడో దశలో భాగంగా గాంధీ బొమ్మ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు రోడ్డును విస్తరణ పనులు చేపట్టనున్నారు. దాంతో ఎంతో కాలంగా నందివెలుగు రోడ్డులో ఎదుర్కొంటున్న ట్రాఫిక్ ఇబ్బందులు తొలగనున్నాయి. రోడ్డు విస్తరణపై వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఆక్రమణలు తొలగించిన పాతగుంటూరు నందివెలుగు రోడ్డు

ఫార్మసిస్ట్ శివకుమార్‌కు మదర్ థెరిస్సా అవార్డు


మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య నుంచి అవార్డు అందుకుంటున్న శివకుమార్

గుంటూరు (మెడికల్): ఔషధ రంగంలో చక్కటి సేవలు అందిస్తున్న గుంటూరు నగరానికి చెందిన ఫార్మసిస్టు ముంజంపల్లి శివకుమార్‌కు హెల్త్ కేర్ ఇంటర్నేషనల్ అనే స్వచ్ఛంద సంస్థ మదర్ థెరిస్సా సర్వీస్ అవార్డును అందజేసింది. హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య నుంచి ఆయన అవార్డు అందుకున్నారు. విద్య, వైద్యం, సామాజిక రంగాల్లో సేవలు అందిస్తున్న మొత్తం 26 మందికి ఈ కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేశారు. శివకుమార్ అమరావతి రోడ్‌లో ఐదేళ్లుగా జనరిక్ మందుల దుకాణం నిర్వహిస్తున్నారు. చౌకగా లభించే జనరిక్ మందులను సద్వినియోగం చేసుకోవాలని విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిని ప్రామాణికంగా తీసుకొని ప్రజారోగ్య రంగంలో ఔషధ వినియోగం, ఆరోగ్య సంరక్షణ అంశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న శివకుమార్‌ను మదర్ థెరిస్సా అవార్డుకు ఎంపిక చేసినట్లు హెల్త్ కేర్ ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

భాషకు అందని భావాలు పలికించేది సంగీతమే

విశ్రాంత శాస్త్రవేత్త చందు సాంబశివరావు

గుంటూరు (సాంస్కృతికం): ప్రతి ఒక్కరూ వారి మాతృభాషను రక్షించుకోవడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవచ్చనీ, తద్వారా లలిత కళలు నిరంతరం దేదీప్యమానంగా వెలుగొందుతాయనీ ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త చందు సాంబశివరావు పేర్కొన్నారు. స్థానిక పాత బస్టాండ్ ఉర్దూ హైస్కూల్‌లో చిష్టిస్ కల్చరల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం సుహానీ రాత్ -6 పేరుతో జరిగిన సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చందు సాంబశివరావును సంస్థ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం గాయనీ, గాయకులు రామ్‌దాస్, షహనావాజ్, ఎస్‌కె చిన్న ఆదం షఫి, కె బాబురావు, పిఎల్ అలీ ఖాన్, చిష్టి బాషా, వలి, రేఖ, సైనియాలు ఆలనాటి మేటి చిత్రాలలోని హిందీ, తెలుగు గీతాలను మధురంగా ఆలపించారు. అశోక్ బృందం వాద్య సహకారం అందించింది. కార్యక్రమాన్ని సంస్థ నిర్వాహకుడు పర్వేజ్ చిష్టి పర్యవేక్షించారు.


సత్కారం అందుకుంటున్న చందు సాంబశివరావు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

లాలాపేట: విద్యుత్‌లైన్ల ఏర్పాటులో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుంటూరు టౌన్ -4 ఏడీఈ ఎం సురేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పాతగుంటూరు జెండా చెట్టు సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్, శివాలయం రోడ్డు, జాకీర్‌హుస్సేన్ నగర్, రెడ్లబజార్, మణీహోటల్ సెంటర్, ఎల్‌బీ నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

వాసవి మిత్ర మండలి సేవలు అభినందనీయం

గుంటూరు(సంగడిగుంట): గత 14 సంవత్సరాలుగా వాసవి మిత్రమండలి చేస్తున్న సేవలు అభినందనీయమని ఏపీఎంఎస్ఐడీ చైర్మన్ లక్ష్మీపతి అన్నారు. సంగడిగుంట కన్యకాపరమేశ్వరి గుడి ఆవరణలో వాసవి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 500 మంది పేద విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, స్కాలర్‌షిప్పులు అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మీపతి మాట్లాడుతూ మారుతున్న సమాజంలో అందరూ విద్యావంతులు కావడం తప్పని సరన్నారు. అన్ని సమస్యలకు విద్యే పరిష్కారం చూపుతుందన్నారు. తెనాలి మున్సిపల్ చైర్మన్ పెండ్యాల వెంకటరావు మాట్లాడుతూ ఉచిత విద్య కల్పించడంలో ప్రభుత్వాలు సఫలం అవుతున్నా స్వచ్ఛంద సంస్థల సహకారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో అన్నా పూర్ణచంద్రరావు, వెంకటేశ్వరరావు, దేవస్థానం చైర్మన్ చిన్ని, వనమా నరేంద్ర, కొత్తూరి వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న లక్ష్మీపతి తదితరులు

వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ

గుంటూరు (సాంస్కృతికం): స్థానిక కొత్తపేట గిరిధారి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం వృద్ధులకు నిత్యావసర సరుకుల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బవిరిశెట్టి బాల చంద్రరావు, కార్యదర్శి పలకలూరి శివరావు, జవ్వాది లక్ష్మణ్, భవిరిశెట్టి శ్రీనివాసరావు, సోము నాగ భూషణం తదితరులు పాల్గొని 25 మంది పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

అలరించిన అలనాటి సినీ సౌరభాలు

గుంటూరు (సాంస్కృతికం): బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మహతి స్వరసుధ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అలనాటి సినీ సౌరభాలు ప్రేక్షకులను అలరింప చేశాయి. గాయనీ గాయకులు పత్రి నిర్మల, డాక్టర్ కుసుమా గాయత్రి, రాజ్యలక్ష్మి, ఎస్‌కె రసూల్ బాబు, కెజె ఉపేంద్ర సింగ్, జి వీరయ్య, పి లాలిత్య, ఎస్ సుఖి, శ్రావ్య మానస, సాహిత్య తమ గాత్రధారణలో అలనాటి చిత్రాలలోని పలు మధుర గీతాలను ఆలపించారు. కీబోర్డుపై కె రవి, తబలాపై పి బాలాజీ, ప్యాడ్స్‌పై కె చంద్ర వాద్య సహకారం అందించారు.

రాధాదేవి అవతరణోత్సవం రేపు

గుంటూరు (సాంస్కృతికం): స్థానిక పండరీపురం కోదండరామ మందిరంలో 29న రాధాదేవి అవతరణోత్సవం నిర్వహిస్తున్నట్లు బ్రహ్మాండం శేష గంగాధర శర్మ తెలిపారు. రాధాదేవికి ప్రత్యేక అభిషేకాలు, గులాబీ పూలతో సహస్ర నామార్చన జరుగుతాయన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

గుంటూరు: స్థానిక కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రైలుపేట 1వ లైనులో వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేశారు. బాలాజీ నగర్‌కు చెందిన లక్ష్మి రైలుపేట 1వ లైనులో ఇల్లు అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తోంది. సమాచారం అందుకున్న కొత్తపేట ఇన్‌చార్జి సీఐ బాలసుందరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటిపై దాడి చేశారు. లక్ష్మితో పాటు ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. లక్ష్మిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ట్రాన్స్‌కో ఫోన్ నెంబర్లు

ప్రాంతాలు	- ఏఈ -	కార్యాలయం
పొన్నూరురోడ్డు	9490618805	2119346
లిబర్టీ ఏరియా	9440812284	2221810
బస్టాండ్‌ఏరియా	9440812285	2224414
నెహ్రూనగర్	9440812292	2221760

రక్త నిధి కేంద్రాలు

ప్రభుత్వాస్పత్రి	98854 98345
ఎన్టీఆర్ ట్రస్ట్	2338444, 2339444
నీడ్స్ బ్లడ్ బ్యాంక్	92464 48899
లయన్స్ విజన్	98859 09188
సెయింట్ జోసఫ్స్	2322700
పద్మావతి హాస్పిటల్	93941 10333

ఫైర్ స్టేషన్

- తూర్పు:
  రామకృష్ణ (ఎస్ఐ) - 9963731857
  పశ్చిమ:
  వినయ్‌కుమార్(ఎస్ఐ) - 9963731643

రైల్వే సమాచారం

- ఎంక్వైరీ : 139
  టోల్‌ఫ్రీ- (లాండ్‌లైన్ నుంచి మాత్రమే) :0863-2268959